మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..

AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHBUBNAGAR | WARANGAL | KHAMMAM

అమరావతి | సంపుటి: 2 • సంచిక: 74 • పేజీలు: 8+8 • వెల: రూ.5 | సోమవారం • 12-2-2018 | www.manamnews.com | /manamnews



అవినీతిలో.. కర్ణాటక బీజేపీ వరల్డ్ రికార్డ్

సిద్దరామయ్య హయాంలో కుంభకోణాలు లేవు: రాహుల్

అయోధ్య నుంచి 'బాబ్రీ' తరలించాలి

వర్సిటీని నిర్మించాలి.. సమస్యకు పరిష్కారమిదే

ముస్లిం పర్సనల్ లా బోర్డు సభ్యుడి వ్యాఖ్య

ఆ వెంటనే సభ్యత్వం తొలగించిన బోర్డు



ఏ దేశంలో వైద్యవిద్యకైనా నీట్ రాయాల్సిందే!

నిబంధనలను కఠినతరం చేయనున్న ప్రభుత్వం

7లో..

ఏపీకి బీజేపీ.. మోసం?

కేంద్రంలో అన్ని పార్టీలకూ అనుమానం

- టీడీపీకి దేశంలోని అన్ని పక్షాల అండ
- కమలనాథుల మద్దతుతోనే రాష్ట్ర విభజన
- విభజనతో ఎన్నో ఆస్తులు కోల్పోయాం
- రాష్ట్ర బీజేపీ నేతలవి తప్పుడు లెక్కలు
- 90:10 నిష్పత్తిలో రాష్ట్రానికి నిధులివ్వాలి
- ఎప్పుడు ఏమిస్తుందో సమయం చెప్పాలి
- నష్టం జరిగితే సహించం : గల్లా జయదేవ్

అమరావతి, ఫిబ్రవరి 11 (మనం ప్రతినిధి):

బీజేపీ ఆంధ్రప్రదేశ్‌ను మోసం చేస్తుందా అని కేంద్రంలోని అన్ని పక్షాలు ఆ పార్టీ వైపు అనుమానంగా చూస్తున్నాయని గుంటూరు టీడీపీ ఎంపీ గల్లా జయదేవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశంలో అన్ని పార్టీలు ఏపీకి మద్దతు ఇస్తున్నాయని అన్నారు. ఏపీకి కేంద్రం సాయం చేయాలన్న విషయం రాష్ట్ర సమస్య కాదని, ఇప్పుడది జాతీయ ప్రధాన అంశమైందని చెప్పారు. ఏపీకి న్యాయం చేయాలని పార్లమెంట్‌లో అన్ని పక్షాలూ డిమాండ్ చేశాయని గుర్తు చేశారు. ఏపీకి న్యాయం చేయాల్సిన అవసరం ఉందని అందరికీ అర్థమైందన్నారు. కేంద్రం రాష్ట్రానికి ఎప్పుడు, ఏమి మిగతా 5లో..







స్వరం మారింది!


టీడీపీ-బీజేపీ బంధం తెగినట్లేనా?

- తెలుగు బీజేపీ నేతలదీ అదే మాట
- టీడీపీ 'అవినీతి'పై హరిబాబు ఫైర్
- రాజధాని నిర్మాణాలపై విష్ణు సెటైర్
- ఈవెంట్ మేనేజర్లకు దోచిపెడుతున్నారు
- టీడీపీపై తీవ్రస్థాయిలో విమర్శల వర్షం
- నియోజకవర్గాల కోసమే బాబు పోరు
- వాడి.. వేడి మరింత పెంచిన వీర్రాజు

విశాఖపట్నం, ఫిబ్రవరి 11 (మనం న్యూస్‌బ్యూరో):

ఇన్నాళ్లూ కొంతమంది నాయకులు ఉంచుదాం అంటే.. మరికొందరు తెంచుదాం అనేవారు. కానీ ఇప్పుడు మాత్రం పరిస్థితి పూర్తిగా మారిపోయినట్లే కనిపిస్తోంది. రాష్ట్రంలో మిత్రపక్షమైన తెలుగుదేశం పార్టీతో బంధాన్ని తెంచుకోవాలన్న ఉద్దేశానికి బీజేపీ వచ్చేసినట్లే కనిపిస్తోంది. ఇప్పటివరకు తెలుగు బీజేపీగా ముద్రపడిన కమలం పార్టీలోని టీడీపీ అనుకూల నేతలు కూడా వైఖరిని మార్చుకుంటున్నట్లే కనిపిస్తున్నారు. కేంద్రం నుంచి స్పష్టమైన ఆదేశాలు అందడం వల్లే వాళ్లు మిగతా 5లో..

ఇదీలోకం!



ఆ ఇద్దర్నీ పిలిచి.. ఓట్లు వేయమని చెప్తే సరి.. నిజం కక్కేస్తారు సార్..!



అబుధాబిలో.. తొలి హిందూ ఆలయం

7లో..

- శంకుస్థాపన చేసిన ప్రధాని నరేంద్రమోదీ
- బీఏపీఎస్ ఆధ్వర్యంలో 2020 కల్లా పూర్తి
- భూమి ఇచ్చిన పాలకులకు కృతజ్ఞతలు
- ప్రవాస భారతీయులనుద్దేశించి ప్రసంగం
- దేశంలో చేపట్టిన సంస్కరణలపై వివరణ

లెక్కలు చెప్పండి!

విభజన హామీలపై ప్రజల పక్షాన ప్రశ్నిస్తున్నా

- ఈ నెల 15లోగా వెల్లడించాలని డిమాండ్.. నిధులిచ్చామని బీజేపీ.. రాలేదంటున్న టీడీపీ
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మాటల్లో తేడా ఏల?.. నిజానిజాలేమిటో జనంలోనే తేలుద్దాం రండి
- రెండ్రోజుల్లో సంయుక్త నిజ నిర్ధారణ కమిటీ.. విలేకరులతో జన సేనాధిపతి పవన్ కల్యాణ్
- ప్రభుత్వాలు అబద్ధమాడవు.. నిజమూ చెప్పవు.. వాస్తవం వెల్లడి కావాల్సిందే: ఉండవల్లి



హైదరాబాద్, ఫిబ్రవరి 11 (మనం ప్రతినిధి):

ఆంధ్రప్రదేశ్ విభజన హామీలపై జన సేనాధిపతి పవన్ కల్యాణ్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను నిలదీశారు. ప్రత్యేక రాష్ట్రం కోరిన తెలంగాణకు తదనుగుణంగా న్యాయం చేసినా, ప్రత్యేక హోదా ఇస్తామని ఏపీకి ఇచ్చిన వాగ్దానం నెరవేర్చలేదని పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయంపై పార్లమెంటు మిగతా 5లో..



రజనీ 'కాషాయం' అయితే..

పొత్తు ఉండదు

6లో..

- ఓ అవగాహనకు రావాల్సి ఉంది
- స్నేహం.. రాజకీయాలు వేర్వేరు
- ప్రజల కోసమే రాజకీయాల్లోకి
- 21న కీలక ప్రకటన: కమల్

వాతావరణం



తెలుగు రాష్ట్రాల్లో సోమవారం పొడి వాతావరణం నెలకొంటుంది. పగటి, రాత్రి ఉష్ణోగ్రతలలో మార్పులేదు. చలిగాలుల తీవ్రత స్వల్పంగా తగ్గుతుంది. గంటకు 16 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 32 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 17 డిగ్రీలు

గాలిలో తేమ: 69 శాతం

ముహూర్తం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం, తిథి: ద్వాదశి రా.8.05 తదుపరి త్రయోదశి; నక్షత్రం: పూర్వాషాఢ రా.2.01 తదుపరి ఉత్తరాషాఢ; వర్జ్యం: ఉ.7.59-9.47; దుర్ముహూర్తం: మ.12.08-12.53, మ.3.10-3.56; రాహుకాలం: ఉ.8.14-9.39; అమృతఘడియలు: రా.8.39-10.27; శుభసమయం: ఉ.6.00-7.00.

సూర్యోదయం: 6.48

సూర్యాస్తమయం: 6.13

కూలిన విమానం.. 71 మంది మృతి

- మృతుల్లో 65 మంది ప్రయాణికులు
- రష్యా రాజధాని మాస్కోలో దుర్ఘటన
- బయల్దేరిన కొద్ది నిమిషాలకే విషాదం
- అధ్యక్షుడు పుతిన్ ప్రగాఢ సంతాపం

మాస్కో, ఫిబ్రవరి 11:

రష్యా రాజధాని మాస్కోలో ఆదివారం పౌర విమానం ఒకటి కూలిపోవడంతో 71 మంది మరణించారని వివిధ వార్తా సంస్థలు పేర్కొన్నాయి. రాజధానిలోని దోమోదెదోవో విమానాశ్రయం నుంచి బయల్దేరిన సరటోవ్ ఎయిర్‌లైన్స్ విమానం కేవలం కొద్ది నిమిషాల్లోనే రాడార్ తెరలనుంచి అదృశ్యమైంది. అనంతరం కాసేపటికే అది కూలిపోగా 65 మంది ప్రయాణికులు, ఆరుగురు మిగతా 5లో..






టీడీపీనే ప్రజలకు జవాబుదారీ

మూడున్నరేళ్లు నిద్ర.. నేడు అన్యాయం జరిగిందని గగ్గోలు

- స్వలాభం కోసమే ఎంపీల డ్రామా
- ఎన్నికలు దగ్గర పడటంతోనే నిరసన
- సీపీఎం పొలిట్‌బ్యూరో నేత ప్రకాశ్ కారత్

భీమవరం, ఫిబ్రవరి 11 (మనం న్యూస్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు తెలుగు దేశం పార్టీనే జవాబుదారీ అని, విభజన హామీలపై ప్రభుత్వం సమాధానం మిగతా 5లో..



ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులతో కలసి తిరుమల వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న తెలంగాణ మంత్రి టి.హరీశ్ రావు



ఆదివారం నెల్లూరు జిల్లా ప్రజా సంకల్పయాత్రలో పాల్గొన్న వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి

ఏసీబీ దూకుడు

మూడేళ్లలో 500కు పైగా కేసులు.. 2500 కోట్ల అక్రమాస్తుల గుర్తింపు

- **కొనసాగుతున్న దాడుల పరంపర**
- **విపరీతంగా పెరుగుతున్న అవినీతి**
- **సర్వేలోనూ ప్రజల నుంచి ఫిర్యాదులు**

(మనం ప్రతినిధి - అమరావతి)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అవినీతి నిరోధక సంస్థ (ఏసీబీ) తన దూకుడును కొనసాగిస్తోంది. అవినీతి, అక్రమాలను తుదముట్టించేందుకు తన వంతుగా విశ్వప్రయత్నం చేస్తోంది. మునుపెన్నడూ లేని స్థాయిలో గత మూడేళ్లుగా ప్రతాపం చూపుతూ అవినీతిపరుల గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తోంది. 2015 నుంచి ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 500కు పైగా కేసులు నమోదు చేసి, అక్రమార్కుల ఆటకట్టించింది. మార్కెట్ విలువ ప్రకారం రూ. 2500 కోట్ల విలువైన అక్రమాస్తులను గుర్తించి, స్వాధీనం చేసుకుంది. కొత్త సంవత్సరంలో మరింత దూకుడు పెంచి లంచావతారులకు చుక్కలు చూపిస్తోంది. ఒక్క నెలలోనే 12 కేసులు నమోదుచేసి, దాదాపు రూ. 300 కోట్ల విలువ కలిగిన ఆస్తులను గుర్తించింది. ఏసీబీ దూకుడు చూసి అవినీతికి అలవాటు పడిన ఉద్యోగులు, అధికారులు కలవరపడుతున్నారు. ఏ నిమిషంలో తమపై ఎలాంటి దాడులు జరుగుతాయో, ఎక్కడ దొరికేస్తామో, ఎవరు ఫిర్యాదు చేస్తారోనని అటూఇటూ చూసుకుంటూ బిక్కుబిక్కుమంటూ ఉద్యోగం చేస్తున్నారు.



ఉద్యోగుల్లో కలవరం

ఏసీబీ దూకుడును ప్రదర్శిస్తుండటంతో అధికారుల్లో కలవరం మొదలైంది. తమ వరకు వచ్చినప్పుడు చూద్దాంలే అనుకున్న వారంతా.. ఇప్పుడు వణికిపోతున్నారు. ఉద్యోగంలో చేరిన దగ్గర నుంచి రికార్డును ట్రాక్ చేసి, ఆస్తుల చిట్టాను బయటకు తీస్తుండటంతో అక్రమార్కులకు ముద్ద మింగుడుపడటం లేదు. పెద్దస్థాయి అధికారులను కూడా వదలకుండా దాడులు చేస్తుండటం ఈ కలవరానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది.

పెరుగుతున్న అవినీతి

రాష్ట్రంలో డిజిటల్ పాలనకు శ్రీకారం చుడుతున్నా.. అవినీతి ఏమాత్రం తగ్గడం లేదనడానికి ఏసీబీ దాడులే ప్రత్యక్ష నిదర్శనం. దాదాపు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు అవినీతికి కేంద్రాలుగా మారిపోయాయి. ప్రజలతో అత్యధిక సంబంధాలు నెరపే శాఖల్లో ఈ అవినీతి మరింత విస్తృతంగా ఉంటోంది. పలు శాఖల్లో కింది స్థాయి ఉద్యోగి నుంచి పై స్థాయి ఉన్నతాధికారుల వరకు అక్రమార్జనకు అలవాటు పడిపోయారు. ఎంతో కొంత డబ్బును ముట్టజెప్పనిదే పని అయ్యే పరిస్థితి కనిపించటం లేదు. ప్రజలు కూడా తమ పని త్వరగా అవ్వడమే ముఖ్యమని.. అవతలివాళ్ల చేతులు తడిపేందుకు వెనుకాడటం లేదు. మున్సిపల్, రవాణా, వాణిజ్యపన్నులు, రెవెన్యూ, పోలీస్, ప్రభుత్వాసుపత్రుల్లో లంచాలు ఇస్తేనే పని జరుగుతుందనే స్థితి కనపడుతోంది. మరోవైపు ప్రభుత్వం చేపడుతున్న ఐవీఆర్ఎస్ సర్వేలోనూ అవినీతిపైనే ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వ పాలన ఎలా ఉందనే ప్రశ్నకు చాలామంది అవినీతి విపరీతమైపోయిందని అసంతృప్తిని వెళ్లగక్కుతున్నట్లు తెలియవచ్చింది.

సోదాలన్నీ సక్సెస్

అక్రమార్కుల పని పట్టేందుకు ఏసీబీ తనవంతు ప్రయత్నాలు చేస్తోంది. ఇటీవలి కాలంలో సెంట్రల్ టీం చేపట్టే ఏ ఒక్క రైడ్ కూడా ఇంతవరకు ఫెయిల్ కాలేదు. అందిన సమాచారాన్ని గోప్యంగా ఉంచుతూ పని పూర్తి చేస్తున్నారు. అక్రమాస్తుల కేసు తమ దృష్టికి వస్తే ఆరు నెలలపాటు వర్కవుట్ చేసి.. మొత్తం చిట్టా అంతా బయటకు తీసి.. ఆ తర్వాత ఏకకాలంలో దాడులు చేస్తున్నారు.

భారీగా అక్రమాస్తుల గుర్తింపు

ఉద్యోగాన్ని అడ్డుపెట్టుకుని విపరీతంగా అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ రూ. కోట్లు గడించిన అధికారుల ఆగడాలను కట్టించేందుకు ఏసీబీ తీవ్రస్థాయిలోనే శ్రమిస్తోంది. 2015 నుంచి 2018లో ఇప్పటివరకు 120కు ఆదాయానికి మించిన ఆస్తుల కేసులను నమోదు చేసింది. ఒక్కో అధికారి కనీసం రూ. 20కోట్లకు తగ్గకుండా ఆస్తులను కూడబెట్టారు. మున్సిపల్, వాణిజ్య, రవాణా శాఖల్లో ఉన్నతాధికారులగా పనిచేస్తూ, ఏసీబీ దాడుల్లో బండారం బయటపడిన వారైతే సరాసరి రూ. 100 - 800 కోట్ల వరకు అక్రమార్జన చేశారు. 2016లో ఉప రవాణా శాఖాధికారి ఆదిమూలం మోహన్‌పై దాడులు చేసి, అధికారులే షాక్ తిన్నారు. తవ్వే కొద్దీ అతని అక్రమాస్తులు వెలుగు చూస్తూనే ఉన్నాయి. మార్కెట్ విలువ ప్రకారం అతను కూడబెట్టింది అక్షరాలా రూ. 800 కోట్లు. 2017 ఏప్రిల్ నెలలో ఆర్అండ్‌బీ ఇంజనీర్ గంగాధరం ఆస్తులపై దాడులు చేపట్టి రూ. 80 కోట్ల ఆస్తులను గుర్తించారు. నాలుగురోజుల క్రితం వాణిజ్యపన్నుల శాఖాధికారి లక్ష్మీప్రసాద్ ఇళ్లపై చేస్తే.. రూ. 150కోట్ల విలువైన ఆస్తులు బయటపడ్డాయి. వారం రోజుల క్రితం విశాఖపట్నంలో పనిచేస్తున్న టౌన్‌ప్లానింగ్ జాయింట్ డైరెక్టర్ ప్రదీప్ కుమార్ ఇళ్లపై దాడులు నిర్వహించి రూ. 100 కోట్ల ఆస్తులను గుర్తించింది.

సంవత్సరం	ట్రాప్ కేసులు	అధికాదాయం కేసులు
2015	141	22
2016	105	50
2017	137	45
2018	10	03



తీర్పు ఆలస్యం కాకూడదు

- న్యాయ వ్యవస్థ ప్రతిష్ఠ పెంచాలి
- సుప్రీం జస్టిస్ రంజన్ గొగోయ్

విజయవాడ, ఫిబ్రవరి 11 (మనం న్యూస్): కేసులు పరిష్కరించి తీర్పులు వెల్లడించడంలో ఆలస్యం ఉండకూడదని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ అన్నారు. ఆదివారం విజయవాడలో జరిగిన బెజవాడ బార్ అసోసియేషన్ 111వ వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కక్షిదారులకు న్యాయం అందించేందుకు ప్రతి న్యాయవాది చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. వేగవంతమైన తీర్పుల ద్వారా న్యాయవ్యవస్థ ప్రతిష్ట పెంచాలని సూచించారు. బార్, బెంచ్.. న్యాయవ్యవస్థకు రెండు కళ్లు అని ఆయన అన్నారు. న్యాయం కోసం కక్షిదారులు ముందుగా న్యాయవాదులను సంప్రదిస్తారని, జడ్జిల కన్నా లాయర్ల సంఖ్య ఎక్కువగా ఉందని, కాబట్టి న్యాయం చేసే ప్రక్రియలో న్యాయవాదుల పాత్ర అధికంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రతి న్యాయవాది గుర్తెరగాలన్నారు. న్యాయవాదులు సామాజిక బాధ్యతతో మెలగాలని సూచించారు. జాతీయ వినియోగదారుల ఫోరం దక్షిణాది బెంచ్ విజయవాడలో ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. అనంతరం సుప్రీం న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ మాట్లాడుతూ న్యాయవాదులు నైపుణ్యాలు పెంచుకోవాలన్నారు. త్వరితగతిన రాష్ట్రంలో హైకోర్టు నిర్మాణానికి ప్రభుత్వం కృషి చేయాలని మంత్రి కొల్లు రవీంద్రకు సూచించారు. న్యాయపరిపాలన తెలుగులో జరగాలని అన్నారు. జిల్లా తాలూకా స్థాయిల్లో తెలుగులో న్యాయపాలన సాగేలా న్యాయమూర్తులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట న్యాయ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ న్యాయవాదులకు డెత్ బెనిఫిట్స్ పెంచామని అన్నారు. విజయవాడ కోర్టుల భవన నిర్మాణానికి రూ.86.66 కోట్లు మంజూరు చేశామని చెప్పారు.

ఏపీకి రూ.588 కోట్లు

- స్మార్ట్ సిటీస్ మిషన్‌లో కేటాయింపు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ సిటీస్ మిషన్‌లో భాగంగా రూ.9,940 కోట్లు విడుదల చేసింది. అత్యధికంగా మహారాష్ట్రకు రూ.1,378 కోట్లు కేటాయించగా, ఆ తర్వాత మధ్యప్రదేశ్‌కు రూ.984 కోట్లు ఇచ్చినట్టు ప్రభుత్వ గణాంకాల ద్వారా వెల్లడైంది. ఆంధ్రప్రదేశ్‌కు 588 కోట్లు విడుదల చేసింది. ఏపీలో నాలుగు నగరాల అభివృద్ధికి ఈ మేరకు నిధులు కేటాయించింది. స్మార్ట్ సిటీస్ కార్యక్రమం కింద కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ 99 నగరాలను గుర్తించింది. మహారాష్ట్రలో పుణె, నాసిక్ సహా ఎనిమిది నగరాలను, మధ్యప్రదేశ్‌లో ఏడు నగరాలను ఎంపిక చేసింది. ఇక తమిళనాడులో అత్యధికంగా 11 నగరాల అభివృద్ధికి 848 కోట్లు, కర్ణాటకలోని ఏడు నగరాలకు 836 కోట్లు, రాజస్థాన్‌లోని నాలుగు నగరాలకు 784 కోట్ల నిధులు విడుదల చేసింది. ఉత్తరప్రదేశ్‌లోని 10 నగరాలకు 547 కోట్లు, గుజరాత్‌కు 509 కోట్లు కేటాయించింది. కేంద్రం విడుదల చేసిన ఈ నిధులతో ఆయా నగరాల్లో స్మార్ట్ రోడ్లు, తాగునీటి సరఫరాను మెరుగు పరచడం, సైకిల్ ట్రాక్స్, పాదచారుల కోసం ట్రాక్, స్మార్ట్ క్లాస్ రూమ్స్, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు, ఆరోగ్య సౌకర్యాల మెరుగు, పాన్ సిటీ ప్రాజెక్టులను నిర్మించనున్నారు.

2019లో ఒంటరిగా పోటీ చేస్తాం

- **రాష్ట్రానికి కేంద్రం అన్యాయం చేయలేదు**
- **అసెంబ్లీ సీట్లు పెంచలేదనే టీడీపీ లొల్లి: బీజేపీ నేత హరీశ్ బాబు**

కర్నూలు, ఫిబ్రవరి 11 (మనం న్యూస్): ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం ఏ అన్యాయం చేయలేదని, టీడీపీ ప్రభుత్వానికి అన్ని రకాలుగా సాయం చేసిందని కర్నూలు జిల్లా బీజేపీ అధ్యక్షుడు హరీశ్ బాబు చెప్పారు. ఆదివారం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో జరిగిన పార్టీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీజేపీ ఏనాడు మిత్రధర్మాన్ని విస్మరించలేదన్నారు. కేంద్రం వేల కోట్ల రూపాయలు నిధులు ఇచ్చినా చంద్రబాబు ఎక్కడా ప్రధానిమోదీ ఫోటో పెట్టలేదన్నారు. అయినా కూడా తాము మిత్రధర్మాన్ని పాటించి టీడీపీపై విమర్శలు చేయాలేదని చెప్పారు. ఇప్పుడు ఏపీకి అన్యాయం చేస్తున్నారంటూ టీడీపీ రోడ్డెక్కడం విడ్డూరంగా ఉందన్నారు. 2019 ఎన్నికల్లో అవసరమైతే అన్ని స్థానాల్లో ఒంటరిగా పోటీ చేస్తామని అన్నారు. కేవలం రాష్ట్రంలో అసెంబ్లీ సీట్ల సంఖ్య పెంచలేదన్న కారణంతోనే టీడీపీ కేంద్రంపై గొడవకు దిగుతోందని ఆరోపించారు. టీడీపీ నేతలు బీజేపీని వదులుకొంటే.. వచ్చే ఎన్నికల్లో స్వతంత్రంగా పోటీ చేసేందుకు కూడా సిద్ధమని స్పష్టం చేశారు.

ఎస్టీల్లో చేర్పులొద్దు

- గిరిజనులకు అన్యాయం చేస్తే టీడీపీకి పుట్టగతులుండవ్
- ఐక్యవేదిక హెచ్చరిక.. నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరసన

విశాఖపట్నం, ఫిబ్రవరి 11 (మనం న్యూస్ బ్యూరో): బోయలు, మత్స్యకారులు వంటి ఇతర కులాలను ఎస్టీల జాబితాలో చేర్చాలనే నిర్ణయంపై ప్రభుత్వం వెనక్కి తగ్గకపోతే తీవ్ర పరిణామాలను ఎదుర్కొవాల్సి ఉంటుందని గిరిజన ఐక్యవేదిక హెచ్చరించింది. కొత్తవారికి రిజర్వేషన్ల కల్పించే పనిని పక్కన పెట్టి 2014 ఎన్నికల మానిఫెస్టోలో గిరిజన సంక్షేమానికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేసింది. ఆదివారం విశాఖపట్నంలోని గిరిజన భవన్‌లో ఐక్య వేదిక రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. గిరిజనులకు అన్యాయం చేస్తే టీడీపీకి పుట్టగతులుండవని గిరిజన నేత వివేక్ వినాయక్ హెచ్చరించారు. ఇతర కులల వారిని గిరిజనుల జాబితాలో చేర్చే ప్రయత్నం చేస్తే వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి గిరిజనులు గట్టి గుణపాఠం చెబుతారన్నారు. కొత్తగా ఎవరినీ ఎస్టీల జాబితాలో చేర్చవద్దంటూ రౌండ్ టేబుల్ తీర్మానం చేసినట్లు తెలిపారు. కాగా, తనకు కులం, మతం లేదని ప్రకటించుకొనే పవన్ కల్యాణ్ కులాల రిజర్వేషన్లకు మద్దతుపలకడమేమిటని సమావేశంలో పలువురు వక్తలు ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ నెల 12 నుంచి 28 వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని రౌండ్ టేబుల్ పిలుపునిచ్చింది. ఈ నెల 12న గిరి దీక్షలు, 15న పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మల దహనం, 17న కలెక్టరేట్ల వద్ద నిరసనలు చేపట్టాలని నిర్ణయించామని వివేక్ వినాయక్ తెలిపారు.

శ్రీరామ్ ప్రాపర్టీస్‌పై పోరు

- **ఫ్లాట్లు ఇస్తామని 200 కోట్లు వసూలు**
- **విశాఖలో ఆరేళ్లుగా పూర్తికాని నిర్మాణం**
- **ఆఫీసు వద్ద కొనుగోలుదారుల ధర్నా**

విశాఖపట్నం, ఫిబ్రవరి 11 (మనం న్యూస్ బ్యూరో): తక్కువ మొత్తంలో మంచి ఫ్లాట్లు కట్టిస్తామని కోట్లు వసూలు చేసిన శ్రీరామ్ ప్రాపర్టీస్‌పై కొనుగోలుదారులు పోరాటానికి దిగారు. ఆరేళ్ల క్రితం డబ్బులు తీసుకుని నేటికీ తమ ఫ్లాట్లు అప్పగించకపోవడంతో ఆగ్రహంతో తిరగబడ్డారు. విశాఖపట్నంలోని మధురవాడలో శ్రీరామ్ పనోరమ పేరిట వుడా నుంచి కొనుగోలు చేసిన భూముల్లో 645 ఫ్లాట్ల అపార్ట్‌మెంట్ నిర్మాణాన్ని 2012లో ప్రారంభించిన శ్రీరామ్ సంస్థ నేటికీ వాటి నిర్మాణం పూర్తి చేసి అప్పగించలేదు. కొనుగోలుదారులంతా మధ్యతరగతి జీవులే. తమ కష్టాన్ని రూపాయీ.. రూపాయి కూడబెట్టి సొంతింటి కల తీర్చుకుందామనుకుంటే ఈ అన్యాయ మేంటంటూ పోరుకు దిగారు. కొనుగోలుదారులంతా ఏకమై ఆ సంస్థ కార్యాలయం ఎదుట ఆదివారం ధర్నా చేశారు. 2014కల్లా అపార్టుమెంట్ల నిర్మాణం పూర్తి చేసి ఎవరి ఫ్లాట్లు వారికి అప్పగించేస్తామని కంపెనీ యాజమాన్యం చెప్పిందని, ఇప్పుడేమో వాయిదాలు వేసుకుంటూ వస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమకు వాటిని అప్పగించాలని, లేకుంటే శ్రీరామ్ ప్రాపర్టీస్ ఎండీ మురళీని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. శ్రీరామ్ ప్రాపర్టీస్ మంచి పేరున్న సంస్థ కావడంతో కావడంతో ఫ్లాట్‌లను బుక్ చేసుకున్నామని, ఈ ఫ్లాట్‌లను చదరపు అడుగు రూ.2800 నుంచి రూ.3500 వరకు చెల్లించామని కొనుగోలుదారులు చెప్పారు. అందరి దగ్గర కలిపి సుమారు రూ.200 కోట్లు వసూలు చేశారని, ఇప్పుడు ఫ్లాట్లు అప్పగించమంటే తాత్సారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2014లోనే అప్పగిస్తామని చెప్పి నాలుగేళ్లుగా తమని మభ్యపెడుతున్నారని అన్నారు. ఇకనైనా అప్పగించాలని, లేదా కంపెనీ ఎండీ మురళీని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

ఇదేం 'పంచాయితీ'..!

- విధులు నిర్వర్తించాలంటే దిగులు
- పని ఒత్తిడితో ఆరోగ్యం చిత్తు
- రోజువారీ లక్ష్యాలతో ఆందోళన
- 3 పంచాయతీలకు ఒకే కార్యదర్శి
- అప్పులు చేసి 'నేతలకు' సేవలు
- సిగ్నల్స్ లేక 'ఆన్‌లైన్' తంటాలు
- ప్రజలకు తప్పని ఇబ్బందులు
- కొత్త నియామకాలు ఎప్పడో?

అమరావతి, ఫిబ్రవరి 11 (మనం ప్రతినిధి): గ్రామాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న పంచాయతీ కార్యదర్శులు రాష్ట్రంలో తీవ్ర పని ఒత్తిడితో నలిగిపోతున్నారు. ప్రతి గ్రామ పంచాయతీకి కార్యాలయానికి ఒక కార్యదర్శి ఉండాలి గానీ, ఉద్యోగ విరమణ, బదిలీలు, పోస్టులు భర్తీ కాకపోవడంతో ఒక్కొక్కరిపై మూడు, నాలుగు పం చాయతీల బాధ్యతలు పడుతున్నాయి. దీనితో కార్యదర్శులు ఏ గ్రామానికీ సరైన న్యాయం చేయలేక అవస్థలు పడుతున్నారు. ప్రజలకు పనులు కావడం లేదు, మరోవైపు గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి సరఫరా, విద్యుత్ దీపాల నిర్వహణ, అంతర్గత రహదారులు, ఇంటి పన్నుల వసూలు లాంటి పనులు కూడా నిలిచిపోతున్నాయి. పై అధికారులు వరుసగా ఏదో ఒక పని చెప్పడం, గడువుతో లక్ష్యాలు నిర్దేశించడంతో కార్యదర్శులు నలిగిపోతున్నారు. పని ఒత్తిడితో అనారోగ్యం బారిన పడుతున్నారు. ఉదయం 6 గంటలకే ఇంటి నుంచి బయలు దేరిన ఉద్యోగులు రాత్రి 9గంటలకు గానీ ఇంటికి చేరడం లేదు. మరో వెపు ఇప్పటికే పంచాయతీ కార్యాలయంలో బయోమెట్రిక్ అమలు మొదలైంది. దీంతో కార్యదర్శులు విధులకు హాజరవ్వాలంటేనే దిగులు చెందుతున్నారు. క్షేత్రస్థాయిలో బయటకు వెళ్లి పనిచేయాల్సి ఉన్నప్పుడు బయోమెట్రిక్ ఎలా కుదురుతుందని వాపోతున్నారు.

34 రకాల విధులు...

పంచాయతీ కార్యదర్శులు పరిపాలన సంక్షేమం, సమన్వయం కోసం 34 రకాల విధులు చేపట్టాలి. రికార్డుల నిర్వహణ, భూములు, ఆస్తుల పరిరక్షణ, గ్రామసభల ఏర్పాటు, పన్నుల వసూలు, గ్రామపంచాయతీ తీర్మానాల అమలు, జనన మరణ ధ్రువీకరణ, మహిళా శిశు సంక్షేమ పథకాల అమలు, లబ్ధిదారుల గుర్తింపు, వివిధ రుణాల పంపిణీ, పింఛన్ల పంపిణీ చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి. పొదుపు సంఘాలను ప్రోత్సహించాలి. తాగునీరు, పారిశుధ్యం, విద్యుదీకరణ కూడా చూసుకోవాలి. కానీ చాలాచోట్ల మూడు నాలుగు పంచాయతీలకు ఒక్కరే కార్యదర్శి ఉండటంతో.. అన్ని గ్రామాలకు వెళ్లాల్సి రావడంతో, ఏ గ్రామానికీ సరైన న్యాయం చేయలేకపోతున్నారు. ఇంత చేసినా, హోదాలో తమకన్నా తక్కువ అయిన వీఆర్వో కూడా పంచాయతీ కార్యదర్శి మాట వినే పరిస్థితి లేదంటే... వీరి ఇబ్బందులు ఏమిటో అర్థం చేసుకోవచ్చు.

సెలవు రోజూ ఆఫీస్‌కు...

మార్చి నాటికి ఆంధ్రప్రదేశ్‌ను ఓడీఎఫ్ (సంపూర్ణ బహిరంగ మలవిసర్జన రహిత) రాష్ట్రంగా ప్రకటించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉంది. ఇటీవల శ్రీకాకుళం జిల్లాలో సీఎం చంద్రబాబు మరుగుదొడ్ల నిర్మాణంలో జాప్యంపై మాట్లాడారు. మరుగుదొడ్లు నిర్మాణం అనుకున్న సమయానికి కలెక్టర్లు పూర్తి చేయకపోతే...'మీ ఇంటి ముందు కూర్చొని నిరసన చేస్తా'నని ప్రకటించారు. దీంతో కలెక్టర్లు దీనిపై దృష్టి సారించారు. త్వరగా పూర్తి చేయాలని పంచాయతీ సిబ్బందిని పరుగులు తీయిస్తున్నారు. ఆ లక్ష్యం పూర్తయ్యేవరకు పంచాయతీల బిల్లులన్నింటినీ ఆపేస్తామని కొందరు కలెక్టర్లు మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. పింఛన్లు పంచాలి, పన్నులు వసూలు చేయాలి.. ఇవన్నీ చేస్తూనే మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేసేందుకు రాత్రి, పగలు తేడా లేకుండా కార్యదర్శులు కష్టపడి పని చేస్తున్నారు. ఆదివారం కూడా టెలికాన్ఫరెన్స్, వీడియో కాన్ఫరెన్స్‌ల పేరుతో ఆఫీస్‌కు రావాల్సి వస్తోందని కార్యదర్శులు వాపోతున్నారు.



పని ఒత్తిడితో అనారోగ్యం

పంచాయతీల్లో పని ఒత్తిడితో కార్యదర్శులు అనారోగ్యం పాలవుతున్నారు. సగం మందికి పైగా కార్యదర్శులు బీపీ, షుగర్ లాంటి వ్యాధులతో బాధపడుతున్నారు. ఇంకా చాలా మంది కుటుంబంతో గడపలేక మానసిక వేదనతో కుంగిపోతున్నారు. ఒకవైపు రాజకీయ అధికారుల ఒత్తిడి, మరోవైపు అధికారుల చీవాట్లు.. దీంతో ఫోన్ వస్తుందంటేనే భయపడిపోతున్నారు. ఇటీవల జన్మభూమి కార్యక్రమాల కోసం వచ్చిన నేతలు, పై అధికారులకు భోజన, ఇతర ఏర్పాట్లు అన్నీ చాలా పంచాయతీ కార్యదర్శుల జేబుల్లో నుంచి ఖర్చు పెట్టారు. మూడు నాలుగు పంచాయతీల్లో అంటే హీనంగా రూ. 50వేల వరకూ పంచాయతీ కార్యదర్శులకు ఖర్చయ్యాయి. ఆ బిల్లులను ఎవరిని అడిగితే ఏ తంటాలు వస్తాయోనని మౌనంగా ఉండిపోయారు. అవార్డులేమో అధికారులకు, పనిభారమేమో పంచాయతీ కార్యదర్శులకా? అని పెదవి విరుస్తున్నారు.

'ఆన్‌లైన్' కష్టాలు....

కార్యదర్శికి పని ఒత్తిడి కష్టాలు ఒక ఎత్తయితే.. కంప్యూటర్లలో రిపోర్టును ఆన్‌లైన్‌లో పంపించటం పెద్ద ప్రహసనంలా మారింది. మారుమూల గ్రామాల్లో సిగ్నళ్లు లేక కంప్యూటర్లు మొరాయిస్తున్నాయి. చాలా గ్రామాల్లో ఇంతవరకు కంప్యూటర్లు ఏర్పాటు చేయలేదు. దీనికి తోడు.. కొత్తగా బయోమెట్రిక్ విధానం అమలైంది. రాష్ట్రంలో అన్ని గ్రామాల్లో ఇంటిపన్ను వసూళ్లు మొదలుపెట్టారు. వాటికి ఉదయం లేదా సాయంత్రం వెళ్లాలి. అప్పుడే రైతులు, ఇతరులు ఇళ్లలో ఉటారు. వేరే గ్రామానికి వసూళ్లకు వెళ్లినపుడు మళ్లీ బయోమెట్రిక్ హాజరు కోసం సొంత ఊరు రావాలి. ఇది చాలా కష్టమని.. తమకు బయోమెట్రిక్‌పై ప్రభుత్వం పునరాలోచించాలని పలువురు కార్యదర్శులు కోరుతున్నారు. ఇక కార్యదర్శులు అందుబాటులో లేక.. గ్రామాల ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. సమీక్షలు, సమావేశాలు, శిక్షణ పేరుతో వారానికి మూడు రోజులు మండల కేంద్రాలకు వెళ్తున్నారని.. మళ్లీ వసూళ్ల కోసం ఎక్కడెక్కడికో తిరుగుతున్నారని, తమ పనుల కోసం వాళ్లను ఎలా పట్టుకోవాలో అర్థం కావడం లేదని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు.

ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి: వైవీడీ ప్రసాద్

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పంచాయతీ కార్యదర్శి గ్రేడ్-3 పోస్టులను వెంటనే భర్తీ చేసి, అర్హత గల అభ్యర్థులకు పదోన్నతులు కల్పించాలని ఏపీ పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వైవీడీ ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంచాయతీలో పని చేసే పారిశుధ్య కార్మికుల జీతభత్యాలు 33 శాతం దాటాయాని, వాటి మంజూరులో జాప్యం వల్ల పారిశుధ్య కార్యక్రమాలు జరగటం లేదని తెలిపారు.

పోరాటమే మా ఊపిరి



కార్పొరేట్ నేరాలపై పోరాటంలో మహిళలు ముందడుగు వేస్తున్నారు. జీవవైవిధ్యాన్ని కాపాడడంలోను, ప్రజల జీవన విధానాలపై పోరాడడంలో జీవితాల్ని కూడా లెక్క చేయడంలేదు. ధిక్కారస్వరాన్ని వినిపించడంలో మహిళలు ముందుంటున్నారు. అమెరికా చరిత్రలోనే డోనాల్డ్ ట్రంప్ విధానాలను వ్యతిరేకిస్తూ మొట్టమొదటిసారి వీధుల్లోకి వచ్చింది మహిళలే. లైంగిక వేధింపుల్ని ఎదుర్కోవడంలో అమెరికానే కాకుండా లాటిన్ అమెరికా, ఆసియా దేశాల్లోనూ ముందే ఉంటున్నారు. ఇలా జీవవైవిధ్యం, ప్రకృతి ధ్వంసంపై ఆసియాలోనే పేరెన్నికగన్న మహిళ మేధా పాట్కర్. ఆమె దశాబ్దాలుగా నర్మదా ప్రాజెక్టుపై అలుపెరుగని పోరాటం చేస్తున్నారు. 1985లో నర్మదా ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఏస్ఫూర్తితో ఉద్యమం ప్రారంభించారో అదేస్ఫూర్తితో ఇప్పటికీ సడలని దీక్షతో కొనసాగిస్తున్నారు. 2017 జూలైలో నర్మదా ప్రాజెక్టు నిర్వాసితుల ఇక్కట్లపై 'జల సత్యాగ్రహ'ను నిర్వహించారు. పర్యావరణ పరరక్షణ పోరాటాల్లో పాల్గొనేందుకు స్ఫూర్తి తదితర అంశాలపై ఆమె అభిప్రాయాలు...

ప్ర: సామాజిక, పర్యావరణ పోరాటంలో మీరెలా ఆకర్షితులయ్యారు?

జ: మానాన్నగారు స్వాతంత్ర్య సమరయోధులు. కార్మికనాయకుడు. ఆయనతోపాటు నేను సమావేశాలకు, సభలకు వెళ్తుండేదాన్ని. నా చదువుకునే సమయంలో ప్రజాస్వామ్య సోషలిజం సిద్ధాంతం గురించి తెలుసుకున్నాను. 1985లో నేను నర్మదా డ్యామ్‌ను సందర్శించినప్పుడు పరసరాల గ్రామాలపై ఆ డ్యామ్ ప్రభావం గురించి తెలుసుకున్నాను. ప్రపంచంలోనే రెండో పెద్ద డ్యామ్ అయిన నర్మదాపై న్యాయపోరాటం చేయవలసిందిగా డ్యామ్‌ను సందర్శించేందుకు నన్ను ఆహ్వానించిన మిత్రుడు కోరాడు. అయితే ఒక్క న్యాయపోరాటమే చాలదని, దానికి ప్రజా ఉద్యమం కూడా అవసరమని గుర్తించాను. ప్రభుత్వం కూడా చట్టాలను ఉల్లంఘిస్తున్న అంశాన్ని గమనించి ప్రజా ఉద్యమంలోకి దిగాను.

ప్ర: మీ అనుభవం నేపథ్యంలో పెట్టుబడిదారి దోపిడిని ఎదుర్కొనేందుకు ఉద్యమాలను నిర్వహించడానికి కావలసిన మూలకాలేమిటి?

జ: మొట్టమొదట సైద్ధాంతిక విస్తృత ప్రాతిపదికన ప్రణాళిక రూపొందించుకోవాలి. ఆ తరువాత కార్యక్రమ నిర్వహణకు అవసరమైన లక్ష్యాలను నిర్దేశించుకోవాలి. ఉద్యమంలో పాల్గొనే ప్రతి ఒక్కరూ పూర్తి స్థాయిలో మమేకమయ్యేలా ఉండాలి. సమస్యలను వివిధ కోణాల్లో చర్చించాలి. అయితే, ఉద్యమకారులకు ఉమ్మడి అవగాహన అవసరం. సైద్ధాంతిక భావజాలంతో పాటు ప్రజలకున్న అవగాహనపై కూడా స్పష్టత ఉండాలి. ఉద్యమంలో పాల్గొనేందుకు ప్రజల అవసరాలు, వారి దృష్టి, వారిని చైతన్యపరిచే అంశాలను గమనంలోకి తీసుకోవాలి. నర్మదా డ్యామ్ అంశంలో పెట్టుబడి పెడుతున్న మేము ప్రపంచబ్యాంక్, అంతర్జాతీయ ఆర్థిక సంస్థలను (ఐఎఫ్ఐఎస్)లను లక్ష్యంగా తీసుకున్నాం. ఇందుకు అంతర్జాతీయ మద్దతు, అంతర్జాతీయ ఉద్యమాలతో పనిచేయడం అవసరం. మానవ హక్కులు, అధికారాన్ని తెలుసుకునేందుకు కృషి చేశాం.

ప్ర: అణచివేతలెదురైనపుడు మీరెలా తట్టుకోగలిగారు?

జ: లక్ష్యసాధనకు మేము పోరాటాన్ని ఎదుర్కొంటున్న సమయంలో స్పందనగా ఎప్పుడూ అణచివేతే ఎదురయ్యేది. ముఖ్యంగా 2010 కుట్ర సమయం నుంచి. ఇలా జీవించలేం కాబట్టి న్యాయకావాలంటే పోరాడాల్సిందే. మేం పోరాటం మొదలుపెట్టిన తరువాత ప్రపంచ బ్యాంకు డ్యాం నిర్మాణం నుంచి తప్పుకుంది. పర్యావరణ సమస్యలు తలెత్తకుండా ఉన్నప్పుడే అది ముందుకొస్తుంది. కానీ అక్కడ ఇప్పటికీ 35 వేలనుంచి 40 వేలమంది– 44 గ్రామాలు, ఒక పట్టణం మునిగిపోయే దశలో ఉన్నాయి. అయినప్పటికీ మేము పోరాటం చేయకతప్పదు.

● మహి డెస్క్

పాలకుల అభివృద్ధి నమూనాతో...

కుంగుతున్న డెల్టా!

ఓఎన్‌జిసి., రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ సారథ్యంలో గోదావరి కృష్ణా బేసిన్‌లోను, తీరం లోను సహజవాయువు వెలికితీత కేంద్రాలు 25 ఏళ్ళనుంచి ఉత్పత్తి కార్యకలాపాలను కొనసాగిస్తున్నాయి. హైడ్రో కార్బన్‌ల ఉత్పత్తి వలన కేజీ బేసిన్‌లో ఉన్న మెత్తని ఇసుక రాళ్ళ భూమి కుంగుదలకు అనుకూలంగా వుంది. గల్ఫ్ దేశాల్లో లాగా ఈ పెట్రోలియం బేసిన్లు సున్నపురాయి రిజర్వాయిర్లయితే ఈ సమస్య ఉత్పన్నం కాదు. సముద్ర భాగంలోని చమురు, సహజ వాయువు క్షేత్రాలలో ఇలా మట్టి పెళ్ళలు జారిపోవడం 'నార్త్ సీ' వంటి చోట్ల జరిగింది. ఇప్పుడు ఉత్పత్తి జరుగుతున్న కేజీ బేసిన్‌లో అత్యంత పిన్న వయసు గల ప్లయో సీన్ పొరల్లో 2,200 మీటర్ల లోతు వరకు డ్రిల్లింగ్ చేస్తున్నారు. డ్రిల్లింగ్ వల్ల మట్టి పెళ్ళలు జారిపోవడం జరిగితే సముద్ర ప్రాంతంలోను, తీర ప్రాంతంలోను భూమి కుంగు తుంది. తత్ఫలితంగా ఆంధ్రప్రదేశ్‌లోని డెల్టాలు మునిగి కనుమరుగయ్యే ప్రమాదం వుంది. చమురు క్షేత్రాల్లో భూమి నుంచి వెలికితీసిన చమురువల్ల ఏర్పడే ఖాళీని నీటితో నింపి భూగర్భ చమురు 'రిజర్వాయర్ పీడనం' పెరిగిపోకుండా చూడటం ద్వారా భూమి కుంగడాన్ని నివారించవచ్చు. అయితే సహజ వాయువుకు నీటిలో కరిగే గుణం ఉంటుంది కాబట్టి సహజ వాయువు క్షేత్రాలను నీటితో నింపడం వంటి పరిరక్షణ చర్యలు చేపట్టడం లాభదాయకం కాదు. అందువల్ల భూమి కుంగడం విషయంలో ఒఎన్‌జి సి., ఆర్ఐఎల్ సంస్థలు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఇది చాలా ప్రమాదకరమైన పరిణామాలకు దారితీసే అవకాశం వుంది. సహజంగా చమురు, సహజవాయువు ఉత్పత్తి క్షేత్రాల నుంచి కొన్ని పదుల కిలోమీటర్ల దూరం వరకు భూమి కుంగే ప్రమాదం ఉంది. టెక్సాస్ ప్రాంతంలో వంద కిలోమీటర్ల విస్తీర్ణంలో చమురు బావుల ప్రభావం కొనసాగిన మేరకు భూమి కుంగినట్లు అధ్యయనాలు తెలియజేస్తున్నాయి. చమురు క్షేత్రాలు ప్రారంభమైన 5–7 సంవత్సరాల నుంచి ఏడాదికి 1 నుంచి 15 సెం.మీ. వరకు భూమి కుంగుతుంది. ఓఎన్‌జీసీ సంస్థ అంచనాల కొలతల ప్రకారమే దాదాపు 29 సెం.మీ. భూమి గతంలో కంటే కుంగినట్లు నమోదైంది. డ్రెయి న్‌లలోను, నదులలోను 'పోటు నీరు' భూతాపం కారణంగా సముద్ర జల మట్టాలు పెరగడం ఏడాదికి కేవలం 5-8 మిల్లీ మీటర్లుండగా, చమురు, సహజ వాయువు క్షేత్రాల కారణంగా సముద్రపు నీరు 4-5 అడుగులు పైకి వచ్చింది. ఓడల రేవు వద్ద ఒడ్డున ఉన్న రెండు సహజ వాయువు బావులు ఇప్పుడు సముద్రపు నీటిలో వున్నాయంటే భూమి కుంగడం ఎంత వేగంగా సాగుతోందో అర్థం చేసుకోవచ్చు. భూమి కుంగడం కారణంగా ఓడరేవు ప్రాంతంలో దాదాపు 600 మీటర్లు, అంతర్వేది వద్ద 1 కి.మీ. వరకు సముద్రం చొచ్చుకు వచ్చింది. ఐదేళ్ళ క్రితం తూర్పుగోదావరి జిల్లా, కృష్ణా డెల్టాలో గత 15 ఏళ్లలో దాదాపు ఐదు అడుగులకు పైగా భూమి కుంగింది. తూర్పుగోదావరి జిల్లాలోని కాకినాడ, నర్సాపురం పట్టణాలు సముద్ర మట్టానికి కేవలం ఏడు అడుగుల ఎత్తున ఉండేవి. భూమి కుంగిన తరువాత ఈ రెండు పట్టణాలు సముద్ర మట్టానికి కేవలంరెండు అడుగుల ఎత్తున మాత్రమే ఉన్నాయి. గ్యాస్, ఆయిల్ వెలికి తీయడం వల్ల భూమి పొరల్లో ఏర్పడే ఖాళీలను భర్తీ చేయకపోవడం వల్ల డెల్టా ప్రాంతంలో తీర ప్రాంత మాగాణి భూమి కుంగిపోతోంది. ఫలితంగా సముద్రం భూమిపైకి చొచ్చుకు వస్తోంది. డెల్టా ప్రాంతంలో తీరం వెంబడి కొన్ని వందల మీటర్ల వరకు సముద్రం చొచ్చుకు వచ్చింది. ఇందుకు పరిష్కారమార్గం – భూమి కుంగుదలకు కారణమైన కెజి బేసిన్ చమురు క్షేత్రాల్లో భూమి పొరల్లో ఏర్పడే ఖాళీలను పూరించే విధంగా ఉత్పత్తిని చేపట్టాలి. అందుకు ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో అమలు చేస్తున్న చమురు వెలికితీ పద్ధతులను అమలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. కార్పొరేట్ సంస్థల అత్యాశకు దేశ సహజ సంపదలను అప్పజెప్పే విధానాలను అనుసరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కారణంగా శతాబ్దాలుగా అన్నదాతగా కొనసాగుతున్న గోదావరి, కృష్ణా డెల్టాలు కుంగిపోయి సముద్రపు నీటి ఉప్పు కయ్యలుగా మారే ప్రమాదం ఉంది. కుంగుతున్న డెల్టా పరిరక్షణ చర్యలను చేపట్టడం మాని, అభివృద్ధి పేరుతో తుఫానులకు అలవాలమైన బంగాళాఖాతం వాతావరణం మార్పులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేసి వివిధ అభివృద్ధి ప్రాజెక్టులను చేపడుతోంది. ప్రమాదకరమైన విషవాయువుల లీకేజీకి అవకాశ మున్న పెట్రో, రసాయనిక పరిశ్రమలు, కాలుష్య కారక ఫార్మా పరిశ్రమలు, అణువిద్యుత్, బొగ్గు ఆధారిత మెగా విద్యుత్ ప్లాంట్లతో కూడిన కోస్తా పారిశ్రామిక కారిడార్ ఏర్పాటును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పర్యావరణ దృక్కోణంలో పునస్సమీక్షించుకోవాల్సిన అవసరం ఉంది. కార్పొరేట్ అభివృద్ధి నమూనాతో అంటకాగే ప్రభుత్వాలు తుఫానులు వస్తే నష్ట నివారణ చర్యలను హడావుడిగా చేపట్టడానికే పరిమితమయ్యాయి. ప్రజలే చరిత్ర నిర్మాతలు కాబట్టి 'ప్రజల అభివృద్ధి నమూనా' కోసం వారే ఉద్యమించాలి.

● వెన్నెలకంటి రామారావు



కుంగుతున్న డెల్టా పరిరక్షణ చర్యలను చేపట్టడం మాని, అభివృద్ధి పేరుతో తుఫానులకు అలవాలమైన బంగాళాఖాతం వాతావరణం మార్పులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేసి వివిధ అభివృద్ధి ప్రాజెక్టులను చేపడుతోంది. ప్రమాదకరమైన విషవాయువుల లీకేజీకి అవకాశమున్న పెట్రో రసాయనిక పరిశ్రమలు, ఫార్మా పరిశ్రమలు, అణువిద్యుత్, బొగ్గు ఆధారిత మెగా విద్యుత్ ప్లాంట్లతో కూడిన కోస్తా పారిశ్రామిక కారిడార్ ఏర్పాటును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పర్యావరణ దృక్కోణంలో పునస్సమీక్షించుకోవాల్సిన అవసరం ఉంది.


అనుసంధానం ప్రగతికి ప్రతిబంధం

పందొమ్మిదవ శతాబ్ది మధ్యలో సర్ ఆర్థర్ కాటన్ ప్రతిపాదించిన నదుల అనుసంధానం పథకం ఇప్పటికీ దస్త్రాలకే పరిమితమైంది. వేలాది క్యూసెక్కుల నీటిని వివిధ ప్రాంతాలకు తరలించడం ద్వారా ఉత్తరాదిన వరద బీభత్సాన్ని, దక్షిణాదిన నీటికొరత సమస్యను పరిష్కరించాలనే లక్ష్యంతో రూపొందించిన నదుల అనుసంధాన పథకం సాంకేతిక అద్భుతమే. హిమాలయ నదులు, ద్వీపకల్ప నదులలో వర్షాకాలం కొద్దిరోజులలోనే ప్రవహిస్తున్న 30వేల నుంచి 60 వేల క్యూసెక్కుల వరదనీరు (సెకనుకు క్యూబిక్ మీటరు నీరు)ను అనుసంధానం చేసేందుకు ఉద్దేశించిన ఈ పథకం శతాబ్దకాలానికి పైగా దస్త్రాలకే పరిమితమైంది. నేషనల్ రివర్ లింకింగ్ ప్రాజెక్ (ఎన్ఆర్ఎల్‌పీ) ప్రాజెక్ట్‌లో దేశవ్యాప్తంగా 37 నదులను 30 సంధానాలతో అనుబంధించనున్నారు. దక్షిణాసియలోనే అతిపెద్ద వాటర్ గ్రిడ్‌గా రూపొందే ఈ పథకంలో 3 వేల జలశయాల నిర్మాణం జరుగుతుంది. ఈ నదులలో వరద నీటిని వివిధ జలాశయాలలో సేకరించి దక్షిణ, పశ్చిమ, మధ్య భారత దేశంలోని దాహార్తితో ఉన్న పంటపొలాలకు, వేలాది కిలోమీటర్లు పొడవున్న కాలువల ద్వారా సాగునీటిని, తాగునీటిని అందించాలని ఈ పథకం లక్ష్యంగా ఉంది. ఈ పథకం ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులు వాగ్దానా లిచ్చి ఓట్లు రాబట్టుకునేందుకు అనువైన పరిష్కారంగా నిలిచింది. తమిళనాడులో పాగా వేసే వ్యూహంలో భాగంగా నదుల అనుసంధాన పథకంలో భాగమైన గోదావరి, కృష్ణా నదుల అనుసంధానం కోసం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి చేసిన తాజా ప్రతిపాద నన తెలంగాణ అంగీకరించకపోవడంతో మరోసారి వివాదం ముందుకొచ్చింది. గోదావరి జ లాలు తెలంగాణకు 1600 టీఎంసీలు కేటాయిస్తున్నట్లు లిఖితపూర్వకంగా ఇస్తేనే అంగీ కరి స్తామని నదీ జలాల అనుసంధానం 14వ సమావేశంలో తెలంగాణ మంత్రి హరీశ్‌రావు తేల్చిచెప్పడంతో ఈ పథకం అమలుకు మరోసారి బ్రేక్ పడినట్లయింది. గోదావరిలో మిగులు జలాలు లేవని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వాదించగా, విభజనానంతరం రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు 3వేల టీఎంసీల నీళ్ళు సాలీనా సముద్రం పాలవుతున్నాయని నీటి మీద రాతల వంటి లెక్కలు వల్లెవేస్తున్నారు.

అరవై వేల క్యూసెక్కుల వరద నీటి నుంచి కేవలం 4,500 క్యూసెక్కుల నీటిని మాత్రమే తరలించగలమని నిపుణుల అంచనాల రీత్యా, ఇంత తక్కువ పరిమాణం నీటి తరలింపు వరద సమస్యను ఏ మాత్రం పరిష్కరింప జాలదు, సరికదా సాగు నీటి కొరతను కూడా తీర్చజాలదు. గంగా పరీవాహక ప్రాంతంలోని జనావాసాలు వర్షాకాలంలో భయంకరమైన వరదలు, వేసవిలో తాగు, సాగునీటి కొరతను ఎదుర్కొంటున్నాయి. ఇలాంటి పరిస్థితులలో నీటి తరలింపు అంతర్ గ్రామాల, అంతర్ ప్రాంతాల, అంతర్ రాష్ట్రాల, అంతర్జాతీయ వివాదాలకు, వైషమ్యాలకు దారితీస్తుంది. నదుల అనుసంధానం ప్రమాదకరమైన, ప్రాణాంతకమైన కాలుష్య జలాల అనుసంధానంగా మారి ప్రజారోగ్యం తీవ్ర ప్రమాదంలో పడుతుంది. నదీ పరివాహక ప్రాంతాల్లోని జీవజాలం అంతరించి పోతుంది. నిర్మాణానికి లక్షల కోట్ల రూపాయలు ఖర్చుకావడమే కాకుండా, నిర్వాసితుల సమస్య పెద్ద ఎత్తున తలెత్తుంది. నాగార్జున సాగర్, భాక్రానంగల్ వంటి ప్రాజెక్టుల నిర్వాసితుల సమస్యలు ఇంతవరకూ పరిష్కారం కాలేదంటే, ఇంతటి భారీ పథకం అమలులో తలెత్తే నిర్వాసితత్వ సమస్య సామాజిక ఉత్పాతంగా పరిణమిస్తుంది.

భారీ నీటి ప్రాజెక్టుల నిర్మాణంతో పెద్ద ఎత్తున నీటిని నిల్వ దీర్ఘకాలం పాటు చేస్తే, పంటలకు పనికి వచ్చే పోషకాలు జలాశయం అడుగున పేరుడులాగా (సిల్ట్) పేరుకుపోతుంది. దాంతో ఆ ప్రాజెక్టుల నుంచి విడుదలయ్యే నీరు సారవిహీనమైనవిగా ఉంటాయి. దాంతో పోషకాలు లేని సారహీనమైన నీటితో సేద్యం చేస్తే ఎరువుల వాడకం బాగా పెరిగిపోయి, ఉత్పాదకాల ఖర్చు తడిసిమోపెడవుతుంది. దాంతో పండిన గిట్టు బాటు ధర లేక, ఎరువుల వాడకం వల్ల భూసారం దెబ్బతినిపోయి ఉత్పాదకత క్షీణించడం వల్ల రైతులు నష్టపోతారు. వ్యవసాయం నష్టదాయకం కావడం వల్ల రైతుల ఆత్మహత్యలు పెరిగిపోతాయి. అదే సమయంలో నదులు సముద్రంలోకి నిరాటంకంగా ప్రవహిస్తుండడం వల్ల సంగమ ప్రాంతాలలో ఉప్పునీటికి, నదీజలాలలకు మధ్య తారతమ్యతలోని తేడా మూలంగా అల్పపీడనాలు ఏర్పడి రుతుపవన వర్షాలుగా మారుతాయి. నదుల అనుసంధాన వల్ల సముద్రంలో నదీ జలాలు నిరాటంకంగా ప్రవహించకపోవడంతో ఈశాన్య, నైరుతీ రుతు పవనాల చక్రం దెబ్బతినిపోతుంది. దాంతో రుతపవన వర్షాల వల్ల నదుల్లో ప్రవహించే వరద నీరు పూర్తిగా లేకుండా పోతుంది. దాంతో వరద నీరు లెక్కలపై ఆధారపడి నిర్మిస్తున్న ఈ నదుల అనుసంధానం ప్రాజెక్టు నీళ్ల కొరత కారణంగా శిథిలమవుతుంది. నదుల అనుసంధాన పథకం వ్యవసాయానికి నిరర్థకమైన చర్య, ఆర్థికంగా దివాళా కోరు చర్య, పర్యావరణపరంగా విధ్వంసకరమైన చర్య. జాతీయ, అంతర్జాతీయ ప్రాజెక్టుల నిర్మాణ కార్పొరేట్ సంస్థల, రాజకీయ నాయకుల అవినీతి సంపాదనకు, జలవనరుల తరలింపు రాజకీయాలకు ఉద్దేశించిన ఈ నదుల అనుసంధాన పథనాన్ని పక్కన బెట్టి వివిధ చెరువులు, కుంటలు, చెక్ డ్యాంలు, ఫ్లడ్‌లెవల్ డ్యాంలు వంటి వికేంద్రీకృత స్థానిక వర్షపు నీటి సాగు విధానాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి పరచాలి.

మథనం



బహుజాతి సంస్థల గ్లోబల్ కార్యకలాపాలు ఒకవైపు చౌక శక్తిని వినియోగించుకుని డాలర్ల మేటలు వేస్తుంటే మరో వైపు భూసారాన్ని భూమిలోని వ్యవసాయ పోషకాలు, ఖనిజాలు కొల్లగొడుతూ ప్రకృతి - సమాజం మధ్య సాగే ఆదాన ప్రధాన ప్రక్రియకు గండికొడుతున్నాయి. జీవ, నిర్జీవ వ్యర్థాల ద్వారా భూగోళాన్ని జీవుల ఆవాసానికి పనికిరాకుండా చేస్తున్నాయి.

కాలుష్య నియంత్రణకు అష్టాంగమార్గం

ప్రపంచ వ్యాప్తంగా అభివృద్ధి చెందిన దేశాలు చేపడుతున్న కాలుష్య నియంత్రణ చర్యలు

1. **ప్రజారవాణా వ్యవస్థ మెరుగుదల:** సొంత వాహనాల సంఖ్య తగ్గించుకునేందుకు సమర్థవంతమైన, సౌకర్యవంతమైన ప్రజా రవాణా వ్యవస్థలను రూపొందించడం.
2. **సైకిల్ మార్గాల ఏర్పాటు:** జర్మనీ వంటి దేశాల్లో రోడ్ల వెంబడి సైకిల్ ట్రాక్‌లను ఏర్పాటు చేస్తున్నాయి. 500 కిలోమీటర్ల సైకిల్ ట్రాక్‌ల నిర్మాణం జరిగిందని అంచనా. సైకిల్ వాహనదారులకు ఉచిత ఇంటి వసతి, ఉచిత సైకిల్ నిలుపుస్థలం, ఉచిత ప్రజారవాణ వ్యవస్థలను ఆరుదేశాలు కల్పిస్తున్నాయి.
3. **పూర్తి నిషేధం:** 2025 నాటికి నెదర్లాండ్ దేశం పెట్రోల్, డీజిల్ వాహనాలను నిషేధించబోతోంది. వాటి స్థానంలో ఎలక్ట్రిక్, హైడ్రోజన్ కార్లు మాత్రమే నడుస్తాయి.
4. **కఠినమైన చట్టాలు, నియంత్రణలు:** అమెరికాలో శుభ్రమైన గాలిచట్టం, వాతావరణ పరిరక్షణ సంస్థ వాతావరణ కాలుష్య కారక పరిశ్రమాధిపతులు, వాహనదారులపై కఠిన చర్యలు తీసుకొంటున్నాయి. అయితే వాతావరణాన్ని కలుషితం చేసేవారిపై కేసు పెట్టేందుకు పౌరులకు హక్కులు కల్పించి సవరణ బిల్లు రాబోతుంది.
5. **మెరుగైన సాంకేతికత:** కాలుష్య వెలురింపులను తగ్గించుకోవడం స్వచ్ఛమైన వాతావరణం కోసం ఇంధనాన్ని కనిష్ఠ సమర్థంగా వినియోగించి, పర్యావరణహిత సాంకేతిక, కాలుష్య కారక వాహనాలను రూపొందించడంపై కేంద్రీకరణ.
6. **పునరుద్ధరణీయ వనరులు:** శిలాజ ఇంధన వినియోగాన్ని పొదుపుగా వినియోగించాలి. కాలుష్యాల వెలవరింపులను తగ్గించుకునే లక్ష్యంతో వాయు, థర్మల్ (అణు), జలవిద్యుత్ వంటి ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వినియోగంపై దృష్టి కేంద్రీకరించాలి.
7. **సరి బేసి నమూనా:** రోడ్లపై వాహనాల రాకపోకలను నియంత్రించేందుకు సరి, బేసి సంఖ్యల నెంబర్‌ప్లేట్లు వాహనాలకు ప్రత్యేక రోజులను కేటాయించడం ద్వారా రద్దీ ప్రాంతాల కాలుష్యాన్ని నివారించోచు.
8. **రక్షిత ప్రాంతాలు:** చారిత్రక స్థలాలు, పర్యావరణ సున్నిత ప్రాంతాలలో కార్లు, భారీ వాహనాల నిషేధం. (బైక్‌లను అనుమ తించాలి).

● మహిడెస్క్



కడవి హవా



రుతువులు విపరీతంగాను, అంతుచిక్కని విధంగాను ఉన్నప్పుడు రైతుల పరిస్థితి ఏమిటి? అటువంటి పరిస్థితుల్లో వారు అస్తిత్వ సంక్షోభంలో పడతారు. ఈ అంశాన్ని ఆధారం చేసుకునే లీలా మద్‌హబ్ సూటిగా వాతావరణ మార్పుల నిరాకర్తలను (Deniers) ప్రశ్నిస్తున్నారు. ప్రపంచంలో అంతా బాగుందని చెప్పలేమని ఆయన స్పష్టం చేస్తున్నారు. ఈ అంశాన్నే ఆయన కథాంశంగా ఎన్నుకుని 'కడవి హవా' (ఎదురుగాలి) అనే చిత్రాన్ని నిర్మించారు. రాజస్థాన్‌లోని చంబల్‌లోయ ప్రాంతంలోని దుర్భిక్షంతో ఇక్కట్లపాలైన మహువా గ్రామాన్ని ఎంచుకున్నారు. ఈ చిత్రానికి సంబంధించి కథ – ఒకప్పుడు ఎంతో సుభిక్షంగా ఉండే ఈ గ్రామసారం నేడు నిస్సారంగా మారడంతో ఈ గ్రామంపై ఏ ఒక్కరైతూ ఆశలు పెట్టుకోలేదు. ఒకేఒక్క రైతు, అంధుడు హెడు మాత్రం భూమిపై ఎంతో ఆశలు పెట్టుకునే ఉన్నాడు. ఈ పాత్రను సంజయ్‌మిశ్రా ధరించారు. ఆ సమయంలో సంవత్సరాల తరబడి అక్కడ వర్షాలు లేవు. అన్నేళ్ల ఆ ప్రాంతంపై వర్షాలెందుకు చిన్నచూపు చూస్తున్నాయో అతన్ని విస్మయానికి గురి చేసింది. 'ఇన్నాళ్లు వానలు కురవకపోవడానికి వర్షపు గాలులకు జబ్బుచేసిందా?' అని మథనపడతాడు. వర్షాల రాకకోసం ఎదురుచూసేవారికి ఈ పరిస్థితి భరించరానిదిగా తయారైంది. ఆ గ్రామంలోనే రైతుగా ఉన్న హెడు కుమారుడు ముకుంద్ (భూపేష్ సింగ్ నటించాడు) కూడా ఎదురుగాలి ప్రభావంతో ప్రాణం తీసుకుంటాడు. రైతుల ఆత్మహత్యపై వార్తాపత్రికల్లో రావడంతో తమలోని నిరాశను, వేదనను ఆత్మహత్యలు చేసుకున్న రైతుల కుటుం బాలు బయటకు పొక్కనివ్వవు. తమలో ఉన్న ఆకలిని అణచివేసి ఆకలిలేనట్లు ఎందుకు నటిస్తున్నారో మనకు తెలియదు. ఈ దుస్థితిని రాజకీయ నాయకులెవరూ పట్టించుకోరు. స్థానిక బ్యాంక్ ఏజెంట్ (రణ్‌వీర్ షోరే నటించాడు) అమానుష ప్రవర్తనను గ్రామస్తులంతా ఈసడించుకుంటారు. అతను ఏ గ్రామంలోకి రుణాల వసూలు కోసం ప్రవేశించగానే ఏదో యమదూతను చూసినట్లుగా బెదిరిపోయేవారు. అతని ప్రవర్తన కారణంగానే అనేకమంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. గ్రామమంతా మృత్యుఘంటికలు వినిపిస్తుండగా కుటుంబ పెద్ద అయిన ఒక్క హెడు మాత్రమే ధైర్యవంతుడిలా ఏజెంట్‌కు కనిపిస్తాడు. అంధుడు కావడంతో నిబంధలనల గురించి ఆలోచించకుండానే కొడుకును నీడలాగా అనుసరిస్తాడు. దీంతో వారి కుటుంబంపై కడవి హవా ప్రభావం ఎలావుంటుం దోనని, భవిష్యత్తుపై కుటుంబమంతా భయంతో వణికిపోతుంది. జరగబోయే విపరిణామాలపై కుటుంబం భీతిల్లుతుంది. ముకుంద్ భార్య (తిలోత్తమ షోమ్)ను యథాతథంగా కుటుంబంలో కొనసాగించడంలోను, కుమారుడి అప్పును తీర్చేందుకు హెడూ అంగీకరించడం సన్నివేశాలను స్క్రిప్టులో పకడ్బందీగా రూపొందించారు. వాతావరణ మార్పులపై నిర్దిష్టపరిష్కారం లేకుం డానే సమస్యకు ఎలాంటి పరిష్కారం చూపకుండా, ముసుగు వేసిన విధంగా చిత్రాన్ని ముగిస్తారు. చుట్టుముట్టిన పరిస్థితుల్లో చిక్కుకుని ప్రకృతిలో కనిపించే కష్టాలతో నిండిన వ్యక్తుల జీవితచిత్రాన్ని ఎంతో ఆసక్తికరంగా చిత్రీకరించారు. పేదల్లో నిరుపేదలకు ఎదురైన ఆకాశ కష్టాల గురించి ఈ చిత్రం నిండివుంటుంది. ఈ చిత్రంలోని పాత్రలు వారు సృష్టించని కష్టాలను ఎదుర్కొంటారు. ఈ చిత్రం ద్వారా మనకు లభించే సందేశం ఒకటే... వాతావరణ మార్పులనేవి పేదలు, ధనికులు అనే తారతమ్యం లేకుండా అందరినీ ఒకేవిధంగా క్షోభకు గురిచేస్తాయన్నది.

● తాడేపల్లి శివరామకృష్ణారావు

కడవి హవా అంటే - ఎదురుగాలి. వాతావరణ ప్రతికూల పరిస్థితుల్లో రైతుల దుస్థితిని కళ్లకు కట్టినట్టు చూపించిన సినిమా ఇది. పూర్తిగా గ్రామీణ వాతావరణంలో పేద రైతుల దయనీయ పరిస్థితులను, రుణం తీసుకున్న తరువాత మానవీయ కోణంలో చూడాల్సిన బ్యాంక్ అధికారుల దురుసు ప్రవర్తన, ఫలితంగా రైతులు ఆత్మహత్యలు - అన్నీ కలిసి హృదయాన్ని పిండేస్తాయి. వాతావరణం అనుకూలించకపోతే కలిగే విపరీతాలకు ఈ చిత్రం ఉదాహరణగా నిలుస్తుంది. వాతావరణానికి పేద, ధనిక అనే తారతమ్యం ఉండదని, అందరిపై దాని ప్రభావం ఒకటిగానే ఉంటుందని చెబుతుందీ చిత్రం.

మహి పేజీకి వ్యాసాలు పీడీఎఫ్, ఓపెన్ ఫైల్ ఫార్మాట్‌లలో పంపవలసిందిగా సూచన.
e-mail: manammahimahi@gmail.com

పఠాభి శత జయంతి

భాషా సాంస్కృతిక శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సహకారంతో తెలుగు శాఖ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, యానాం, కవిసంధ్య సంయుక్త నిర్వహణలో ప్రముఖ అభ్యుదయ కవి పఠాభి శతజయంతి ఉత్సవం ఫిబ్రవరి 19న యానాంలో జరుగుతుంది. ఈ సందర్భంగా 'పఠాభి సాహిత్యం-ప్రాసంగికత' అనే అంశంపై ఒక రోజు జాతీయ సాహిత్య సదస్సు నిర్వహిస్తున్నారు. డాక్టర్ అత్తలూరి నరసింహారావు, డాక్టర్ సీతారం, అదృష్టదీపక్, వంశీ కృష్ణ, డాక్టర్ వాడ్రేవు వీరలక్ష్మిదేవి, డాక్టర్ జోశ్యుల కృష్ణబాబు, దాట్ల దేవదానంరాజు, మధునాపంతుల సత్యనారాయణమూర్తి, డాక్టర్ వరుగు భాస్కరెడ్డి తదితరలు వివిధ అంశాలపై పత్రాలు సమర్పిస్తారు. పఠాభి పరిశోధకులు డాక్టర్ శిఖామణి కీలక ప్రసంగం చేస్తారు. అతిథులు మల్లాడి కృష్ణారావు, జయరాజ్ డానియేల్, డి. సుబ్రమణ్యేశ్వరరావు సాయత్రం 4 గంటలకు ప్రఖ్యాత రంగస్థల నటుడు డి. సూర్యప్రకాశరావు హరిశ్చంద్ర కాటిసీను ఘట్టం ప్రదర్శన ఉంటుంది.

- కవి సంధ్య, యానాం

- ప్రభుత్వ డిగ్రీకళాశాల, యానాం

జాతీయ స్థాయి కథల పోటీలు

సందర్భం

మార్చి 21న ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా 'వంతెన' (తెలుగు సామాజిక వారధి) కవిత్వ బులిటిన్ ఆధ్వర్యంలో కవితల పోటీలు నిర్వహిస్తోంది. సామాజిక స్పృహ కలిగిన కవితలకు ఆహ్వానం. నిడివి 25 పంక్తులకు మించకూడదు. ఒకరు ఒక కవితను మాత్రమే పంపాలి. కవితలు పంపేవారు చందాదారులై ఉండాలి. సంవత్సర చందా రూ. 100. మార్చి నెల బులిటిన్‌తో కలిపి ఒక సంవత్సరం పాటు బులిటిన్లు ఉచితంగా పంపగలరు. ప్రథమ బహుమతి రూ.3వేలు, ద్వితీయ బహుమతి రూ.2 వేలు, తృతీయ బహుమతి వెయ్యి రూపాయలు, మరో రెండు కవితలకు రూ.500 చొప్పున బహుమతులు కేటాయిస్తారు. భాష, వస్తు శిల్పాల అల్లికకు ప్రాధాన్యత, కవితలు పంపించడానికి ఆఖరు తేది ఫిబ్రవరి 28. బహుమతి పొందిన కవితలతో పాటు మరికొన్ని చక్కని కవితలను బులిటిన్లో ప్రచురిస్తాం.

చిరునామా : 'చిత్తలూరి', ప్రధాన సంపాదకులు, 'వంతెన' కవిత్వ బులిటిన్, కేరాఫ్. అమూల్యాచందు కప్పగంతు, డోర్ నెం. 29-27-23, సూర్యనారాయణ వీధి, సూర్యారావు పేట, విజయవాడ -2, సంప్రదించాల్సిన వాట్సాప్ నెం. 9059824800, 9133832246.

- ఎడిటర్
చిత్తలూరి

రంగినేని ఎల్లమ్మ పురస్కారాలు

రంగినేని ఎల్లమ్మ సాహిత్య పురస్కార ప్రదానోత్సవం సిరిసిల్ల - కరీంనగర్ రోడ్‌లోని రంగినేని ట్రస్ట్ ప్రాంగణంలో ఫిబ్రవరి 12వ తేదీ ఉదయం 11 గంటలకు జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మహారాష్ట్ర గవర్నర్ సిహెచ్ విద్యాసాగర్ రావు, విశిష్ట అతిథిగా కల్వకుంట తారక రామారావు, గౌరవ అతిథులుగా జిల్లా పరిషత్ చైర్మన్ తుల ఉమ, కరీంనగర్ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, వేములవాడ శాసనసభ్యులు డాక్టర్ చెన్నమనేని రమేశ్ బాబు, కలెక్టర్ డి. కృష్ణ భాస్కర్ పాల్గొంటున్నారు. పురస్కార గ్రహీత డాక్టర్ సుంకిరెడ్డి నారాయణ రెడ్డి 'తావు' కవితా సంపుటికి 2017 పురస్కారం లభించింది. ఆత్మీయ అతిథి నలిమెల భాస్కర్ పాల్గొంటారు.

- రంగినేని చారిటబుల్ ట్రస్ట్
రంగినేని ఎల్లమ్మ పురస్కార కమిటీ

సరళి




రష్యన్ సాహిత్య సామ్రాజ్ఞి అన్నా అక్‌మతోవ


ఇరవయ్యవ శతాబ్దపు రష్యన్ సాహిత్యంలో అన్నా అక్‌మతోవ తిరుగులేని కవయిత్రిగానే కాదు, స్టాలిన్ నియంతృత్వాన్ని ఎదిరించిన పోరాటంలో తిరుగులేని శక్తిగా కూడా చరిత్రలో తనకంటూ ఓ స్థానం దక్కించుకుంది. స్టాలిన్ పాలనలో చాలా మంది రచయితలు ప్రవాహంలోకి వెళ్ళటం తటస్థించింది. అక్‌మతోవతో సన్నిహితంగా వుండే మదుకోవ స్కీ ఏప్రిల్ 1930లో ఆత్మహత్య చేసుకున్నాడు. అనంతరం ఎస్నిన్, మేరినా స్వేతయేవ కూడా ఆత్మహత్యలు చేసుకున్నారు. అక్‌మతోవ మొదటి భర్త నికొలయ్ గుమిల్యోవ్ స్వ యాన కవికూడా. అతనిని బోల్షివిక్ పార్టీకి వ్యతిరేకంగా కుట్ర పన్నాడనే నెపంతో 1921లో విచారించి ఆగష్ట్ 25న అతనితోపాటు 61 మందిని కాల్చిచంపారు. ఈ సంఘటన లతో రష్యన్ మేధావులు, కళాకారులు సహా అక్‌మతోవ కూడా ప్రభుత్వ నిఘాలో కాలం గడిపింది. ఆమె కుమారుడు లెవ్ గుమిలెవ్‌ని పై చదువులు చదువుకోటానికి ప్రభు త్వం అనుమతించలేదు. చివరికి అతనిని అరెస్ట్ చేస్తారు కూడా! అక్‌మతోవ కవిత్వాన్ని బూర్జువా సాహిత్యంగా పరిగణించి 1925 ప్రాంతంలో ఆ రచనలు ప్రచురించకుండా అడుకున్నారు. అయినా ఆమె కవిత్వాన్ని రాయటం ఆపలేదు. దాంతోపాటుగా విక్టర్ హ్యూగో, రబింద్రనాథ్ టాగోర్, లియో పార్టీల రచనలు అనువాదం చేసింది. పుష్కిన్, డోస్తీవస్కీ రచనలపై పరిశోధనలు చేసింది. విమర్శకురాలిగా, సమిక్షకురాలిగా వ్యాసాలు రాసింది. ఆమె చాలా రచనలు ఆ కాలంలో వెలుగులోకి రాకపోవటంతో రష్యాలోని, బైట ప్రపంచంలోని విమర్శకులు, పాఠకులు ఆమె చనిపోయిందని భావించారు.

నిజానికి అక్‌మతోవ తన 11వ యేట నించే కవిత్వం రాయసాగింది. కాని అవేవీ లభ్యం కాలేదు. పుష్కిన్, నికోలయ్ నెకసోవ్‌తో పాటు సింబాలిక్ కవులను అభిమానించేది. కాని ఆమె 1910కి అనుకూలంగా కవిత్వం రాసింది. గిల్డ్ ఆఫ్ కవులు 1912లో వెచర్ కవిత్వ సంపుటిని ప్రచురించారు. ఆ పుస్తకంతో అన్నా అక్‌మతోవ మంచి పేరు తెచ్చుకుంది. ఆమె రెండవ సంపుటి బీడ్స్‌తో సాహిత్యంలో సుస్థిర స్థానం సంపాదించుకుంది. డాక్టర్ ఝువాగో రచయిత బోరిస్ పాస్టర్ నాక్ వివాహితుడైనప్పటికీ ఆమె సౌందర్య ఆకర్షణకి లోనై ఆమెని పెళ్ళి చేసుకోటానికి ఉద్యుక్తుడవుతాడు. ఈలోగా ప్రముఖ గేయ రచయిత అలెగ్జాండర్ బ్లాక్‌తో ఆమెకి సంబంధం వుందని పుకార్లు షికారు చేశాయి. అక్‌మతోవ స్వేచ్ఛా ప్రియత్వం ఎక్కువగా యిష్టపడేది. కానీ, ఫిబ్రవరి 1917 విప్లవ ప్రారంభంతో చాలామంది ఆమె సన్నిహితులు దేశం విడిచిపోయినా, ఆమె మాత్రం రష్యా నుంచి పారిపోవటానికి ఇష్టపడలేదు. 1925 ప్రాంతంలో ఆమె అరెస్ట్ నుంచి తప్పించుకోగలిగింది. కాని తన కుమారుడిని జైలు నుంచి విడిపించుకోటానికి చాలా ప్రయత్నాలు చేయాల్సి వచ్చింది. అక్‌మతోవ సహచరుడు నికోలోయ్ పునిన్‌ని కూడా అరెస్ట్ చేశారు. అతను 1953లో గులాగ్ జైలులో మరణించాడు.

స్టాలిన్ 1939లో ఆమె ఆరు కవిత్వా సంపుటాలలోన్నుంచి ఒక పుస్తకాన్ని ప్రచురించటానికి అనుమతి యిచ్చినా, అనంతరం ఆ పుస్తకాన్ని మార్కెట్ నుంచి వెనక్కి తీయించి ధ్వంసం చేశారు. అక్‌మతోవ తన కవిత్వాన్ని రాసి, అనంతరం ఆ కాగితాన్ని తగలబెట్టాల్సిన పరిస్థితులు దాపురించాయి. ప్రజల కష్టాలను, నియంతృత్వాన్ని నిలదీస్తా రాసిన ఎలిజీ కవిత్వం రెక్వియమ్ రష్యాలో 1987కి గాని ప్రచురణకు నోచుకోలేదు. ఎ పోయం విత్ అవుట్ ఎ హీరో ఆమెకి గొప్ప పేరు తెచ్చింది. రెక్వియమ్ ఈరోజుకీ రష్యాలో గొప్ప పుస్తకంగా ప్రజలు గౌరవిస్తారు. 1966లో ఆమె గుండె పోటుతో మరణించింది. ఆమె సమాధి కొమరోవ్‌లో ఇప్పటికీ ఓ దర్శనీయ స్థలం.... రెక్వియంలో నుంచి కొన్ని చరణాలు... నాకు చాలా పని వుంది చేయటానికి ఈ దినాన / నా జ్ఞాపకాలను చంపుకోవాల్సిన అవసరం ఎంతో వుంది / నా బతికివున్న ఆత్మని రాయి చేసుకోవాల / అప్పుడు నాకు నేర్పుకోవాల తిరిగి బతికేలా.

◆ **సాగర్ శ్రీరామ కవచం**
98854 73934







మన సాహితి

పలు మాధ్యమాల్లో పాత్రలు పోషిస్తూ వస్తున్న ఈయన భద్రక్ సమీపంలో ఒక పల్లెటూరులో పుట్టారు. ప్రస్తుతం పాత్రికేయత్తి దృష్ట్యా భువనేశ్వర్‌లో నివాసం. 'జ్వరాభాట' (1981) వీరి తొలి కథా సంపుటి కాగా, 'ఛాయా సౌధర అబశేష'(1996) వీరి తొలి నవలా రచన.

కథా కళింగానికి 'చాసో స్ఫూర్తి' కీర్తి

తాను సంపాదకత్వం వహించి అచ్చు వేసిన కథలకు సుప్రసిద్ధ కథకుడు, విజయనగరం కథల సంతకం చాసో, దశాబ్దాల కిందట, 'కళింగ కథానికలు' అని పేరు పెట్టారు. అందులో అన్నీ తెలుగు కథలే అయినా, ఈ ప్రాంతం ఉమ్మడి సంస్కృతికి చెందిన కళింగాంధ్రగా, చాసోకి గల అవగాహన, భావితరాలతో పంచుకునే పని ఇది. విశాఖకు చెందిన ప్రముఖ కథకులు, విశాఖ సాహితి అధ్యక్షులుగా సేవలు అందించిన అచ్యుత రామరాజు కూడా, ఇది కళింగాంధ్ర ప్రాంతం అని తరచూ గుర్తుచేస్తూండే వారు. గోదావరిదరి పిఠాపురం వరకూ, కళింగ రాజ్యం అని తెనాలి రామకృష్ణుడు, తన భక్తి ప్రబంధం పాండురంగ మహాత్మ్యంలో పక్కాగా వందల ఏళ్ల కిందటే రాశారు. గురజాడ, కన్యాశుల్కంలో, కరటక శాస్త్రి చేత, 'నీలాంటి కాంతామణే లేకపోతే, ఈ కళింగ రాజ్యానికి ఎంత లోటు వచ్చి ఉండేది' అనిపిస్తారు మధురవాణితో మాట్లాడుతున్నప్పుడు. కన్యాశుల్కం తొలి ప్రదర్శన 1892లో విజయనగరంలో ఇచ్చినది జగన్నాథ విలాసినీ నాటక సమాజం. దీనికి మహారాజు ఆనంద గజపతి ప్రోత్సాహముండేది. ఒడియా, తెలుగు భాషలు మాట్లాడేవారు, మహానది, గోదావరి మధ్య ప్రాంతాల్లో ఉన్నారు అన్నది ఒక చారిత్రిక వాస్తవం. తెలుగు సాహిత్య అవార్డ్‌లన్నీ తెలుగు వారి చుట్టూ బొంగరాల్లా, ప్రాంత ప్రేమ, వాదాల ప్రేమ, కుల సమీకరణాలు కూడా జోడై తిరుగాడ్డం చూస్తూ ఉన్నాము. ఇరుగు పొరుగు భాషల వేపు చూసే అలవాటు పెద్దగా తెలుగు వారికి లేదు. ఒక ఎన్టీఆర్ పురస్కారం పేరిట మాత్రమే తెలుగు నేల మీంచి కొందరు భారతీయ స్థాయి రచయితలకు కొన్ని సాహిత్య గౌరవ పురస్కార ప్రదానాలు జరుగుతున్నాయి. ఇటువంటి నేపథ్యంలో, ఇరవై మూడవ చాసో స్ఫూర్తి అవార్డ్, ప్రముఖ ఒడియా కథా రచయిత గౌర హరి దాస్‌కు ఈ నెల పదిహేడున, విజయనగరంలో ప్రదానం జరిగిన సంఘటన బహుధా స్వాగతనీయం.

1981 నుంచీ కథలు రాస్తూ నేటికీ పదిహేడు కథా సంపుటాలు ప్రచురించిన గౌరహరి దాస్, ఒడియా సాహిత్యంలో సుప్రసిద్ధ సాహితీవేత్త. పత్రికా రంగంలో అత్యధిక జనాదరణ గల 'సంబాద్' దినపత్రికకు ఫీచర్స్ ఎడిటర్‌గా పని చేస్తున్నారు. ముప్పై ఎనిమిదేళ్ళ సాహిత్య జీవితంలో, పలు అవార్డ్‌లు,(రాష్ట్ర సాహిత్య అకాడెమీ, కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డ్‌లతో బాటుగా) పొందారు. ఆరు నవలలు, కవిత్వం, నాటకం, యాత్రాసాహిత్యం, సంకలనాల సంపాదకత్వ నిర్వహణ, కాలమ్ నిర్వహణ, ఇలా పలు సాహిత్య రూపాలలో తన రచనా ప్రతిభ కన్పరుస్తున్నారు. పలు దేశాలలో పర్యటించి, ప్రపంచ సాహిత్య స్వరాల్లో తన తూర్పు భారత, ఒడియా సాహిత్య స్వరాన్ని కూడా వినిపించారు. గౌరహరి రచయిత, జర్నలిస్ట్ కూడా, ఒడియా రాష్ట్ర స్థాయి అవార్డ్‌లు ఎన్నో స్వీకరించారు. ఇలా సాహిత్య రంగంలో పలు మాధ్యమాల్లో పాత్రలు పోషిస్తూ వస్తున్న ఈయన ...

వీరి కథా సంపుటాలు కొరాపుట్, లిటిల్ మంక్ అండ్ అదర్ స్టోరీస్, ద నెయిల్ అండ్ అదర్ స్టోరీస్, షేడ్స్ ఆఫ్ లైఫ్ (నవలిక) ఇంగ్లీష్‌లోకి అనువాదం అయ్యాయి. తెలుగు ఒడియా సాహిత్య రంగాల మధ్య మరింత సహకారపూర్వక ఉమ్మడి సాహిత్య కార్యక్రమాలు, అదాన ప్రదానాలు జరగడానికి ఇటువంటి ఉమ్మడి గుర్తింపులు చాలా అవసరం. ఇందుకు చాసో కుమార్తె, చాగంటి తులసి అభినందనీయురాలు. మరొకందుకు కూడా ఆమెకు సాహిత్యలోకం రుణపడి ఉన్నది. చాసో సభావేదిక పేరిట, విజయనగరంలో సాహిత్య సభలు జరగడానికి వీలుగా, గురజాడ జిల్లా గ్రంథాలయం మొదటి అంతస్తులో, ఒక సమావేశ భవన నిర్మాణానికి ఆమె స్థానిక ప్రభుత్వ యంత్రాంగానికి మేచింగ్ గ్రాంట్ అందచేసి, గతవత్సరమే, ఈ సభావేదిక నిర్మాణం పూర్తయి, అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకున్నారు. అందువల్ల, ఈ ఇరవైమూడవ చాసో స్ఫూర్తి పురస్కారం తొలిసారిగా, ఘనంగా, చాసో సభా వేదికపై జరిగింది.

చాసో రాసిన 'పరబ్రహ్మం' కథలో, అన్నం కోసం, ఒక పిచ్చివాడు, అంగలార్చి, మిలిటరీ భోజన హోటల్ లోంచి పెరట్లోకి గిరాటేసే ఎంగిలి విస్తరి కోసం రెండు చేతులను చాచి నిలబడతాడు ఆ విస్తరి వచ్చి వాడి చేతిలో పడుతుంది. ఇది ఒక బిగిగల కథకు ముగింపు. 'అన్నమే పరబ్రహ్మం' ఆకొన్నవారికి, పేదవారికి, రోజుల తరబడి అన్నార్తులకు అని చాసో చెప్పే ఈ కథ, లోకం తీరుపైన ఒక కలం చి త్రం. అన్నం దొరక్క అంగలార్చే పిచ్చివాడు ఈ కథలో కని^ఎస్తే, గౌరహరి రాసిన 'సుదామ్ జెనా ఎక్కడికెళ్ళాడు?' కథలో విస్తరి నిండా (అదే లంచ్ ప్లేట్ లో) ఒక కార్పొరేట్ వర్కింగ్ లంచ్ సమయంలో నాజూకు లంచ్ పద్ధతులు ఎరగక,, తమ కంపెనీ యజమాని, ఇక్కడికి వచ్చి ప్రాజెక్ట్ కాంట్రాక్ట్ కుదుర్చుకుంటున్న అమెరికన్ వ్యాపార బృందం, ఆకలితో ఉంటారని, వీరికి ప్లేట్ నిండా ఆహారం వడ్డించినందుకు సుదామ్ జెనా, తన ఉద్యోగం పోగొట్టుకుంటాడు. ఆ వడ్డింపు సరిదిద్ది, తగు మాత్రం ఆహారంతో సరిపెట్టిన తరువాత, ఒప్పందం కుదిరి, వెళ్లిపోతున్న అమెరికన్లలో ఒకరు, సుదామ్ చేతిలో ఒక పది డాలర్లు ఉంచి వెళ్తాడు. అప్పుడు ఏమీ ఆనకపోయినా, కంపెనీ విదేశీ అగ్రిమెంట్ కుదిరి, కంపెనీ విస్తరణ జరిగాక, అక్కరలేని ఎన్నో ఉద్యోగాలను కంపెనీ తొలగించేస్తుంది. వారిలో సుదామ్ జెనా కూడా ఒకడు. తమ అగ్రిమెంట్ ప్రకారం పెట్టుబడులిచ్చి ఎలా కంపెనీ పని చేస్తున్నదో చూసేందుకు కొద్దికాలం తర్వాత వచ్చిన ఆ అమెరికన్ యువకుడు, సుదామ్ జెనా కోసం ప్రశ్నిస్తాడు. ఎవరూ మాట్లాడరు. అతనికి తల్లి అమెరికాలో ఒక భారతీయ వనిత. తన చిన్నప్పుడు ఆమె ఇలాగే ప్లేట్‌లో నిండా అన్నం పెట్టేది. అదీ ఆ యువకుడికి సుదామ్ జెనా పట్ల గల సాధు హృదయం. చాసో కథలో పిచ్చివాడు, మనకందరికీ తెలుస్తూనే ఉంటుంది పేదవాడు. ఈ కథలో ప్లేట్ నిండా అన్నం వడ్డించి, 'అయ్యో ఎంత ఆకలితో ఉన్నారో కంపెనీ బాగుకోసం పని చేస్తున్నఈ పెద్దల'ని భావించిన సుధాముడు (కుచేలుడ్ని సుధాముడు అని కూడా పిలుసారు) కూడా పేదవాడే. ఇలా గౌరహరి కథల్లో ఉన్నత జీవన సంస్కార దర్శన ప్రయాస, మనకు సహజకల్పనగా, సమకాలీన ఒడియా సమాజం అంతా కనిపిస్తుంది.


'మేకు' అనే వీరి కథలో 'ఏకు మేకయ్యాడు' అనే సామెతకు అన్వయంలాగా, కన్యాశుల్కంలో మన రామప్పంతులు వలె తోచే కయ్యాలకోరు (లిటిగంట్) నకుల్ నాయక్ పాత్రను చిత్రిస్తాడు. ఈ పాత్ర ఉన్నదానికీ, లేని దానికీ అందరిపై క్రిమినల్ కేసులు బనాయించి, సాక్ష్యాలు పుట్టించి, వారి జీవితాలు అస్తవ్యస్తమయ్యేలా చేసి, అందులో పైశాచికానందాన్ని పొందే పాత్ర. ఊరిజనం మీద ఇలా అన్యాయాలకు, తప్పుడు కేసులకు తండ్రి పాల్పడ్డం చూడలేక, కొడుకు, తండ్రిపై కేసు బనాయిస్తాడు. జాతీయ భద్రతకు కీలకమైన చండిపూర్ ఆయుధ పరీక్ష కేంద్రం డిజైన్లను తండ్రి కేంద్రపారాలోని బంగ్లా దేశీయులకు అమ్ముతున్నాడని కేసుపెట్టి, సెక్షన్ 120 కింద ఫిర్యాదు చేస్తాడు. దీనితో, నీవు నేర్పిన విద్యయే నీరజాక్షా అన్న చందాన, ఈసారి పోలీసులు, నకుల్ నాయక్‌పై బెయిల్ కూడా పొందలేని దేశద్రోహ నేరం కింద, అదుపులోకి తీసుకుంటారు. అందరికీ కోర్ట్ కేసుల మేకులు కొట్టే నకుల్ నాయక్‌కి కూడా, అలానే ఒక స్వానుభవం ఎదురుపడటమే ఈ 'మేకు' కథ.

మనకి తెలుగులో, కథలు గురజాడకి ముందర రాసిన వారు ఉత్తరాంధ్రలో కూడా ఉన్నందువల్ల, ఏది మొదటి కథ అనే చర్చ ఉన్నా, ఒడియా సాహిత్యంలో తొలి కథ రాసినది ఫకీర్ మోహన్ సేనాపతి. 1898లో వీరు రాసిన కథ పేరు 'రేబతి'. ఆడపిల్లలు చదువులు చదువుకోవచ్చా అన్నదీ, అలా 'ఇంగ్లీష్ చదువులు చదువుకుంటే అరిష్టం ఇంటికి, ఊరికి' అన్న మూఢ విశ్వాసం, ఆ రోజుల్లో ఉండేది. దీన్నే 1892లోనే తన కన్యాశుల్కం నాటకం రాస్తున్నప్పుడు, ఇదే కళింగాంధ్ర నుంచి, గురజాడ మొదటి అంకంలో కృష్ణరాయపురం సీన్‌లో ఇంగ్లీష్ చదువుల వల్ల అంటువ్యాధులు వస్తాయన్న మాట అగ్నిహోత్రావధాన్లు చేత అనిపిస్తాడు. ('మనకి ఇంగ్లీష్ ఆచ్చిరాదని పోరిపోరి మొదటే చెప్పాను. మా పెత్తండ్రి దిబ్బావధాన్లు కొడుకుని ఇంగ్లీషు చదువుకి పార్వతీపురం పంపించేప్పటికి వూష్ణం వచ్చి మూడు రోజుల్లో కొట్టివేసింది. బుచ్చబ్బి కొడుక్కి ఇంగ్లీషు చెపిద్దామనుకుంటుండగానే పెద్ద ఖాయిలా పెట్టి చచ్చినంత పనైంది').

ఫకీర్ మోహన్ కథలో 'రేబతి' పదేళ్ళ పిల్ల. చదువుకుంటూ ఉన్నది. ఇంటికి వచ్చి యువకుడైన మాస్టా రు పాఠాలు చెప్తూ ఉంటాడు. ఇది ఆ పిల్ల నానమ్మ కి ఇష్టం ఉండదు. తండ్రికి కూతురు చదువు ఇష్ట మే. గ్రామస్తులు సరేసరి. 'ఆడపిల్లకు చదువేమి టి, అరిష్ట దాయకం కాకపోతేనూ' అని మాట్లా డుకుంటూ ఉంటారు. ఊరిలో అంటువ్యాధి కల రా వస్తుంది, మొదట తండ్రి, తల్లి చనిపోతారు. తరువాత కొందరు గ్రామస్తులు బలవుతారు. నానమ్మ తన అభిప్రాయం మార్చుకోదు. వ్యాధి వ్యాపించి కొన్నాళ్ళకి మాస్టారు, ఈ బాలిక కూడా మరణిస్తారు. ఇది 1890ల నాటి ఆధునికత కోసం పెనుగులాడుతున్న భార తీయ గ్రామీణ ముఖచిత్రంగా ఫకీర్ మోహన్ శక్తిమంతంగా చెప్తారు. అయితే, ఆ రేబతి కథ ఆలా ఉండగా, మన గౌరహరి కూడా ఒక రేబతి కథ, అదే పేరుతో రాశారు. వీరి కథలో రేబతి, అట్టడుగు కులాలలు చెందిన పిల్లగా చదువు విషయంలో వివక్షకు, అవమానానికి గురి అయినా, తట్టుకుని నిలబడి, ఆమె, చదువు పూర్తి చేసి, పోలీసు సబ్ ఇన్స్పెక్టర్ అవుతుంది. తనకు ఆనాడు హాని చేయబోయిన వారే, పెద్ద కులాల వారే, ఒక ప్రమాదం కేసులో ఇరుక్కుని ప్రాణాపాయంలో ఉండగా, వారిని కాపాడి, తనకు చదువు వల్ల కలిగిన వివేకం, విజ్ఞత, వికాసం ఎంతటివో నిరూపణ చేస్తుంది.అదే యువతి పొందుతుంది. ఈమె ఈనాటి రేబతి. కళింగ కథానికలకు ఈ 23వ పురస్కార ప్రదాన సభ, జరగడం కళింగాంధ్రకు గర్వకారణం. ఒక తూర్పు ప్రాంత భాష నుంచే పురస్కారానికి అర్హమైన రచయితకు, ఈ గౌరవం అందచేస్తున్న సంస్థకు తెలుగు సాహిత్య లోకం అభినందనలతో బాటు ఈ పురస్కార ప్రదానం,మరింత బలమైన తెలుగు ఒడియా భాషాసాహిత్య బంధాలకు దారులుతీస్తుందని ఆకాంక్షిస్తూ, తగు బాటలు వేస్తున్న చాగంటి తులసి కృషి, తపన, సాఫల్య తీరాలను చేరాలని ఆశిస్తున్నది.




> **కళింగ కథానికలకు ఈ 23వ పుర స్కార ప్రదాన సభ, జరగడం కళింగాంధ్రకు గర్వకారణం. ఒక తూర్పు ప్రాంత భాష నుంచే పురస్కారానికి అర్హమైన రచయితకు, ఈ గౌరవం అందచేస్తున్న సంస్థకు తెలుగు సాహిత్య లోకం అభినందనలతో బాటు ఈ పురస్కార ప్రదానం, మరింత బలమైన తెలుగు ఒడియా భాషాసాహిత్య బం ధాలకు దారులుతీస్తుందని ఆకాంక్షిస్తూ, తగు బాటలు వేస్తున్న చాగంటి తులసి కృషి, తపన, సాఫల్య తీరాలను చేరాలని ఆశిస్తున్నది**





◆ **రామతీర్థ**
98492 00385

శిథిలాల దగ్గర ఎదురు పడుతుంటాడు



పక్షుల్లారా
పావురాల్లారా
ఎక్కడికైనా ఎగిరిపోండి
మీరు వాలడానికి
నా భుజం మీద జాగ లేదు
ఏ చెట్టు కొమ్మనో చూసుకోండి

జింకల గుంపుల్లారా
కుందేలు పిల్లల్లారా
మీ తల్లులను వెదుక్కొంటూ
నా దగ్గరికి తప్పిపోయి రాకండి!
నాకే జానెడు నీడా లేదు
మీరెక్కడ గంతులేస్తారు!
పాల వాసన బట్టి
కన్నవాళ్ళ ఒడిలోకి చేరండి

ఇంద్రధనుస్సు ఎందుకో
నా వైపే వస్తోంది
తిరిగి చూడకుంటే రంగులు చల్లుతోంది
మేఘాల్లో హారంగా మెరిసేటి మిత్రమా!
వెనక్కి వెళ్ళి ఏ వేడుకలోనైనా కలిసిపో!
ఎదురొచ్చి నేను
నీకు స్వాగతం పలకలేను
కూర్చున్న బండరాయి
లేచివస్తే దొరకకుండా జారిపోతుందేమో!
తివాచీలా పరుచుకొన్న మైదానం మీద
వంచికట్టిన పూలకమానులా అమరిపో!

సీతాకోక చిలుకల్లారా
విన్యాసాలు తూనీగల్లారా
నా కళ్ళ మీదికి రాకండి
ఆశలు ఆశయాలు పట్టకనే వాలికిపోయి
కనురెప్పలకు వేళ్ళాడుతున్నాయి
మరి మీరెక్కడ ఊయల లూగుతారు
ఏ పడతి పట్టుకురులనో చూసుకోండి!

సముద్రాలు, అడవులు, ఎడారులు ఎగబడి
నాతో గడుపడానికి జరుగుతున్నట్టున్నాయి
నాకే పక్కకు తిరుగడానికి చోటు లేదు
మీరెట్లా నా పక్కనుంటారు
దూరంగా వెళ్ళి మలుపు తిరుగని దారిని చూసుకోండి!
దయచేసి నన్ను చుట్టుముట్టకండి!
మీ సౌందర్యాన్ని రుతువులకు పంచిపెట్టండి

తుఫాను వీచిందో తెలియదు
మంటలు లేచాయో ఏమో కనిపించలేదు
మంచు గడ్డ కట్టిందో లేదో ఆనవాళ్ళు లేవు
నా ఆలోచనల మీద కోపమో
ఆహారం మీద ఆహార్యం మీద అలవాట్ల మీద
కొత్తగా విధించిన విధానమో
మొత్తానికి పెద్దయెత్తున దాడి జరిగి
కట్టుకొన్నగూడు పూర్తిగా చెదిరిపోయింది
నేనే శిథిలాల్లో అడుగులు వెదుకుతున్నాను
ఎవరికెట్లా ఇప్పుడు తోడుంటాను
ఎక్కడి వాళ్ళక్కడ వెళ్ళిపోండి

చందమామా! ఈ కూలిన గోడల్లో
వేణువు రాగంలా కవిత్వం చదువుతావా!
ఆకాశమా! ఈ చీకటి వెలుగుల్లో
తారలు జారంగా కితాబులా తెరుచుకొంటావా!
నాకు మొలగుడ్డ సరిగా లేదు
సర్దిపొమ్మని పాటపాడే గాలినడిగాను
రాత్రంతా కత్తులు దిగిన దేహానికి
కట్లు కట్టుకోవాలి
సమస్యలు సాలే గూళ్ళయి చుట్టుకొంటున్నాయి
కాసేపు మారాం చేయడం మానేయండి

ఇక్కడ ధ్వంసమైన దృశ్యాన్ని
పురి విప్పిన నెమలిని చేయాలి
కొత్త కొత్తగా జీవితాన్ని
పచ్చ పచ్చగా కలగనాలి
దూరంగా వుండి చూడండి
తోరణాలు కట్టడానికి పిలుస్తాను.

- ఆశా రాజు
9392302245

కూలిన విమానం..

71 మంది మృతి

(మొదటిపేజీ తరువాయి)

సిబ్బంది ప్రాణాలు కోల్పోయారని 'టాస్' వార్తాసంస్థ తెలిపింది. కజకిస్థాన్ సరిహద్దులోని ఓర్స్క్ నగరానికి వెళ్తున్న ఆంటనోవ్ ఏఎన్-148 విమానం మాస్కో సరిహద్దులోనే కూలిపోయింది. విమాన శిథిలాలను కనుగొన్న నేపథ్యంలో ఇందులో ప్రయాణిస్తున్న వారెవరూ సజీవులుగా ఉండే అవకాశం లేదని అధికారవర్గాలను ఉటంకిస్తూ 'టాస్' వివరించింది. రష్యా అధికార టీవీ చానల్ 'రోష్యా-24' కూడా మంచుతో నిండిన పొలాల్లో విమాన శిథిలాల ఫుటేజీని ప్రసారం చేసింది. అయితే, ఈ దుర్ఘటనకు దారితీసిన కారణాలేమిటన్నది ఇంకా వెల్లడి కాలేదు. వాతావరణ ప్రతికూలత, పైలట్ పొరపాటు వంటివాటివల్ల విమానం కూలిపోయి ఉండవచ్చునని రష్యా రవాణా మంత్రిత్వ శాఖ భావిస్తున్నట్లు ఇంటర్‌ఫాక్స్ వార్తా సంస్థ పేర్కొంది.

సహాయ బృందాలకు వాతావరణం అడ్డంకి

ఈ దుర్ఘటనలో మరణించినవారి కుటుంబాలకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రగాఢ సంతాపం ప్రకటించారని అధ్యక్ష అధికార ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ చెప్పారు. కాగా, రష్యాలో తయారైన ఈ విమానం ఏడేళ్ల నాటిదని, దీన్ని మరో స్వదేశీ విమానయాన సంస్థ నుంచి సరటోవ్ ఏడాది కిందట కొనుగోలు చేసిందని అధికార టీవీ చానల్ పేర్కొంది. ఇటీవల కొన్ని రోజులుగా రష్యాలో అత్యధిక హిమపాతం నమోదవుతోంది. దీంతో విమాన చోదకులకు దృష్టి గోచరత ఇబ్బందికరంగా మారింది. దీంతో అత్యవసర సేవలందించే బృందాలు ప్రమాద స్థలానికి చేరుకునేందుకు ప్రయత్నించినా వాతావరణ ప్రతికూలత ప్రతిబంధకంగా నిలిచింది. అయితే, రక్షణ కార్యక్రమాల సిబ్బంది అతికష్టంమీద అక్కడికి నడిచి వెళ్లారు. మరోవైపు రష్యా రవాణా శాఖ మంత్రి కూడా అక్కడికి బయల్దేరారు. ఈ సంఘటనకు సంబంధించి సరటోవ్ ఎయిర్‌లైన్స్ సంస్థపై అధికారులు విచారణ కూడా చేపట్టారు. పౌర విమానయాన సంస్థలు కాలం తీరిన విమానాలను నడుపుతున్నందున రష్యాలో తరచూ ఇలాంటి దుర్ఘటనలు చోటుచేసుకుంటున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

టీడీపీనే ప్రజలకు జవాబుదారీ

(మొదటిపేజీ తరువాయి)

చెప్పాలని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు ప్రకాశ్ కారత్ డిమాండ్ చేశారు. భీమవరంలో జరుగుతున్న ఆ పార్టీ రాష్ట్ర మహాసభల్లో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడారు. బీజేపీ మిత్రపక్షంగా ఉన్న టీడీపీ ఇప్పుడు ఎన్నికలు దగ్గర పడుతుండడంతోనే పార్లమెంటులో ప్లకార్డులతో నిరసనలకు దిగిందని కారత్ ఆరోపించారు. మూడున్నరేళ్లగా కేంద్రంపై పోరాడకుండా నిద్ర మత్తులో ఉండి ఇప్పుడు అన్యాయం జరిగిపోయిందంటూ గగ్గోలు పెట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాజకీయ స్వలాభం కోసమే ఇప్పుడు ఆ పార్టీ ఎంపీలు పార్లమెంటులో డ్రామాలకు తెరతీశారని ఆరోపించారు. మరోవైపు ఈ బడ్జెట్ రైతు బడ్జెట్ అని బీజేపీ చెప్పుకొంటోందని, కానీ బీజేపీ ప్రభుత్వం రైతులకు చేసిందేమీ లేదని ప్రకాశ్ కారత్ అన్నారు. రైతుల అభివృద్ధికి రెండు లక్షల కోట్లు అవసరం ఉండగా కేవలం రెండు వేల కోట్లు మాత్రమే కేటాయించడం దారుణమన్నారు. ఆరోగ్య బీమా పేరుతో ఇన్సూరెన్స్ కంపెనీలకు, ప్రైవేట్ ఆస్పత్రులకు లబ్ధి చేకూర్చడం కోసమే బడ్జెట్‌లో ప్రతిపాదించారని పేర్కొన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక సరిహద్దు దాటి సర్జికల్ స్ట్రైక్స్ చేశామని గొప్పగా చెప్పుకొంటోందని, కానీ పాక్ ఉగ్రవాదులు ఏకం మన ఆర్మీ క్యాంపులపైనే దాడులు చేయడం శోచనీయమని అన్నారు. నిత్యం పాక్ కాల్పులతో జమ్ము కశ్మీర్ ప్రజలు అక్కడ ఉండలేక ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాఫిల్ యుద్ధ విమానాలు కొనుగోలులో అవకవతకలు జరిగాయని ఆరోపించారు. కాగా, త్రిపుర ఎన్నికల్లో ఘన విజయం సాధిస్తామని తెలిపారు.

ఏపీకి బీజేపీ.. మోసం?




(మొదటిపేజీ తరువాయి)

ఇస్తుందో టైమ్ లైన్ ఇవ్వాలని జయదేవ్ డిమాండ్ చేశారు. బడ్జెట్‌పై పార్లమెంట్‌లో చర్చ మాత్రమే జరిగిందని, ఇంకా ఆమోదం పొందలేదని స్పష్టం చేశారు. విభజన చట్టంలోని హామీల అమలుపై రాష్ట్రానికి స్పష్టమైన సమాధానం కావాలని డిమాండ్ చేశారు. ఆదివారం ఉండవల్లిలోని తన నివాసంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. అందుబాటులో ఉన్న ఎంపీలు, పార్టీ ముఖ్యనేతలతో ఢిల్లీలో జరుగుతున్న పరిణామాలు, భవిష్యత్ కార్యాచరణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో టీడీపీ ఎంపీలు.. విభజన హామీల విషయంలో తాత్సారం చేస్తున్న కేంద్ర ప్రభుత్వంపై ఘాటుగా స్పందించారు. జయదేవ్ మాట్లాడుతూ.. ''రాష్ట్ర విభజన ఏ విధంగా జరిగిందో అందరికీ తెలిసిందే. రాష్ట్రాన్ని అసంబద్ధంగా విడగొట్టారు. విభజన వల్ల రాష్ట్రం ఎన్నో ఆస్తులను కోల్పోయింది. బీజేపీ మద్దతుతోనే ఏపీ విభజన జరిగింది. లేకుంటే జరిగి ఉండేది కాదు. విభజన సమయంలో ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ రాజ్యసభలో మాట ఇచ్చారు. ప్రత్యేక హోదా ఇవ్వటం కుదరదని.. ప్రత్యేక ప్యాకేజీ ప్రకారం 90:10 నిష్పత్తిలో రాష్ట్రానికి నిధులు ఇస్తామని మోదీ ప్రభుత్వం చెప్పింది. ఇచ్చిన హామీలను కేంద్రం నిలబెట్టుకోవాలి. విభజన సమయానికి రాష్ట్రం లోటు బడ్జెట్‌తో పాటు విద్యుత్ లోటు ఉంది. దక్షిణాది రాష్ట్రాలతో పోల్చుకుంటే ఏపీ తలసరి ఆదాయం తక్కువ. తలసరి ఆదాయం ప్రకారం చూసుకుంటే రాష్ట్రానికి చాలా రావాల్సి ఉంది. మిగిలిన దక్షిణాది రాష్ట్రాలతో సమానంగా ఎదిగే వరకు కేంద్రం ఆదుకోవాలి. అలాగే పన్నుల్లో మినహాయింపు, ప్రోత్సాహకాలు ఇవ్వాలి. విభజన హామీలను నెరవేర్చవలసిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది. రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం కలిగిస్తే ఎవరినైనా సహించం'' అని అన్నారు. ఇవన్నీ వదిలేసి రాష్ట్రంలోని బీజేపీ నేతలు రోడ్లకు ఇంతిచ్చాం.. అంతిచ్చాం అని లెక్కలు చెబుతున్నారని విమర్శించారు. అవన్నీ దేశం మొత్తానికి జరిగిన కేటాయింపుల్లో భాగంగా రాష్ట్ర వాటాకు రావాల్సినవేనని వివరించారు. లెక్కలు కావాలంటే తమ దగ్గర కూడా పెద్ద పెద్ద పుస్తకాలు ఉన్నాయని ఎద్దేవా చేశారు. ఏపీలో జాతీయ రహదారుల కోసం రూ. లక్ష కోట్లు ఖర్చు చేశామని కేంద్ర ప్రభుత్వం అంటోందని.. కానీ ఖర్చు చేసింది కేవలం రూ.5,900 కోట్లు మాత్రమేనని ఆయన గుర్తుచేశారు. రాష్ట్రానికి రెవెన్యూ లోటు భర్తీ, పోలవరం నిధులు, విశాఖ రైల్వే జోన్, రాజధాని నిర్మాణానికి నిధులు ఇవి తమ ప్రధాన డిమాండ్‌లని జయదేవ్ పేర్కొన్నారు. విభజన సందర్భంగా కేంద్రం ఇచ్చిన స్పష్టమైన హామీలు అమలు చేయాలని కోరుతున్నామని, కేంద్రాన్ని మనం ఏమీ బిచ్చమడుక్కోవడం లేదని జయదేవ్ అన్నారు. 'వారికి మనం ఎలా కనిపిస్తున్నాం, వారేమనుకుంటున్నారు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాసంస్థల ఏర్పాటుకు రూ.12వేల కోట్ల విలువైన భూములు కేంద్రానికి ఇస్తే... నాలుగేళ్లలో కేవలం రూ. 450 కోట్లు విద్యాసంస్థలకు కేటాయించదని మండిపడ్డారు. ఇదే విషయాన్ని పార్లమెంట్‌లో సూటిగా ప్రధానినే ప్రశ్నించానని తెలిపారు. రాష్ట్రంలో ప్రతిపక్షమైన వైసీపీ, కేంద్రంలో బీజేపీ నేతలు రాష్ట్ర ప్రజల మనోభావాలను గుర్తించాలని కోరారు. రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన న్యాయమైన డిమాండ్లన్ని నెరవేరేవరకూ టీడీపీ ఎంపీలందరం రాజీలేని పోరాటం చేస్తామని జయదేవ్ స్పష్టం చేశారు.

ఏపీ పరాయి దేశంలో ఉందా?


ఎంపీ రామ్మోహన్ నాయుడు



ఏపీకి చాలా చేశామని, కానీ ఏపీ బయటకు చెప్పటం లేదని బీజేపీ ఎంపీ హరిబాబు మీడియా సమావేశంలో చెప్పడంపై టీడీపీ ఎంపీ రామ్మోహన్‌నాయుడు విరుచుకుపడ్డారు. కొత్తగా ఏర్పడ్డ రాష్ట్రాలకు దూరదర్శన్, పాస్ పోర్టు ఆఫీసులు ఇవ్వరా? దేశంలో ఆంధ్రప్రదేశ్ అంతర్భాగం కాదా? తామేమైనా పక్క దేశంలో ఉన్నామా? అని ప్రశ్నించారు. రైల్వే జోన్ విషయంలో ఎందుకు సమాధానం ఇవ్వడం లేదని కేంద్రాన్ని నిలదీశారు. రాజకీయ నిర్ణయం తీసుకుంటే రైల్వే జోన్‌పై స్పష్టత వస్తుందని.. ఆకలేసినప్పుడే ప్రజలకు అన్నం పెట్టాలని అన్నారు. పక్క రాష్ట్రాలకు మెట్రో రైల్వేల కోసం రూ. కోట్లు కేటాయించినప్పుడు, ఆంధ్రప్రదేశ్ మీకు గుర్తుకురాలేదా? అని బీజేపీ నేతలను రామ్మోహన్‌నాయుడు నిలదీశారు. హరిబాబు విడుదల చేసిన 27పేజీల నివేదికలో విభజన హామీల ప్రస్తావనే లేదని ఆరోపించారు. విభజన చట్టంలోని హామీల గురించే తాము అడుగుతున్నామని రామ్మోహన్‌నాయుడు అన్నారు. చట్టంలోని హామీల విషయంలో నాలుగేళ్లు గడిచినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉందన్నారు. ప్రత్యేక ప్యాకేజీ ద్వారా ఇప్పటివరకు కేంద్రం ఏమిచ్చిందో చెప్పగలరా? అని ప్రశ్నించారు. పోలవరం గురించి ఇప్పటివరకూ స్పష్టతలేదన్నారు. ఏపీకి న్యాయం చేయాలని కోరుతూ సీఎం చంద్రబాబు ఇంకా ఎన్నిసార్లు ఢిల్లీ వెళ్లాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము మిత్రపక్షంలో ఉన్నా రాష్ట్ర ప్రజల కోసమే పార్లమెంటులో పోరాడామని, ఇప్పటికీ రాష్ట్ర తలసరి ఆదాయంలో పక్క రాష్ట్రాలతో పోలిస్తే 35 వేలకు దిగువనే ఉన్నామని అన్నారు. ప్రజల మనోభావాలను కేంద్రం అర్థం చేసుకోవాలని రామ్మోహన్ నాయుడు కేంద్రాన్ని విజ్ఞప్తి చేశారు. ప్రతిపక్ష వైసీపీ కుట్రలు చేస్తే, తెలుగుదేశం పార్టీ పోరాటాలు చేస్తోందని, ఆ పార్టీవి నిలకడలేని ప్రకటనలు, నిబద్ధత లేని పోరాటాలని ఎద్దేవా చేశారు. వైసీపీ నేతల రాజీనామాల సంగతి ఏమైంది? అని ఆయన ప్రశ్నించారు.

'హోదా'తో పాటు అన్ని అంశాలు నెరవేర్చాలి: కళా

విభజన చట్టంలో పేర్కొన్న ప్రత్యేక హోదాతో పాటు రాష్ట్రానికి రావాల్సిన అన్ని అంశాలను కేంద్రం నెరవేర్చాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కిమిడి కళా వెంకట్రావు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం కలిగిస్తే సహించేది లేదన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కావాలని వైసీపీ ఎప్పుడైనా కేంద్రాన్ని ప్రశ్నించిందా? అని కళా ప్రశ్నించారు. జగన్ స్వప్రయోజనాల కోసం వైసీపీ పుట్టిందని ఆయన మండిపడ్డారు. కాగా కేంద్రం న్యాయం చేశామని ప్రగల్భాలు పలకొద్దని రాష్ట్ర ప్రణాళిక సంఘ ఉపాధ్యక్షుడు కుటుంబరావు మండిపడ్డారు. ప్రజలకు అభివృద్ధి కంటికి కనబడనంత వరకు న్యాయం జరగనట్లేనని కుటుంబరావు పేర్కొన్నారు.



లెక్కలు చెప్పండి!

(మొదటిపేజీ తరువాయి)

లోపలా... వెలుపలా నిరసన వెల్లువెత్తటంతోపాటు తదనంతర పరిణామాల నేపథ్యంలో ఆదివారం హైదరాబాద్‌లో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్‌తో కలిసి ఈ సందర్భంగా తన మనోభావాలను వెల్లడించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదాసహా విభజన సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంపై ప్రజలతోపాటు తనకూ ఎంతో బాధ కలుగుతోందని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పర విరుద్ధ ప్రకటనలు చేస్తూ ప్రజలను గందరగోళంలో పడేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ అయోమయం నుంచి ప్రజలకు అవగాహన కల్పించడం కోసం ఈ నెల 15లోగా లెక్కలన్నీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆ మేరకు కేంద్రం ఎన్ని నిధులిచ్చింది? ఎంత ఖర్చు పెట్టారు? ఎంత అప్పు తీసుకున్నారు? తదితర వివరాలన్నీ ఇవ్వాలని కోరుతున్నట్లు చెప్పారు. ఇదే అంశంపై ఇంతకుముందు కూడా తాను సభ ఏర్పాటుచేసి మరీ డిమాండ్ చేశానని గుర్తుచేశారు. కానీ, అటు కేంద్రంగానీ... ఇటు రాష్ట్రంగానీ ఎలాంటి స్పష్టత ఇవ్వలేదని పేర్కొన్నారు. అందుకే ఉండవల్లి, జయప్రకాశ్ నారాయణ్ వంటి మేధావులుసహా ఆర్థికవేత్తలు, నిపుణులతో రెండు రోజుల్లో సంయుక్త నిజనిర్ధారణ కమిటీ ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. ఇది రాజకీయాలకు పూర్తి అతీతంగా ఉంటుందని, దీనికి తాను దూరంగా ఉంటానని ప్రకటించారు. ప్రభుత్వాలు ఈ కమిటీకిగానీ, తనకుగానీ వివరాలివ్వాలని కోరారు. గణాంకాల్లోని నిజానిజాలను ఈ కమిటీ నిగ్గుదేలుస్తుందని చెప్పారు.

ప్రజలకు వాస్తవాలు చెప్పే బాధ్యత రాష్ట్రానిదే

ఆంధ్రప్రదేశ్‌కు చాలా నిధులిచ్చేశామని కేంద్రం చెబుతున్నా స్పష్టమైన గణాంకాలు వెల్లడించడం లేదని పవన్ కల్యాణ్ చెప్పారు. అలాగే కేంద్రం అరకొరగా విదిలిస్తున్నదని వాపోవడమే తప్ప పూర్తిస్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం వివరాలు చెప్పడంలేదన్నారు. ఏదేమైనా ప్రజలకు వాస్తవాలు చెప్పాల్సిన బాధ్యత పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. విభజన హామీలు నెరవేర్చకపోవడంపై



నాలుగేళ్లుగా టీడీపీ ప్రభుత్వం ఎందుకు జాప్యం చేసిందని నిలదీశారు. ఎప్పటికప్పుడు నిజాలు చెబితే ప్రజలపరంగానూ కేంద్రంపై ఒత్తిడి పెరిగి ఉండేదన్న సత్యాన్ని ప్రభుత్వం గుర్తించలేదని చెప్పారు. అందుకే జనం తరపున ఇప్పుడు ప్రశ్నిస్తున్నానని పేర్కొన్నారు. రాజకీయాల్లోకి రావాలని తననెవరూ కోరకపోయినా ప్రజల కోసమే రంగప్రవేశం చేశానని తెలిపారు. అటుపైన టీడీపీ, బీజేపీల స్నేహంతో రాష్ట్రానికి మేలు కలుగుతుందని ఆశించి 2014లో మద్దతిచ్చానని చెప్పారు. అందుకే ప్రజల తరపున నిజాలు వెల్లడించాలని మిత్రపక్షం హోదాలో కోరే హక్కుతోపాటు బాధ్యత కూడా తనపై ఉందన్నారు. ఇటీవల పోలవరం ప్రాజెక్టుపై శ్వేతపత్రం కోరినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదని గుర్తుచేశారు.

పవన్ ఆవేదనలో సామాన్యుడి గళం: ఉండవల్లి

పవన్ కల్యాణ్ ఆవేదనలో సామాన్యుడి గళం వినిపించిందని ఉండవల్లి అరుణ్‌కుమార్ చెప్పారు. ''ప్రభుత్వాలు అబద్ధాలాడవు.. కానీ, నిజాలు మాత్రం చెప్పవు'' అని ఈ సందర్భంగా ఆయన చమత్కరించారు. ''లక్ష కోట్లు మంజూరు చేశామని కేంద్ర ప్రభుత్వం తరపున బీజేపీ నేతలు ప్రకటిస్తారు. అయితే, లక్ష రూపాయలే విడుదలై ఉంటాయి... ఆ నిజం మాత్రం చెప్పరు. ఇస్తున్నాం... ఇస్తూనే ఉంటాం... అంటూ కాస్తకాస్త విదిలిస్తారు తప్ప పూర్తిగా ఇవ్వరు'' అని విశదీకరించారు. పవన్ కల్యాణ్ తనను కలిసిన తర్వాత రాజకీయాలు మాట్లాడలేదన్నారు. కేంద్ర, రాష్ట్రాల్లో అబద్ధమాడుతున్నది ఎవరని ప్రశ్నించారని చెప్పారు. అప్పుడాయన గొంతులో ఓ సామాన్యుడి ఆవేదన వినిపించిందని చెప్పారు. తద్వారా పవన్ తనను ఆకట్టుకున్నారని, ప్రజల కోసం ఆయనతో కలసి సంతోషంగా పని చేస్తానని ప్రకటించారు. పవన్‌కల్యాణ్ వల్లే గోదావరి జిల్లాల్లో బీజేపీ-టీడీపీ కూటమి గెలిచినందున ఆయనను కూడా ప్రభుత్వంలో భాగస్వామిగా పరిగణించాల్సి ఉంటుందని చెప్పారు. కాబట్టి ఆయన కోరితే శ్వేతపత్రం తప్పక ఇస్తారన్నారు. బీజేపీ, టీడీపీలకు మద్దతిచ్చారు కనుక పవన్ కొన్ని విషయాలు మాట్లాడకపోవచ్చునని పేర్కొన్నారు. అయితే, సంయుక్త కమిటీ ఏర్పాటు చేస్తున్నందున నిజాలు వెల్లడిస్తారనే నమ్ముతున్నట్లు చెప్పారు. అధికారం కోసం కాకుండా ప్రజలకోసం పవన్ నిజమైన రాజకీయాలు ప్రారంభించారంటూ అభినందించారు. పవన్ చెప్పిన అంశాలను పరిశీలించి నివేదిక ఇస్తామని, తద్వారా ప్రజలకు నిజం తెలియాలని చెప్పారు. తానేమీ ఎన్నికలలో పోటీ చేయబోనని, ప్రచారానికి కూడా రాబోనని, తనకు అప్పగించిన బాధ్యత మాత్రమే పూర్తి చేస్తానని స్పష్టం చేశారు.

స్వరం మారింది


(మొదటిపేజీ తరువాయి)

సైతం గొంతు సవరించుకుంటున్నారని తెలుస్తోంది. ఇంతకాలం అధికార తెలుగుదేశం పార్టీపై ఈగ వాలనీయని పార్టీలోని వెంకయ్యనాయుడు వర్గంగా పేరుపడిన నేతలు.. ఇప్పుడు తమ వైఖరి మార్చుకొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, విశాఖ ఎంపీ డాక్టర్ కె. హరిబాబు కూడా లెక్కల గురించి మాట్లాడి టీడీపీని ఇరకాటంలో పెట్టారు. ఆయన బాటలో ఇంతకాలం టీడీపీ పాలనపై నోరువిప్పని పలువురు జిల్లా స్థాయి నేతలు కూడా ఇప్పుడు బహిరంగ విమర్శలకు దిగుతున్నారు. సోషల్ మీడియాలో ఒక్కసారిగా బీజేపీ నేతల కార్యకలాపాలు ముమ్మరంగా పెరిగాయి.

ఇచ్చిందెంత...కట్టిందెంత

రాజధాని నిర్మాణానికి కేంద్రం ఇచ్చిందెంత, ఇక్కడ జరిగిన నిర్మాణమెంత అంటూ రాష్ట్ర అసెంబ్లీలో బీజేపీ పక్షనేత విష్ణుకుమార్ రాజు కొత్త ప్రశ్నలతో విమర్శలకు దిగారు. స్థలం సొంతదైతే చదరపు అడుగు నిర్మాణానికి రూ.1500 ఖర్చు అవుతుందని, అన్ని వసతులతో కూడిన రాజధాని కాబట్టి మహా అయితే చదరపు అడుగుకి రూ.2500 ఖర్చు అనుకొన్నా కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఇచ్చిన రూ. 2500 కోట్లతో కోటి చదరపు అడుగుల నిర్మాణాలు పూర్తి చేయవచ్చని ఆయన అన్నారు. విచిత్రంగా రాజధానిలో ఒక్క భవనం నిర్మాణం కూడా జరగలేదని ఎద్దేవా చేశారు. ఉత్సవాలు, పండుగల పేరుతో ఈవెంటు మేనేజర్లకు, సదస్సుల పేరుతో స్టార్ హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్లకు కోట్ల రూపాయలను దోచిపెడుతున్నారని ధ్వజమెత్తారు. ఇన్నాళ్లబట్టి ఈ తరహా వివాదాల్లోకి రాని మరో ఎంఎల్ సీ మాధవ్ కూడా ఇప్పుడు గళం విప్పారు. రాష్ట్రానికి ఇచ్చిన నిధులు, ఖర్చులు, అందులో సద్వినియోగం, దుబారా, ఆడంబర ఖర్చులపై బహిరంగ చర్చకు సిద్ధమా అంటూ ఆయన తెలుగుదేశం నేతలకు సవాల్ విసిరారు. ఇంతకాలం కేంద్రం ఎంతో సహకరిస్తోందని అందరికీ చెప్పిన తెలుగుదేశం నేతలు ఎన్నికలు దగ్గర పడుతున్నాయనగా ఏమీ చేయలేదని ప్రచారం చేస్తే ఎలా అని ప్రశ్నించారు.

వీర్రాజు బాటలోనే...



తెలుగుదేశం ప్రభుత్వాన్ని అడుగడుగునా నిలదీస్తూ బీజేపీలో ఫైర్‌బ్రాండ్‌గా పేరుపడ్డ సోము వీర్రాజుకు పార్టీలో మద్ద తు పెరుగుతోంది. శనివారం దేశ రాజధానిలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి మరీ రాష్ట్రానికి కేంద్రం ఎటువంటి అన్యాయం చేయలేదని, చేయబో దని బల్లగుద్దిన హరిబాబు.. పూర్తిగా లెక్కలు కూడా చెబుతూ నిశిత విమర్శ లు చేశారు. కేవలం డీపీఆర్ ఇవ్వకపోవడం వల్లే అమరావతి మెట్రోకు నిధులు ఇవ్వలేదని ఆయన స్పష్టం చేశారు. నేరుగా పార్టీ అధ్యక్షుడు హరిబాబే గళం విప్పడంతో సోము వీర్రాజు తన స్వరాన్ని మరింత పెంచారు. కేవలం అసెంబ్లీ సీట్లను 175 నుంచి 225 కు పెంచకపోవడం వల్లే ప్రత్యేక హోదా, ప్యాకేజీల పేరుతో టీడీపీ కొత్త డ్రామాను ప్రారంభించిందని ధ్వజమెత్తారు. కేంద్రం నుంచి ఆంధ్రప్రదేశ్ సాధించినన్ని నిధులు మరే రాష్ట్రం సాధించలేదని గత ఏడాది ఘనంగా ప్రకటించిన చంద్రబాబు ఇప్పుడెందుకు ఉన్నట్టుండి మాటమారుస్తున్నారని ప్రశ్నించారు. కన్నా లక్ష్మీనారాయణ మరో అడుగు ముందుకేసి కాంగ్రెస్ మాజీ అధినేత్రి సోనియాగాంధీతో తెలుగుదేశం ఎంపీలు ఎలా భేటీ అవుతారని ప్రశ్నించారు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలను రెచ్చగొట్టవద్దని పార్టీ జాతీయ అధికార ప్రతినిధి జీవీఎల్ నరసింహరావు అనడంతోనే పార్టీ వైఖరి స్పష్టమైంది. ఇక టీడీపీ-బీజేపీ మధ్య తెంచుకోవడమే తప్ప బంధం ఉంచుకోవడం కుదిరే పని కాదని దాదాపుగా తేలిపోయింది.



మాజీ సీఎం రోశయ్యకు జీవన సాఫల్య పురస్కారం

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (మనం ప్రతినిధి): మాజీ గవర్నర్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్యకు జీవన సాఫల్య పురస్కార ప్రదాన కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. హైదరాబాద్‌లోని పార్క్ హయాత్ హోటల్‌లో ఆదివారం రాగసప్తస్వరం అనే సాంస్కృతిక సంస్థ, టీ సుబ్బరామిరెడ్డి ఆధ్వర్యంలోని లలిత కళాపరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేతుల మీదుగా రోశయ్యకు ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రసంగించిన ఉపరాష్ట్రపతి, రాజకీయాలకు అతీతంగా అందరి అభిమానం చూరగొన్న వ్యక్తిగా రోశయ్యను ప్రశంసించారు. ప్రస్తుత రాజకీయ నేతలు రోశయ్యను స్ఫూర్తిగా తీసుకోవాలని వెంకయ్య నాయుడు అన్నారు. రాజకీయ నాయకులు ఒకరికొకరు ప్రత్యర్థులే కాని శత్రువులు కాదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని ఆయన అన్నారు. ఏ హోదాలో పనిచేసినా ఒక ప్రత్యేక లక్ష్యంతో రోశయ్య పనిచేసే వారని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ, టీ సుబ్బరామిరెడ్డి, కేవీ రమణాచారి, టీడీపీ మహిళా నేత నన్నపనేని రాజకుమారి, కాంగ్రెస్ నేతలు వీ హనుమంతరావు, మర్రి శశిధర్ రెడ్డి, సినీ నటులు జమున, గీతాంజలి, రచయిత్రి యద్ధనపూడి సులోచనా రాణి తదితరులు పాల్గొన్నారు.

రజనీ 'కాషాయం' అయితే.. పొత్తు ఉండదు


ఓ అవగాహనకు రావాల్సి ఉంది.. స్నేహం, రాజకీయాలు వేర్వేరు

- ప్రజల కోసమే రాజకీయాల్లోకి
- 21న కీలక ప్రకటన: కమల్‌హాసన్

కేంబ్రిడ్జి, ఫిబ్రవరి 11: దాదాపు ఒకే సమయంలో.. మార్పు నినాదంగా.. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడమే లక్ష్యంగా రాజకీయ అరంగేట్రం చేసిన ప్రఖ్యాత నటులు రజనీకాంత్, కమల్ హాసన్ పొత్తు పెట్టుకుంటారా? ఇద్దరూ కలసి ఎన్నికల బరిలో దిగుతారా? తమిళనాట ప్రస్తుతం ఇదే హాట్ టాపిక్. రజనీ, కమల్ పొత్తు పెట్టుకుంటారని ఆ రాష్ట్రంలో జోరుగా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. పొత్తు పెట్టుకునేందుకు కమల్ ఆసక్తిగా ఉన్నారన్న వార్తలు వెలువడుతున్నాయి. ప్రసిద్ధ హార్వర్డ్ యూనివర్సిటీలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న కమల్ ఈ విషయంపై స్పష్టత ఇచ్చారు. రజనీ రాజకీయ సిద్ధాంతాలు కాషాయం జోడింపు అయితే పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని కమల్ పేర్కొన్నారు. బీజేపీకి రజనీ దగ్గరవుతారని వస్తున్న వార్తలపై ఓ ప్రశ్నకు సమాధానం కమల్ ఈ సమాధానమిచ్చారు. కాగా రజనీకాంత్‌తో పొత్తుపెట్టుకునే విషయాన్ని ఆయన తోసిపుచ్చలేదు. ''రజనీకాంత్, నేను మంచి మిత్రులం. అభిప్రాయాలు, ఆలోచనల్లో ఇద్దరి మధ్య సారూప్యతలు ఉన్నాయి. అలాగే మేనిఫెస్టోల్లో కూడా ఏకాభిప్రాయాలు ఉన్నాయి. అయితే స్నేహం వేరు. రాజకీయాలు వేరు'' అని కమల్ అన్నారు. మతం, కాషాయం సిద్ధాంతాల విషయంలో ఇద్దరి మధ్య భిన్నాభిప్రాయలు ఉన్నాయని చెప్పారు. దీనిపై ప్రస్తుతానికి ఓ అవగాహన లేదని అన్నారు. రజనీ రాజకీయాల్లో కాషాయం సిద్ధాంతాలు ఉండవని భావిస్తున్నట్టు చెప్పారు. అవసరమైతేనే తాను ఇతరులతో చేతులు కలుపుతానని, ఎన్నికల తర్వాత మాత్రం పొత్తు ఉండదని ఓ ప్రశ్నకు సమాధానంగా కమల్ బదులిచ్చారు. ''ఎన్నికల్లో మెజార్టీ రాకుంటే, అదే ప్రజల తీర్పు అయితే ప్రభుత్వంలో భాగస్వామిని కాను. ప్రతిపక్షంలో ఉంటాను. తర్వాతి ఎన్నికలకు ఎదురు చూస్తా'' అని కమల్ అన్నారు. ప్రజల కోసమే తాను రాజకీయ పార్టీ స్థాపించానని, రాజకీయ నాయకులతో కలసి నడవటానికి కాదని స్పష్టం చేశారు. తమిళనాడులో పరిస్థితులు బాగాలేవంటూ, ప్రస్తుత రాజకీయాలను తప్పుపట్టారు. మార్పు తీసుకురావడానికి తాను రాజకీయాల్లోకి వచ్చినట్టు పునరుద్ఘాటించారు. ఆప్ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ చెన్నైలో తనను కలిసారని, తమతో పొత్తు పెట్టుకోవాలని ఆహ్వానించారని చెప్పారు. కేజ్రీవాల్‌తో పాటు ఇతరుల సలహాలు తీసుకుంటానని చెప్పారు. ఈ నెల 21న కీలక ప్రకటన చేస్తానని ప్రకటించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తమిళులు మద్దతు ఇవ్వాలని, తమ ఆలోచనలు పంచుకోవాలని కమల్ కోరారు.

ప్రతి జిల్లాలో ఓ గ్రామం దత్తత

తమిళనాడులో ప్రతి జిల్లాలో ఓ గ్రామాన్ని దత్తత తీసుకుంటానని కమల్ హాసన్ ప్రకటించారు. ప్రపంచంలోనే వాటిని అత్యుత్తమ గ్రామాలుగా తీర్చిదిద్దుతానని చెప్పారు. మొదట ఓ గ్రామాన్ని దత్తత తీసుకుంటానని, తర్వాత జిల్లాకో గ్రామాన్ని ఎంపిక చేసి అభివృద్ధి చేస్తానని చెప్పారు.





• రజనీకాంత్

‘కాలా’ కన్‌ఫర్మ్

రజనీకాంత్ టైటిల్ పాత్రలో నటిస్తోన్న చిత్రం ‘కాలా’. పా. రంజిత్ దర్శకుడు. వండర్ బార్స్ పతాకంపై ధనుష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. హ్యూమా ఖురేషి, అంజలి పాటిల్, సముద్ర ఖని ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. బాలీవుడ్ నటుడు నానా పటేకర్ ఈ సినిమాలో నెగిటివ్ టచ్ ఉన్న పాత్రలో నటిస్తున్నారు. ఏప్రిల్ 27న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రంలో రజనీకాంత్ ముంబై డాన్‌గా కనపడనున్నారు. ‘కబాలి’ తర్వాత పా.రంజిత్ దర్శకత్వంలో రజనీకాంత్ నటిస్తోన్న మరో చిత్రమిది. ‘కాలా’ రిలీజ్ డేట్ అధికారికంగా చెప్పడంతో ‘2.0’ ఈ వేసవిలో రావడం లేదని చెప్పకనే చెప్పేశారన్నమాట.

క్లైమాక్స్ చిత్రీకరణలో బిజీ బిజీగా బన్ని



• అల్లు అర్జున్

అల్లు అర్జున్, అను ఇమ్మాన్యుయేల్ జంటగా నటిస్తోన్న చిత్రం ‘నాపేరు సూర్య నా ఇల్లు ఇండియా’. వక్కంతం వంశీ దర్శకుడు. కె. నాగబాబు ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. రామలక్ష్మీ సినీ క్రియేషన్స్‌పై శిరీషా శ్రీధర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈరోజు నుండి హైదరాబాద్‌లో క్లైమాక్స్‌ని చిత్రీకరించనున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తిచేసి సినిమాను ఏప్రిల్ 27న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు మాట్లాడుతూ ‘‘ఈ క్లైమాక్స్‌ను భారీస్థాయిలో చిత్రీకరించేందుకు ప్లాన్ చేశాం. ‘లవర్ ఆల్సో.. ఫైటర్ ఆల్సో’ అనే పాటను ఫిబ్రవరి 14న వాలెంటైన్స్ డే సందర్భంగా రిలీజ్ చేస్తున్నాం. ఏప్రిల్ 27న ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం’’ అని అన్నారు.



• నితిన్, మేఘా ఆకాష్

నితిన్ ‘ఛల్ మోహన్ రంగ’

నితిన్, మేఘా ఆకాష్ జంటగా.. శ్రేష్ట్ మూవీస్, పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్ సంయుక్తంగా నిర్మిస్తోన్న చిత్రం ‘ఛల్ మోహన్ రంగ’. దర్శకుడు త్రివిక్రమ్ ఈ చిత్రానికి కథను అందించారు. ఎన్. సుధాకర్ రెడ్డి నిర్మాత. కృష్ణ చైతన్య దర్శకుడు. ఇది నితిన్ 25వ చిత్రం కావడం విశేషం. ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ని పవన్ కల్యాణ్ తన ట్విట్టర్ అకౌంట్ ద్వారా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎన్.సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ‘‘ఈ చిత్రం టీజర్‌ను ప్రేమికులరోజు సందర్భంగా ఈ నెల 14న.. అలాగే సినిమాను ఏప్రిల్ 5న విడుదల చేస్తున్నాం. మిగిలిన ఒక పాటను ఈ నెల 14 నుంచి హైదరాబాద్‌లో చిత్రీకరించనున్నాం’’ అన్నారు. దర్శకుడు కృష్ణ చైతన్య మాట్లాడుతూ ‘‘ప్రేమతో కూడిన కుటుంబ కథా చిత్రం ఇది. చాలా సరదాగా సాగుతుంది’’ అని తెలిపారు.

తనని ఎవరైనా హర్ట్ చేశారేమో!

– వెంకీ అట్లూరి

‘నాకు సినిమా ఇండస్ట్రీలోకి రావాలనే కోరిక ఉండేది కానీ.. ఎలా అనే దానిపై క్లారిటీ ఉండేది కాదు. ‘స్నేహగీతం’ సినిమాతో నటుడిగా ఎంట్రీ ఇచ్చాను. ఆ సినిమా కోసం డైలాగ్స్ కూడా రాశాను. అలా రాయడం వల్లనేమో కానీ.. నాకు యాక్టింగ్‌పై ఆసక్తి తగ్గిపోతూ వచ్చింది. రైటర్‌గా ‘స్నేహగీతం’, ‘ఇట్స్ మై లవ్‌స్టోరీ’, ‘కేరింత’ సినిమాలు చేశాను. ‘కేరింత’ సినిమా సమయంలోనే సెట్స్‌లో ఏం జరుగుతుందో గమనించేవాడిని. అలా నెమ్మదిగా రచన, దర్శకత్వ విభాగాల్లోకి వచ్చేశాను’ అని అన్నారు డైరెక్టర్ వెంకీ అట్లూరి. వరుణ్‌తేజ్, రాశీఖన్నా జంటగా నటించిన చిత్రం ‘తొలిప్రేమ’. ఈ చిత్రాన్ని వెంకీ అట్లూరి దర్శకత్వంలో బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ నిర్మించారు. సినిమా ఫిబ్రవరి 10న విడుదలైంది. ఈ సందర్భంగా పాత్రికేయులతో దర్శకుడు వెంకీ అట్లూరి మాట్లాడుతూ......

సక్సెస్ రెస్పాన్స్ ..

సక్సెస్ రావాలని ఎవరైనా కోరుకుంటారు. ఇప్పుడు వచ్చిన సక్సెస్ పట్ల చాలా హ్యాపీగా ఉన్నాను. మేం అనుకున్న దాని కంటే ఎక్కువగా వచ్చిందని అనుకుంటున్నాను. భీమవరం ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో మెగా ఫ్యాన్స్‌కు ఒక ప్రామిస్ చేశాను. పవన్ కల్యాణ్‌గారి ‘తొలిప్రేమ’ గౌరవాన్ని కాపాడుతానని. అన్నట్లుగానే కాపాడానని అనుకుంటున్నాను.

రాశి..ది బెస్ట్ పెర్‌ఫార్మెన్స్..



సినిమాలో రాశీ ఖన్నాను హీరోయిన్‌గా తీసుకోవాలనేది నిర్మాతలు, వరుణ్‌తేజ్ ఆలోచనే. వాళ్లే రాశి అయితే బావుంటుందని అన్నారు. నేను ముందుగా కొత్త అమ్మాయిని హీరోయిన్‌గా తీసుకోవాలని అనుకున్నాను. లేదు.. కాస్త ఆడియెన్స్‌కు కనెక్ట్ అయిన హీరోయిన్ అయితే బావుంటుందని నిర్మాతలు అన్నారు. మనకు ఉన్న హీరోయిన్స్‌లో నా కథకు సరిపోయేవాళ్లు తక్కువగానే ఉన్నారు. ఎవరా? అని ఆలోచిస్తే.. రాశి అయితే బావుంటుందనుకున్నాం. అయితే తను కమర్షియల్ సినిమాలు ఎక్కువగా చేసింది కదా! ప్రేక్షకులు ఎలా రిసీవ్ చేసుకుంటారోనని అనుకున్నాం. లుక్ టెస్ట్ చేశాం. ఆ టెస్ట్‌లో తను 17 ఏళ్ల అమ్మాయిలా క్యూట్‌గా కనపడింది. దాంతో మేం తనైతే సరిపోతుందని ఫిక్స్ అయ్యాం. నటన పరంగా రాశి.. ది బెస్ట్ పెర్‌ఫార్మెన్స్ ఇచ్చింది.

తమన్ వినగానే ఎగ్జయిట్ అయ్యాడు..

మ్యూజిక్ డైరెక్టర్ తమన్ ఇప్పటి వరకు ఒకటో రెండో లవ్‌స్టోరీస్‌కి మ్యూజిక్ చేసుంటారేమో.. నేను ఈ కథ చెప్పగానే, తనకి కొత్తగా అనిపించి, ఎగ్జయిట్‌మెంట్‌తో చేద్దామని అన్నారు. మ్యూజిక్ సిట్టింగ్స్‌లో కూర్చున్నప్పుడు కూడా.. ట్యూన్స్ అన్నీ దాదాపు సింగిల్ సిట్టింగ్‌లోనే ఓకే అయ్యాయి. రీరికార్డింగ్ వినగానే.. తను కథను ఎంత నమ్మాడో.. ఎంత ఎగ్జయిట్ అయ్యాడో అనే సంగతి అర్థమైంది నాకప్పుడే. మరి తమన్‌ని ఎవరైనా అమ్మాయి హర్ట్ చేసిందో తెలియదు. తన స్వంత కథకు మ్యూజిక్ ఇచ్చినట్టు తమన్ ఫీలై మ్యూజిక్ చేశాడు.

టీజర్ చూసి..

నేను కథ తయారు చేసుకునేటప్పటికీ వరుణ్‌తేజ్ తొలి చిత్రం ‘ముకుంద’ కూడా విడుదల కాలేదు. ఓ టీజర్ మాత్రమే విడుదలైంది. ఆ టీజర్ చూసి ఇలాంటి హీరో మనకు ఉంటే ఇంకా కథను బాగా చెప్పొచ్చు అని అనుకున్నాను. అయితే మెగా ఫ్యామిలీ నుండి వస్తోన్న హీరో కదా! లవ్‌స్టోరీస్ చేస్తాడో లేదో..! అనే భయం కూడా వచ్చింది. అయితే ‘కంచె’ రిలీజ్ అయిన తర్వాత కాస్త ధైర్యం వచ్చింది. తను డిఫరెంట్ సినిమాలు చేయడానికి సిద్ధం అని తెలిసింది. ‘లోఫర్’ టైంలో తనను కలిసి ఈ కథ చెప్పాను.

టైటిల్ విషయంలో ఎవరూ ఏమీ అనలేదు..

‘తొలిప్రేమ’ అనే టైటిల్‌ను పెట్టి ఫస్ట్ లుక్ పోస్టర్స్‌ను విడుదల చేశాం. తర్వాత టీజర్ రిలీజ్ చేశాం. వీటిలో ప్రేక్షకులకు ఎక్కడో స్వచ్ఛత కనపడింది కాబట్టే ఈరోజు ఇంత బాగా సినిమాను ఆదరిస్తున్నారు. ఈ సినిమా టైటిల్ పెట్టినప్పుడు ఎవరూ ఏమీ అనలేదు. అయితే కొంత మంది మాత్రం ‘టైటిల్ పెట్టావ్ సరే! జాగ్రత్తగా తీయ్’ అన్నారు.

అదే బెస్ట్ కాంప్లిమెంట్...

రాఘవేంద్రరావుగారు ఫోన్ చేసి సినిమా చాలా బావుందని కాంప్లిమెంట్ ఇచ్చారు. తెలుగు ఇండస్ట్రీకి ఫస్ట్ షో మ్యాన్ అయిన రాఘవేంద్రరావుగారు ఫోన్ చేయడం హ్యాపీగా అనిపించింది. తర్వాత ఆర్.నారాయణమూర్తిగారు ఫోన్ చేసి అభినందించారు. ఇలా చాలా మంది ఫోన్ చేశారు. ముఖ్యంగా కె.టి.ఆర్‌గారు సినిమా చూసి ట్వీట్ చేశారు. అలాంటి పెద్ద పొలిటిషియన్ మనల్ని అభినందిస్తూ ట్వీట్ చేయడం గ్రేట్ అనిపించింది.

తదుపరి చిత్రం..

నెక్స్ట్ మూవీ కూడా బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్‌గారి బ్యానర్‌లోనే ఉంటుంది. దిల్‌రాజుగారి బ్యానర్‌లో కూడా త్వరలోనే సినిమా చేస్తాను.


అరంగేట్రానికి సిద్ధం



• సాషా చెట్రి

ఎయిర్ టెల్ 4జి ప్రకటనలతో యావత్ భారతదేశంలో అభిమానులను సంపాదించుకుంది డెహ్రాడున్ బ్యూటీ సాషా చెట్రి. స్కూల్ రోజులనుంచే మోడలింగ్‌పై ఉన్న ఆసక్తితో ఆ రంగంలోకి అడుగుపెట్టింది సాషా. చిన్న వయసులోనే మోడలింగ్, వాణిజ్య ప్రకటనలలో సందడి చేసి పేరు ప్రఖ్యాతులను సంపాదించుకున్న ఈ ముద్దుగుమ్మ.. కేవలం మోడలింగ్‌కే పరిమితం కాకుండా.. సంగీతంలో కూడా మంచి ప్రావీణ్యం పొందింది. ఇదిలా ఉంటే.. సాషా త్వరలోనే తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టనుందని వార్తలు వినిపిస్తున్నాయి. ‘వినాయకుడు’, ‘విలేజీలో వినాయకుడు’, ‘కేరింత’ చిత్రాల దర్శకుడు అడివి సాయి కిరణ్ రూపొందించనున్న తదుపరి సినిమాలో ఈ డెహ్రాడున్ భామ నటించనుందని సమాచారం. ఈ నేపథ్యంలోనే.. హైదరాబాద్‌లో నటనకి సంబంధించిన శిక్షణ కూడా తీసుకుందట సాషా. యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనున్న ఈ సినిమాకి సంబంధించిన పూర్తి వివరాలు త్వరలోనే వెల్లడికానున్నాయి.

నాగశౌర్య కొత్త చిత్రం



‘ఛలో’తో తాజాగా మంచి విజయాన్ని అందుకున్న యువ కథానాయకుడు నాగశౌర్య.. వరుస సినిమాల్లో నటించడానికి సన్నాహాలు చేసుకుంటున్నారు. ప్రస్తుతం సినిమాటోగ్రాఫర్ సాయిశ్రీరామ్ దర్శకత్వంలో ఓ సినిమా చేయబోతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా తర్వాత శ్రీనివాస్ అనే కొత్త దర్శకుడితో కలిసి ‘నర్తనశాల’ సినిమా చేయబోతున్నారు. ఈ రెండు సినిమాలు తర్వాత.. నటుడు, దర్శకుడు కాశీ విశ్వనాథ్ దర్శకత్వంలో శౌర్య సినిమా చేయబోతున్నాడని వార్తలు వినపడుతున్నాయి. ఈ చిత్రానికి ‘గురువారం మార్చి 1..’ అనే టైటిల్ కూడా పరిశీలనలో ఉందని అంటున్నారు. అన్ని అనుకున్నట్లు కుదిరితే నటుడిగా ఫుల్ బిజీగా ఉన్న కాశీ విశ్వనాథ్, 15 ఏళ్ల తర్వాత చేయబోయే సినిమా ఇదే అవుతుంది.

ఈసారి తక్కువ గ్యాపే

కాటుక కళ్ళ చిన్నది కాజల్ అగర్వాల్.. గతేడాది 50 చిత్రాల మైలురాయికి చేరుకున్న సంగతి తెలిసిందే. అయినప్పటికీ.. సినిమాల విషయంలో ఆమె జోరు ఏ మాత్రం తగ్గలేదు. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ చేతినిండా సినిమాలతో బిజీగా ఉంది. ఇప్పటికే ఆమె నటించిన ‘అ!’, ‘ఎం.ఎల్.ఎ’ చిత్రాలు విడుదలకు సిద్ధమవుతుండగా.. ‘క్వీన్’ తమిళ రీమేక్ ‘పారిస్ పారిస్’ నిర్మాణ దశలో ఉంది. అలాగే శ్రీను వైట్ల, రవితేజ కాంబినేషన్‌లో రానున్న సినిమాలోనూ కథానాయికగా ఆమె పేరే ప్రముఖంగా వినిపిస్తోంది. అదేవిధంగా శర్వానంద్, సుధీర్ వర్మ చిత్రంలోనూ కాజల్ ఓ హీరోయిన్‌గా నటిస్తోంది. ఇదిలా ఉంటే.. గతేడాది తెలుగు చిత్రాల పరంగా సినిమా సినిమాకి బాగానే గ్యాప్ మెయిన్‌టెయిన్ చేసిన కాజల్.. ఈ ఏడాది మాత్రం తక్కువ గ్యాప్‌లోనే రెండు చిత్రాలతో సందడి చేయనుంది. ఆమె ఓ కీలక పాత్రలో నటించిన ‘అ!’ ఈ నెల 16న విడుదలకి సిద్ధమవుతుండగా.. కల్యాణ్ రామ్‌తో జోడీకట్టిన ‘ఎం.ఎల్.ఎ’ వచ్చే నెల 28న రిలీజ్ కాబోతోంది. అంటే.. రెండు వరుస నెలల్లో కాజల్ బాగానే సందడి చేయనుందన్నమాట.



• కాజల్

• నదియా



34 ఏళ్ల తర్వాత...

నదియా.. ఒకప్పటి తమిళ హీరోయిన్.. ఇప్పుడు తెలుగు, తమిళ చిత్రాల్లో అమ్మ, అత్త పాత్రల్లో నటిస్తుంది. 34 ఏళ్ల క్రితం మలయాళ స్టార్ హీరో మోహన్‌లాల్ సినిమాలో నటించి హీరోయిన్‌గా తెరంగేట్రం చేసింది. తర్వాత మలయాళం కంటే తమిళంలోనే ఎక్కువ సినిమాల్లో హీరోయిన్‌గా అలరించింది. కాగా.. 34 ఏళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడు మోహన్‌లాల్ సినిమాలో నటించబోతుంది నదియా. అయితే నదియా ఓ కీలక పాత్రలో మాత్రమే కనిపిస్తారు. ‘నీరాళి’ అనే పేరుతో తెరకెక్కనున్న ఈ సినిమాలో మోహన్‌లాల్ సరసన పార్వతీ నాయర్ నటిస్తున్నారు. అజోయ్ వర్మ దర్శకుడు. ఈ సినిమా కోసం మోహన్‌లాల్ బరువు కూడా తగ్గారు.

తెలుగులో ‘గోదా’



గతేడాది మలయాళంలో స్పోర్ట్స్ కామెడీగా విడుదలై బ్లాక్ బస్టర్‌గా నిలిచిన చిత్రం ‘గోదా’. టవీనొ థామస్, వామికా గబ్బి, ప్రముఖ రచయిత రెంజీ పనికర్ నటించారు. ఈ చిత్రానికి బసిల్ జోసఫ్ దర్శకుడు. గత సంవత్సరం మాలీవుడ్‌లో చిన్న చిత్రంగా విడుదలై పెద్ద విజయాన్ని అందుకుంది. బాలీవుడ్‌లో సైతం ఈ సినిమాను రీమేక్ చేసేందుకు బారీ నిర్మాణ సంస్థలు సిద్ధమవుతున్నాయి. అయితే తెలుగులో కొంకా ప్రొడక్షన్స్ ‘గోదా’ తెలుగు డబ్బింగ్, రీమేక్ రైట్స్‌ను సొంతం చేసుకుంది. సంస్థ అధినేత, నిర్మాత సంతోష్ కొంకా ఫ్యాన్సీ ఆఫర్‌తో ‘గోదా’ చిత్ర హక్కులను సొంతం చేసుకున్నట్లు తెలియచేశారు. ప్రస్తుతం తెలుగు రీమేక్‌కు సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ శరవేగంగా జరుగుతోందని.. తెలుగు రీమేక్ కోసం పనిచేయబోయే నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలోనే తెలియజేస్తామని చిత్ర యూనిట్ తెలిపింది.

అయోధ్య నుంచి 'బాబ్రీ' తరలించాలి

- వర్సిటీని నిర్మించాలి..సమస్యకు పరిష్కారమిదే
- ముస్లిం పర్సనల్ లా బోర్డు సభ్యుడి వ్యాఖ్య
- ఆ వెంటనే సభ్యత్వం తొలగించిన బోర్డు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11 : అయోధ్య సమస్యకు పరిష్కారం లభించాలే బాబ్రీ మసీదును వేరే చోటు తరలించాలని ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు సభ్యుడు మౌలానా సయ్యద్ సల్మాన్ హుస్సేన్ నద్వీ వ్యాఖ్యానించారు. మసీదుకు అనుబంధంగా ఓ యూనివర్సిటీని కూడా నిర్మించాలని సూచించారు. అయోధ్య సమస్య పరిష్కారానికి శ్రీశ్రీ రవిశంకర్ వివిధ ముస్లిం నేతలను కలుస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఈ నెల 8న నద్వీని రవిశంకర్ కలిశారు. అనంతరం నద్వీ మీడియాతో మాట్లాడుతూ.. బాబ్రీ మసీదును వేరే చోటుకు తరలించడమే సమస్యకు పరిష్కారమని అన్నారు. అయితే.. ఆయన వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి బోర్డు ఆయన్ను సంస్థ నుంచి తొలగించింది. '' మసీదును అమ్మలేరు. గిఫ్ట్‌గా ఇవ్వలేరు. వేరే చోటకు కూడా మార్చలేరు'' అని ఈ సందర్భంగా బోర్డు వ్యాఖ్యానించింది. మరోవైపు, నద్వీ వ్యాఖ్యలను హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ కూడా తీవ్రంగా ఖండించారు. '' ఒక్కసారి మసీదును నిర్మించారంటే అది ఎప్పటికీ మసీదేనని, అందులో ఎలాంటి రాజీ లేదు. ఎవరైతే మసీదు అంశంపై రాజీ పడతారో వారు ఆ దైవానికే సమాధానం చెప్పాలి'' అని అన్నారు.

ఏ దేశంలో వైద్యవిద్యకైనా నీట్ రాయాల్సిందే!

- నిబంధనలను కఠినతరం చేయనున్న ప్రభుత్వం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: వైద్య విద్యను అభ్యసించాలనే ఆసక్తి మాత్రమే కాదు.. తగిన సామర్థ్యం కూడా తప్పనిసరి చేయాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. వైద్య కళాశాలల్లో సీట్ పొందాలంటే నీట్ తప్పనిసరి అన్న విషయం తెలిసిందే.. అయితే, నీట్‌లో అర్హత సాధించకపోయినా విదేశాలకు వెళ్లి వైద్య విద్యను అభ్యసించే అవకాశం ఉంది. దీన్ని ఆసరాగా చేసుకొని పలువురు విద్యార్థులు పక్క దేశాలకు వెళ్లి చదువు పూర్తి చేస్తున్నారు. ఇలా విదేశాల్లో చదివిన విద్యార్థులు భారతదేశంలో ప్రాక్టీస్ చేయాలంటే తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలి. ఇందుకు గానూ ఫారెన్ మెడికల్ గ్రాడ్యుయేట్స్ ఎగ్జామినేషన్(ఎఫ్ఎంజీఈ) పరీక్షలో అర్హత సాధించాలి. దురదృష్టవశాత్తూ వీరిలో కేవలం 12 నుంచి 15 శాతం మంది విద్యార్థులు మాత్రమే ఈ పరీక్షలో అర్హత సాధిస్తున్నారు. దీంతో వారికి ప్రాక్టీస్ చేసుకునే అర్హత లేకుండా పోతోంది. సంవత్సరాల పాటు విదేశాల్లో చదివిన చదువుకు ఫలితంలేకుండా పోతోంది. ఎఫ్ఎంజీఈలో అర్హత సాధించకపోయినా, ప్రాక్టీస్ చేసేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి లభించకపోయినా సదరు విద్యార్థులు అక్రమంగా ప్రాక్టీస్ చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. దీనిని అడ్డుకోవాలంటే తగిన సామర్థ్యం ఉన్న విద్యార్థులే వైద్య విద్యను చదివేందుకు అనుమతించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రపంచంలోని ఏ దేశానికి వెళ్లి ఎంబీబీఎస్ పూర్తిచేయాలనుకున్నా సరే ముందుగా నీట్‌లో అర్హత సాధించాలనే నిబంధనను తప్పనిసరి చేసే యోచనలో ఉంది. ఈమేరకు ప్రభుత్వ వర్గాల్లో దీనిపై చర్చలు తుది దశలో ఉన్నాయని తెలుస్తోంది.

అబూధాబిలో తొలి హిందూ ఆలయం

శంకుస్థాపన చేసిన ప్రధాని నరేంద్రమోదీ



- బీఏపీఎస్ ఆధ్వర్యంలో 2020నాటికి పూర్తి
- భూమి ఇచ్చిన పాలకులకు కృతజ్ఞతలు
- ప్రవాస భారతీయులనుద్దేశించి ప్రసంగం
- దేశంలో చేపట్టిన సంస్కరణలపై వివరణ

దుబాయ్, ఫిబ్రవరి 11: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో హిందువుల తొలి ఆలయ నిర్మాణానికి ప్రధాని నరేంద్రమోదీ ఆదివారం శంకుస్థాపన చేశారు. దాదాపు 55 వేల చదరపు మీటర్ల స్థలంలో 2020నాటికి ఈ ఆలయాన్ని నిర్మించనున్నారు. బొకసన్వాసి శ్రీ అక్షర్ పురుషోత్తం స్వామి నారాయణ్ సంస్థ (బీఏపీఎస్) ఆధ్వర్యంలో ఈ ఆలయ నిర్మాణం జరగనుంది. దుబాయ్‌లోని ఒపేరా హౌజ్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆలయ నిర్మాణానికి ప్రధాని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమిరేట్స్‌లోని ప్రవాస భారతీయులనుద్దేశించి మోదీ మాట్లాడారు.



''మానవత్వం-సామరస్యాల వారధిగా, భారతదేశ ప్రతీకగా ఈ ఆలయం నిలవాలి'' అని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. ఆలయ నిర్మాణానికి కృషి చేస్తున్నవారికి, అనుమతి మాత్రమేగాక భూమి కూడా ఇచ్చిన పాలకులకు ప్రధాని కృతజ్ఞతలు తెలిపారు. భారత సంస్కృతీసంప్రదాయాలకు అబూధాబి పాలకులు ఇచ్చిన గౌరవానికి, వారి సహనశీలతకు ఇది నిదర్శనమని పేర్కొన్నారు. ఈ సందర్భంలో భారతీయుల నుంచి ఎలాంటి తప్పు జరగకూడదని సూచించారు. దుబాయ్‌లోని ప్రవాస భారతీయులను కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇరవై ఒకటో శతాబ్దాన్ని 'సెంచరీ ఆఫ్ ది ఏషియా'గా తీర్చిదిద్దేందుకు మనమంతా కష్టపడి పనిచేయాలని ఎన్నారైలకు పిలుపునిచ్చారు. నిరాశావాదాన్ని ఇండియా అధిగమించి అత్యంత వేగంగా అభివృద్ధివైపు పురోగమిస్తోందని అన్నారు. జన్మభూమి ఎంత వేగంగా పురోగమిస్తున్నదో వివిధ దేశాల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రవాసులందరికీ తెలుసునన్నారు. యూఏఈతో భారత్ బలమైన సంబంధాలను కోరుకుంటోందన్నారు. గల్ఫ్ దేశాలతో సంబంధాలు కేవలం వాణిజ్యానికే పరిమితం కాదని, పటిష్ఠ భాగస్వామ్యంలో అంతర్భాగమని చెప్పారు. రెండు దేశాల మధ్య దశాబ్దాల అనుబంధం ఎన్నడూ లేనంతగా ఇప్పుడు మరింత బలపడిందన్నారు.భారతదేశంలో చేపట్టిన సంస్కరణలపైనా మోదీ తన ప్రసంగంలో ప్రస్తావించారు. దేశంలో 70 ఏళ్లుగా కొనసాగుతున్న విధానాల్లో మార్పులు తెచ్చామని, మరికొన్ని తెస్తున్నామని చెప్పారు. తక్షణ ఫలితాల కోసం కాకుండా దీర్ఘకాలిక ప్రయోజనాల కోసమే ఈ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఏడేళ్లుగా వెనకబడుతూనే వస్తున్న వస్తుసేవల పన్ను (జీఎస్టీ) విధానానికి వాస్తవరూపం కల్పించామని చెప్పారు. నోట్ల రద్దు నిర్ణయంతో ముందుకు వెళ్లినప్పుడు పేద ప్రజలు తన ఉద్దేశాన్ని అవగతం చేసుకున్నారని, తమ నిర్ణయంతో నిద్రలేని రాత్రులు గడిపిన వారు మాత్రమే రెండేళ్ల తర్వాత కూడా విలపిస్తూనే ఉన్నారని మోదీ చమత్కరించారు. 'మీ కలలన్నీ మేము సాకారం చేస్తాం. ఆ నమ్మకాన్ని మీకు నేను ఇస్తున్నాను' అని మోదీ అనడంతో ఎన్నారైలు కరతాళధ్వనులతో హర్షం తెలిపారు. '''భారత్ నుంచి వచ్చిన 30 లక్షల మందికి గల్ఫ్ దేశాలు ఆశ్రయం కల్పిస్తున్నాయి. సొంత దేశంలోనే ఉంటున్న భావన కలిగేలా చేస్తున్నందుకు కృతజ్ఞతలు. హిందువుల కోసం ఆలయ నిర్మాణానికి అంగీకరించిన దుబాయ్ యువరాజుకు 125 కోట్ల భారతీయుల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ ఆలయం ప్రత్యేకంగా ఉండటమే కాదు.. 'వసుధైవ కుటుంబకం' అనే సందేశాన్ని కూడా ఇస్తుందని విశ్వసిస్తున్నా'' అని మోదీ పేర్కొన్నారు. ''ప్రపంచ వాణిజ్య సౌలభ్య సూచీలో భారత్ ర్యాంకు 142 నుంచి 100కు దూసుకెళ్లడం గర్వకారణం. కానీ, దీంతో మేము సంతృప్తి చెందడం లేదు. ఇది మరింత మెరుగుపడేలా చేసేందుకు కృషి చేస్తాం. మీ కలలను నిజం చేసేందుకు సమష్టి కృషిచేస్తాం'' అన్నారు. మోదీ మాట్లాడుతున్నంత సేపు ఒపెరా హౌస్ అంతా 'మోదీ.. మోదీ.. మోదీ' నినాదాలతో హోరెత్తిపోయింది. ''భారత్‌లో నిరాశ, నిస్పృహలకు చోటులేకుండా పోయింది. ప్రజల్లో ఇది సాధ్యమేనా అన్న ప్రశ్నార్థకం పోయి.. పని ఎప్పుడు పూర్తవుతుందనే విశ్వాసం ఏర్పడింది'' అని ప్రధాని పేర్కొన్నారు. అంతకుముందు అబూధాబిలోని అమరవీరుల యుద్ధ స్మారకం వద్ద ప్రధాని మోదీ పుష్పగుచ్ఛం ఉంచి నివాళి అర్పించారు.

ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ ఆదివారం యూఏఈ ఉపాధ్యక్షుడు-ప్రధాని మహ్మద్ బిన్ రషీద్ అల్ మక్తూమ్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ద్వైపాక్షిక అంశాలతోపాటు వాణిజ్యం, రక్షణ, ప్రజల మధ్య సంబంధాలపై ప్రధానంగా వారు చర్చించారు. అదే సమయంలో గల్ఫ్ కో-ఆపరేషన్ కౌన్సిల్‌తోనూ ప్రధాని సమావేశమయ్యారు. 'నవ భారతం' దార్శనికతను వారికి ప్రధాని వివరించారు. అబూధాబి యువరాజు మొహమద్ బిన్ జాయేద్ అల్-నహ్యాన్‌తో ప్రధాని మోదీ విస్తృత చర్చలు నిర్వహించారు. అనంతరం

యూఏఈ ప్రధాని, అబూధాబి యువరాజుతో భేటీ

రెండు పక్షాల మధ్య ఐదు ఒప్పందాలపై సంతకాలు పూర్తయ్యాయి. ఇందులో భాగంగా సముద్రంలో చమురు క్షేత్రానికి సంబంధించి భారత చమురు సంస్థలు 10 శాతం వాటా కొనుగోలు ఒప్పందం చరిత్రాత్మకమైనదిగా విదేశాంగ శాఖ పేర్కొంది. ''మా విలువైన మిత్రులు, అధికారిక అతిథికి మేము సాదర స్వాగతం పలుకుతున్నాం. యూఏఈ-భారత్ మధ్య చారిత్రక బంధాన్ని, ద్వైపాక్షిక స్నేహసంబంధాలను ప్రధాని మోదీ పర్యటన ప్రతిబింబిస్తున్నది'' అని మొహమద్ బిన్ జాయేద్ అన్నారు.




నలుగురు ఉగ్రవాదులు హతం

- సున్జవాన్ ఆర్మీ క్యాంపు దాడిలో
- అమరులైన ఐదుగురు జవాన్లు
- ఓ సైనికుడి తండ్రి మరణం
- సరిహద్దులో పాక్ తూటాల మోత
- నౌషెరాలో ఓ మహిళ మృతి




జమ్ము/న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: జమ్ము కశ్మీర్‌లోని సున్జవాన్ ఆర్మీ క్యాంపుపై దాడికి తెగబడిన నలుగురు ఉగ్రవాదులను సైనికులు మట్టుబెటారు. శనివారం తెల్లవారుజామున 4.55 గంటలకు జైషే మహ్మద్ ఉగ్రవాదులు సైనిక శిబిరంపై దాడి దిగడంతో మొదలైన సైనిక ఆపరేషన్ రెండో రోజూ కొనసాగింది. ఉగ్రవాదులను ఏరివేసే ప్రయత్నంలో ఐదుగురు వీర జవాన్లు అమరులయ్యారు. శనివారం ఇద్దరు మరణించగా ఆదివారం మరో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. అలాగే ఓ సైనికుడి తండ్రి కూడా మరణించారు. సుమారు 10 మందికి గాయాలయ్యాయి. క్యాంపుపె దాడి చేసిన ఉగ్రవాదులను సెంట్రీ నిలువరించడంతో పక్కనే ఉన్న ఆర్మీ సిబ్బంది కుటుంబాల క్వార్టర్స్‌లోకి చొరబడిన విషయం తెలిసిందే. దీంతో వెంటనే అప్రమత్తమైన సైన్యం క్వార్టర్స్‌ను చుట్టుముట్టి ముష్కర మూకల ఏరివేతకు రంగంలోకి దిగారు. లోపలికి చొరబడిన ఉగ్రవాదుల వద్ద భారీ ఆయుధాలు ఉండడంతో సైనికుల కుటుంబ సభ్యుల రక్షణే ధ్యేయంగా ఆపరేషన్ సాగిస్తున్నారు. ఆచితూచి అడుగులు వేస్తూ ముష్కరులను హతమారుస్తున్నారు. మరోవైపు క్యాంపు వెనుక ద్వారం నుంచి క్వార్టర్స్‌లోని కుటుంబసభ్యులను బుల్లెట్ ప్రూఫ్ వాహనాల్లో సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇప్పటికే నలుగురు ఉగ్రవాదులను మట్టుబెట్టామని లెఫ్టినెంట్ కల్నల్ దేవేందర్ ఆనంద్ తెలిపారు. శనివారం అర్ధరాత్రి తర్వాత శత్రువుల వైపు నుంచి ఎటువంటి కాల్పుల శబ్దాలు లేవని.. అయినప్పటికీ ఇంకా ఎవరైనా మిగిలి ఉన్నారా? అనే అనుమానంతో ఆపరేషన్ కొనసాగిస్తూ క్వార్టర్స్‌ను ఖాళీ చేయిస్తున్నామని చెప్పారు. కాగా, ఆర్మీ క్వార్టర్స్‌కు ముందు ఉన్న జమ్ము-లఖాన్‌పూర్ బైపాస్‌పై వాహనాలు ఏ ఇబ్బందీ లేకుండా సాఫీగా వెళ్తున్నాయని ఆర్మీ అధికారులు తెలిపారు. జమ్ములో హై అలర్ట్ కొనసాగుతోంది. నగరమంతా భద్రతను కట్టుదిట్టం చేశారు. సైని కుల ఆపరేషన్ విజయ వంతంగా పూర్తయ్యాక ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్ రావత్ క్యాంపును సంద ర్శించ నున్నారు. కాగా, సైన్యం విజయవంతంగా ఉగ్రవాదులను మట్టుబెడతారని కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఢిల్లీలో ఓ కార్యక్రమంలో చెప్పారు. జైషే ఉగ్రవాది అఫ్జల్ గురు మరణానికి (2013 ఫిబ్రవరి 9న) ప్రతికారంగా దాడి జరిగే అవకాశం ఉందని నిఘా వర్గాలు ఆర్మీని ముందే హెచ్చరించాయి.



కాల్పుల విరమణకు మళ్లీ పాక్ తూట్లు

ఓ వైపు పాక్ ప్రేరేపిత ముష్కరులు ఆర్మీ క్యాంపుపై దాడికి తెగబడితే.. మరోవైపు ఆ దేశ బలగాలు సరిహద్దులో కాల్పుల విరమణ ఒప్పందానికి తూట్లు పొడుస్తున్నాయి. నియంత్రణ రేఖ వద్ద సామాన్య పౌరుల ఆవాసాలు, సైన్యంపై మోర్టార్ షెల్స్ వర్షం కురిపించాయి. రాజౌరీ, పూంచ్, నౌషెరా ప్రాంతాల్లో వరుసగా నాలుగో రోజు పాక్ కాల్పులకు తెగబడింది. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత, ఆదివారం ఉదయం సుమారు ఆరు గ్రామాలపై కాల్పులు జరిపారు. పాక్ కాల్పుల్లో నౌషెరా ప్రాంతంలోని లైరాన్ గ్రామంలో ప్రవీణా అఖ్తర్ (65) అనే మహిళ మరణించింది. పూంచ్ వద్ద ఈ నెల 9న పాక్ కాల్పుల్లో ముగ్గురు భారత జవాన్లు గాయపడ్డారు. అలాగే 8న 45ఏళ్ల మహిళ ప్రాణాలు కోల్పోయింది. గడిచిన 42 రోజుల్లోనే పాక్ కాల్పుల్లో 10 మంది సైనికులు, తొమ్మిది మంది సామాన్యులు మరణించారు. మరో 75 మంది గాయపడ్డారు.



అవినీతిలో కర్ణాటక బీజేపీ వరల్డ్ రికార్డ్

సిద్దరామయ్య హయాంలో కుంభకోణాలు లేవు: రాహుల్


కొప్పాళ్, ఫిబ్రవరి 11: అవినీతిలో కర్ణాటక రాష్ట్ర బీజేపీ సరికొత్త ప్రపంచ రికార్డు సృష్టించిందని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. ప్రస్తుతం కర్ణాటకను ఏలుతున్న సిద్దరామయ్య ప్రభుత్వం కుంభకోణాలు లేని సర్కారుగా నిలిచిందని రాహుల్ కొనియాడారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న కర్ణాటకలో తొలి విడత ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆయన, ఉత్తర కర్ణాటక ప్రాంతంలో రెండో రోజైన ఆదివారం కూడా విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. రాష్ట్రం బీజేపీ హయాంలో ఉన్నప్పుడు ఒకటి తరువాత ఒకటిగా కుంభకోణాలు చోటుచేసుకోగా, గత ఐదేళ్లలో అలాంటివి ఒక్కటి కూడా జరగలేదని రాహుల్ చెప్పుకొచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన 'జన ఆశీర్వాద్ యాత్ర'లో భాగంగా కొప్పాళ్ జిల్లాలో రాహుల్ ఎన్నికల ప్రచారం జోరుగా సాగింది. 'ఎన్నికలు సమీపిస్తున్నాయి, కాంగ్రెస్ పార్టీకి, సీఎం సిద్దరామయ్యకు మీరంతా మరోమారు అండగా నిలిస్తే మీకోసం మేమంతా కలిసి పనిచేయగలం, రాష్ట్రాన్ని వేగంగా అభివృద్ధి చేసేందుకు మాకు మద్దతివ్వండి' అంటూ రాహుల్ కన్నడిగులకు విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర కాంగ్రెస్‌లో హుషారు నింపిన రాహుల్ పర్యటన

ప్రత్యేక బస్సులో ఇక్కడికి వచ్చిన రాహుల్‌కు పార్టీ నేతలు ఘనంగా స్వాగతం పలికారు, పెద్ద ఎత్తున స్థానికులు కూడా రాహుల్ కార్యక్రమాలకు హాజరయ్యారు. రాహుల్ పర్యటనకు భారీ స్పందన రావడం, కర్ణాటక కాంగ్రెస్‌లో మరింత హుషారు నింపింది. బస్సు దిగి, కాసేపు సీఎం సిద్ధు, కేపీసీసీ అధ్యక్షుడు జీ పరమేశ్వరతో కలిసి నడిచిన రాహుల్‌ను దగ్గరి నుంచి చూసేందుకు స్థానికులు ఎగబడ్డారు. అవినీతిపై మాట్లాడే ప్రధాని మోదీ, కర్ణాటకలో తమ సొంత పార్టీ అవినీతిని మాత్రం చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారని బహిరంగ సభలో రాహుల్ నిప్పులు చెరిగారు. గత సర్కారు హయాంలో, ఐదేళ్లలో ముగ్గురు సీఎంలను బీజేపీ మార్చిందని, నలుగురు మంత్రులు జైలుకు వెళ్లారని ఆయన తన ప్రసంగాల్లో గుర్తు చేశారు. ఇంత జరిగినా ప్రధాని మాత్రం ఇక్కడికే వచ్చి తమ ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు చేయడం విచిత్రమని రాహుల్ అన్నారు.

వర్సిటీలో డ్రోన్ డెలివరీ.. పరీక్షించనున్న ఎయిర్‌బస్

విశాలమైన వర్సిటీ క్యాంపస్‌లో విద్యార్థులకు, ప్రొఫెసర్లకు సరికొత్త పార్సెల్ సర్వీసు వ్యవస్థను తీసుకువచ్చేందుకు సింగపూర్ జాతీయ విశ్వవిద్యాలయం ప్రయత్నిస్తోంది. క్యాంపస్‌లోపల కావాల్సిన చోటికి 2 నుంచి 4 కిలోల లోపు వస్తువులను పంపించేందుకు, అందుకునేందుకు ఎయిర్‌బస్ సాయంతో అంతర్గత డ్రోన్ డెలివరీ సేవలను ప్రారంభించనుంది. దీనిని స్కైవే డ్రోన్‌గా వ్యవహరిస్తున్నారు. ఇందుకోసం క్యాంపస్‌లో బిల్డింగ్‌లపైన ప్రత్యేక కారిడార్‌ను ఏర్పాటు చేశారు. డోమ్ వంటి ఈ నిర్మాణాలలో డ్రోన్ ద్వారా వస్తువులను పంపిస్తారట!



అమెరికాకు స్వర్ణం

వింటర్ ఒలింపిక్స్





ప్యాంగ్‌చాంగ్: దక్షిణ కొరియాలో జరుగుతున్న వింటర్ ఒలింపిక్స్‌లో అమెరికా తొలి స్వర్ణం సాధించింది. పురుషుల స్నోబోర్డ్ విభాగంలో అమెరికా స్టార్ 17 ఏళ్ల రెడ్ గెరాడ్ పసిడి పతకం సొంతం చేసుకున్నాడు. ఈ పోటీల్లో అమెరికాకు ఇదే మొదటి స్వర్ణం కావడం విశేషం. ఆదివారం జరిగిన పోటీల్లో గెరాడ్ అసాధారణ పోరాట పటిమతో ప్రథమ స్థానాన్ని దక్కించుకున్నాడు. అతనికి కెనడా అథ్లెట్ల నుంచి గట్టి పోటీ ఎదురైంది. కీలక సమయంలో స్కోరింగ్‌ను పెంచుకున్న గెరాడ్ పసిడి పతకాన్ని కైవసం చేసుకున్నాడు. హోరాహోరీగా సాగిన పోరులో గెరాడ్ 43.33, 46.40 స్కోరు సాధించి తన ఆధిక్యాన్ని 87.16కు పెంచుకున్నాడు. ప్రత్యర్థులు మార్క్స్ పారట్, మార్క్ మెక్ మోరిస్‌లు రజత, కాంస్య పతకాలతో సంతృప్తి పొందారు. ప్రతికూల వాతావరణంలోనూ గెరాడ్ అసాధారణ నైపుణ్యాన్ని ప్రదర్శించాడు. ప్రత్యర్థి ఆటగాళ్ల పోటీని తట్టుకుంటూ ముందుకు సాగి ప్రథమ స్థానాన్ని దక్కించుకున్నాడు.

హాకీలో విజయం..

మరోవైపు మహిళా ఐస్ హాకీలో కూడా అమెరికా జట్టు విజయం సాధించింది. ఆదివారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో అమెరికా ఉమెన్స్ జట్టు 3-1 తేడాతో ఫిన్‌లాండ్‌ను ఓడించింది. ప్రారంభం నుంచే అమెరికా దూకుడైన ఆటను కనబరిచింది. ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా ఆడుతూ ఘన విజయాన్ని దక్కించుకుంది.

నార్వే క్లీన్‌స్వీప్

పురుషుల స్కియథ్లాన్‌లో నార్వే క్లీన్‌స్వీప్ సాధించింది. ఈ క్రీడాంశంలో నార్వే మూడు పతకాలు గెలుచుకొని తన సత్తాను చాటింది. పురుషుల స్కియథ్లాన్‌లో సిమెన్ క్రుగర్ స్వర్ణ పతకం సాధించాడు. ఈ విభాగంలో మిగిలిన పతకాలు కూడా నార్వే ఖాతాలోకే వెళ్లాయి. క్లిష్టమైన పరిస్థితులను సైతం తట్టుకొని



క్రుగర్ రేసును పూర్తి చేసి స్వర్ణం దక్కించుకున్నాడు. జోహెన్నస్ కలెబో కూడా అద్భుత ప్రతిభతో పతకాన్ని సొంతం చేసుకున్నాడు. ఇదిలావుండగా పురుషుల 5వేల మీటర్ల స్పీడ్ స్కేటింగ్‌లో నెదర్లాండ్ ఆటగాడు స్వెన్ క్రమర్ పసిడి పతకం గెలుచుకున్నాడు. వింటర్ ఒలింపిక్స్‌లో క్రమర్‌కు ఇది వరుసగా మూడో స్వర్ణం కావడం విశేషం. ప్రారంభం నుంచే పూర్తి ఆధిపత్యం చెలాయించిన క్రమర్ ప్రత్యర్థులకు అందనంత వేగంగా లక్ష్యాన్ని చేరుకుని తన ఖాతాలో పసిడి పతకాన్ని జమచేసుకున్నాడు.

కోహ్లీ నిర్ణయం ఆశ్చర్యానికి గురిచేసింది: క్లాసెన్



జోహన్నెస్‌బర్గ్: భారత క్రికెట్ జట్టులో డెత్ ఓవర్ల స్పెషలిస్టులుగా గుర్తింపు తెచ్చుకున్న పేసర్లు భువనేశ్వర్ కుమార్, బుమ్రాలకు సాధ్యమైనన్ని ఎక్కువ ఓవర్లు ఇవ్వకపోవడంపై దక్షిణాఫ్రికా ఆటగాడు క్లాసెన్ ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. తమ జట్టు లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో స్లాగ్ ఓవర్లలో బుమ్రా, భువనేశ్వర్‌లకు భారత కెప్టెన్ కోహ్లీ బౌలింగ్ ఎందుకు ఇవ్వలేదో తనకు అర్థం కాలేదన్నాడు. వీరిని పక్కన పెట్టి స్పిన్నర్లు చాహల్, కుల్దీప్ యాదవ్‌లు చేత డెత్ ఓవర్లు వేయించడంతో ఆశ్చర్యపోయానన్నాడు. భారత జట్టులో డెత్ ఓవర్ల స్పెషలిస్టులుగా బుమ్రా, భువనేశ్వర్‌లు అందుబాటులో ఉన్నారు. మరి అటువంటప్పుడు చివరి ఓవర్లలో వారిని దూరంగా పెట్టి స్పిన్ ద్వయం చేత ఎందుకు బౌలింగ్ చేయించినట్లు. భారత పేసర్లతో ఆఖర్లో కనీసం రెండేసి ఓవర్లు వేయిస్తారని మిల్లర్-నేను అనుకున్నాం. కానీ అందుకు భిన్నంగా స్పిన్నర్ల చేత కోహ్లీ బౌలింగ్ చేయించి ఆశ్చర్యపరిచాడు. ఈ సిరీస్‌లో ఇప్పటివరకూ స్పిన్నర్లని ఎదుర్కోవడానికి ఇబ్బంది పడ్డాం. కానీ సిరీస్ ఆరంభంలో ఉన్న పరిస్థితులు ఇప్పుడు లేవు. మేము పూర్తిగా స్పిన్ ఎదుర్కొనడానికి కసరత్తులు చేశామని చెప్పడు. గత మూడు రోజుల నుంచి కుల్దీప్ బౌలింగ్‌పై బాగా హోమ్‌వర్క్ చేశాం. చైనామన్ బౌలర్(ఎడమచేతి మణికట్టు స్పిన్నర్) కుల్దీప్‌ను ఆడటానికే ఎక్కువ ఇబ్బంది పడుతున్నాం. దాంతో అతన్ని తిప్పికొట్టడానికి ఎక్కువ ప్రాక్టీస్ చేశాం' అని క్లాసెన్ పేర్కొన్నాడు. డీకాక్ స్థానంలో తుది జట్టులోకి వచ్చిన కాస్లెన్ 27 బంతుల్లో 47 పరుగులు చేసి సఫారీల విజయంలో కీలక పాత్ర పోషించాడు. నాల్గొవ వన్డేలో సఫారీ బ్యాట్స్‌మెన్‌లు భారత స్పిన్నర్ ద్వయంపై టార్గెట్ చేసి విజయం సాధించారు. ఈ మ్యాచ్‌లో కుల్దీప్-చాహల్‌లు 11.3 ఓవర్లు బౌలింగ్ వేసి 119 పరుగులిచ్చారు. అదే ఇద్దరూ కలిసిమూడు వికెట్లను మాత్రమే సాధించారు.

కొన్ని తప్పుల వల్లే ఓడిపోయాం: కోహ్లీ



జోహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికాతో జరిగిన నాల్గో వన్డేలో కూడా గెలిచి సిరీస్‌ను ముందుగానే సాధించాలనుకున్న భారత జట్టుకు నిరాశే ఎదురైంది. వరుసగా మూడు వన్డేలు ఓడి.. సిరీస్ కోల్పోయే ప్రమాదంలో పడ్డ సమయంలో సఫారీలకు కొన్ని అంశలు కలిసొచ్చాయనే చెప్పాలి. తొలుత మ్యాచ్‌పై వర్షం ప్రభావం పడగా, ఆపై భారత జట్టు తమకు వచ్చిన అవకాశాల్ని చేజార్చుకోంది. ప్రధానంగా డేవిడ్ మిల్లర్ ఒకే ఓవర్‌లో రెండు సార్లు అవుటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకోవడం భారత జట్టు విజయంపై ప్రభావం చూపింది. దీనితో భారత కెప్టెన్ కోహ్లి కూడా ఏకీభవించాడు. మ్యాచ్ తర్వాత షాన్ పొలాక్ చేసిన ఇంటర్వ్యూలో మాట్లాడిన కోహ్లి..' మాకు వచ్చిన అవకాశాల్ని చేజార్చుకున్నాం. ఏబీ అవుటైన తర్వాత మ్యాచ్‌లో విజయం ఖాయమని అనుకున్నాం. మిల్లర్, క్లాసెన్‌లు విజయాన్ని మాకు దూరం చేశారు. మా నుంచి మ్యాచ్‌ను లాగేసుకున్నారు. యజ్వేంద్ర చాహల్ బౌలింగ్ మిల్లర్ ఇచ్చిన డీప్ స్క్వేర్ లెగ్‌లో శ్రేయస్ అయ్యర్ వదిలేశాడు. మళ్లీ అదే ఓవర్‌లో మిల్లర్ బౌల్డ్ అయినప్పటికీ ఆ బంతి నో బాల్‌గా తేలడంతో అతను మరోసారి బతికి పోయాడు. దాంతో మాకు విజయావకాశాలు సన్నగిల్లాయి. మరొకవైపు వర్షం కూడా మా విజయాన్ని దూరం చేసిందనే చెప్పాలి. వర్షం కారణంగా మ్యాచ్ ఒక్కసారిగా టీ20 తరహాలో మారిపోయింది. ఇవన్నీ ఫలితం మాకు ప్రతికూలంగా మారడానికి కారణం. తదుపరి వన్డేల్లో ఎటువంటి పొరపాట్లు చేయకుండా విజయాన్ని సొంతం చేసుకుంటామనే ఆశిస్తున్నా' అని కోహ్లి పేర్కొన్నాడు.

నాలుగో వన్డేలో తొలుత బ్యాటింగ్ చేసిన భారత జట్టు 50 ఓవర్లలో ఏడు వికెట్లకు 289 పరుగులు చేసింది. అయితే పదే పదే వర్షం కురవడంతో సఫారీల లక్ష్యం 28 ఓవర్లలో 202కు కుదించడం ఆ జట్టుకు వరమైంది. చేతిలో 9 వికెట్లు ఉండటంతో దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మెన్ టీ-20 తరహాలో ఆడి జట్టును 25.3 ఓవర్లలో 207 పరుగులు చేసి గెలిపించారు.

కొంప ముంచిన వర్షం, మిల్లర్: ధావన్



రెండు సార్లు వర్షం అంతరాయం కలిగించడం, డేవిడ్ మిల్లర్ దూకుడుగా ఆడటంతో టీమిండియా అవకాశాలు దెబ్బతిన్నాయని ఓపెనర్ శిఖర్ ధావన్ అన్నాడు. ఆరు వన్డేల సిరీస్‌లో భాగంగా శనివారం జరిగిన నాలుగో మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 5 వికెట్ల తేడాతో గెలిచిన సంగతి తెలిసిందే. నాలుగు మ్యాచ్‌లు ముగిసే సరికి ఆరు మ్యాచ్‌ల సిరీస్‌లో టీమిండియా 3-1తో ఆధిక్యంలో ఉంది. నాలుగో వన్డేలో విధ్వంసకర డేవిడ్ మిల్లర్‌కు రెండు సార్లు జీవన దానాలు లభించాయి. 6 పరుగుల వద్ద క్యాచ్ మిస్సవ్వగా, 7 పరుగుల వద్ద చాహల్ నోబాల్ విసిరాడు. ఆ తర్వాత అతడు చెలరేగి ఆడి 28 బంతుల్లోనే 39 పరుగులు చేశాడు. 'క్యాచ్ చేజారడం, నోబాల్‌కు వికెట్ పడటమే కీలకంగా మారాయి. వాటితో మ్యాచ్ గమనం మారింది. లేదంటే మేం అప్పటికే మంచి



స్థానంలో ఉన్నాం. ఈ మ్యాచ్‌పై వర్షం ప్రభావమూ కూడా పడింది. దాంతో గత మూడు మ్యాచుల్లో తిప్పినట్టు మా స్పిన్నర్లు బంతిని తిప్పలేక పోయారు. బంతి తడిచినప్పుడు ఆట భిన్నంగా ఉంటుంది' అని ధావన్ అన్నాడు. రెండు సార్లు వర్షం రావడంతో దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌ను డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 28 ఓవర్లకు కుదించారు. రెండు సార్లు వర్షం రావడంతో ఔట్‌ఫీల్డ్ అంతా చిత్తడిగా మారింది. దానికి తోడు మిల్లర్ చాలా బాగా ఆడాడు. అతనికి అదృష్టమూ తోడైంది. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని మ్యాచ్ గమనాన్ని మార్చేశాడు. మా యువ స్పిన్ ద్వయం ఇప్పటి వరకు చాలా మంచి ప్రదర్శనలు చేసింది. వారికి మేమెప్పుడూ మద్దతుగా నిలుస్తాం. ప్రతి ఒక్కరికీ ఇలాంటి రోజులు ఉంటాయి. స్పిన్నర్లు వికెట్లు తీస్తారని మా సారథి భావించి ఉంటాడు. అందుకే భువి, బుమ్రాకు బంతి ఇవ్వలేదు. నా వందో మ్యాచులో వంద పరుగులు చేయడం చాలా సంతోషంగా ఉంది. నా లయను చక్కగా కొనసాగించాను' అని ధావన్ అన్నాడు. ఈ మ్యాచ్‌లో కోహ్లీకూడా మంచిగా ఆడాడు. మేమిద్దరము రెండో వికెట్‌కు మంచి భాగస్వామ్యాన్ని నెలకొల్పామని ధావన్ చెప్పాడు.

అజార్, గేల్‌లను అధిగమించిన కోహ్లీ



రికార్డుల రారాజు, టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ మరో అరుదైన ఘనతను చేరుకున్నాడు. అజారుద్దీన్, క్రిస్ గేల్ రికార్డులను అధిగమించి.. భారత్ తరఫున అత్యధిక వన్డే పరుగులు సాధించిన టాప్-5 ఆటగాళ్ల జాబితాలో చేరాడు.

దక్షిణాఫ్రికాతో జరిగిన నాలుగో వన్డేలో కోహ్లీ 83 బంతుల్లో 75 పరుగులు చేశాడు. దీంతో మొత్తం 206 వన్డేల్లో కోహ్లీ చేసిన పరుగులు 9,423కు చేరాయి. ఈ పరుగులతో కోహ్లీ.. మాజీ కెప్టెన్ అజారుద్దీన్(9378 పరుగులు), వెస్టిండీస్ ఆటగాడు క్రిస్ గేల్(9,420)లను అధిగమించాడు. అజారుద్దీన్ 308 ఇన్నింగుల్లో(334 మ్యాచ్‌లు) 9,378 పరుగులు సాధిస్తే.. కోహ్లీ 198 ఇన్నింగుల్లోనే(206 మ్యాచ్‌ల)లోనే ఈ ఘనత సాధించడం విశేషం. మరోవైపు కోహ్లీ వన్డేల్లో అత్యధిక పరుగులు సాధించిన టాప్-5 భారత ఆటగాళ్ల జాబితాలోకి చేరాడు. ఈ జాబితాలో సచిన్(18,426), గంగూలీ(11,363), ద్రవిడ్(10,889), ధోని(9,954) వరుసగా మొదటి నాలుగు స్థానాల్లో ఉన్నారు. అజరుద్దీన్‌ను అధిగమించి కోహ్లీ ఐదో స్థానంలో చేరుకున్నాడు.






సౌతాఫ్రికా జట్టుకు జరిమానా

జోహన్నెస్‌బర్గ్: భారత్‌తో ఇక్కడ జరిగిన నాలుగో వన్డేలో గెలిచిన ఆనందంలో ఉన్న సౌతాఫ్రికా జట్టుకు జరిమానా పడింది. మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్ కారణంగా సఫారీ జట్టుకు జరిమానా విధిస్తూ అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసీసీ) నిర్ణయం తీసుకుంది. సఫారీ కెప్టెన్ మర్‌క్రామ్‌కు మ్యాచ్ ఫీజులో 20 శాతం కోత విధించగా, ఆటగాళ్లకు 10 శాతం చొప్పన జరిమానా విధించారు. ఒకవేళ వచ్చే 12 నెలల్లో మర్‌క్రామ్ జట్టుకు సారథిగా వ్యవహరించి, అదే సమయంలో మరొకసారి స్లో ఓవర్ రేట్‌కు కారణమైతే అతనిపై మ్యాచ్ నిషేధం పడనుంది. శనివారం జరిగిన నాలుగో వన్డే మ్యాచ్‌లో సౌతాఫ్రికా ఐదు వికెట్ల తేడాతో(డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం) గెలిచిన సంగతి తెలిసిందే.

ఫెదరర్ @1



పారిస్: స్విట్జర్లాండ్ టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెదరర్ పురుషుల సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్ స్థానాన్ని దక్కించుకున్నాడు. రోటర్‌డామ్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో సెమీఫైనల్‌కు చేరుకోవడం ద్వారా స్విస్ స్టార్ ఫెదరర్ తన కెరీర్‌లో మరోసారి అగ్రస్థానానికి చేరుకున్నాడు. ప్రతిష్టాత్మకమైన ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్‌లో టైటిల్ సాధించిన ఫెదరర్ తాజాగా తన ఖాతాలో నంబర్‌వన్ ర్యాంక్‌ను దక్కించుకున్నాడు. అతని చిరకాల ప్రత్యర్థి రఫెల్ నాదల్ గాయం వల్ల కొన్ని పోటీలకు దూరం కావడంతో ఫెదరర్‌కు నంబర్‌వన్ ర్యాంక్ దక్కింది. ఐదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత స్విస్ దిగ్గజం ఫెదరర్ మరోసారి పురుషుల సింగిల్స్‌లో తిరిగి నంబర్‌వన్ ర్యాంక్‌ను సాధించాడు. ఇంత సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్‌ను సాధించిన తొలి ఆటగాడిగా కూడా ఫెదరర్ రికార్డు సృష్టించాడు. అంతేగాక 36 ఏళ్ల వయసులో ఈ ర్యాంక్‌ను సాధించడం ద్వారా తనలో చేవ తగ్గలేదని మరోసారి నిరూపించాడు. పురుషుల టెన్నిస్‌లో ఎదురులేని శక్తిగా కొనసాగుతున్న ఫెదరర్ ఇప్పటికే తన ఖాతాలో 20 గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ జమ చేసుకున్నాడు. మరోవైపు నాదల్, ముర్రే, జొకోవిచ్‌లు గాయాలతో సతమతమవుతు ఆటకు దూరంగా ఉంటుండడంతో ఫెదరర్‌కు ఎదురే లేకుండా పోయింది. ప్రపంచ టెన్నిస్‌లోనే అత్యుత్తమ ఆటగాళ్లుగా పేరు తెచ్చుకున్న నాదల్, జొకోవిచ్, ముర్రేలు ఇప్పటికిప్పుడూ గాయాల నుంచి కోలుకునే అవకాశాలు కనిపించడం లేదు. దీంతో మరి కొంత కాలం పాటు ఫెదరర్ నంబర్‌వన్ ర్యాంక్‌కు పెద్దగా పోటీ ఎదురుకాక పోవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

ప్రపంచకప్‌లో భారత్‌ను ఓడించడం కష్టమే: కెప్లర్ వెసెల్స్



జోహన్నెస్‌బర్గ్: విరాట్ కోహ్లీ సారథ్యంలోని ప్రస్తుత భారత వన్డే జట్టును 2019 వన్డే ప్రపంచకప్‌లో ఓడించడం ఏ జట్టుకైనా కష్టమేనని దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ కెప్లర్ వెసెల్స్ అభిప్రాయపడ్డారు. ఆరు వన్డేల సిరీస్‌లో తొలి మూడు మ్యాచ్‌ల్లో సునాయాసంగా గెలుపొంది.. నాలుగో వన్డేలో భారత్ పరాజయంపాలైన సందర్భంగా ఆయన స్పందించారు. ప్రపంచకప్‌లో తలపడే జట్లలో టీమిండియా ఫేవరెట్ అని చెప్పలేను. కానీ వాళ్లు గట్టి పోటీనిస్తారు. ప్రధాన ఆటగాళ్లు గాయాల బారిన పడకుండా ఉంటే అది ఆ జట్టుకు లాభం చేకూర్చే అంశం. వాళ్లను ఓడించడం అంత సులువైన విషయం కాదు. అని కెప్లెర్ అన్నారు. రోహిత్ ఫుట్‌వర్క్ సమస్య...దక్షిణాఫ్రికా పర్యటనలో రోహిత్ శర్మ పరుగులు చేయకుండా వరుసగా విఫలమవడానికి అతని ఫుట్‌వర్కే పెద్ద సమస్యని మాజీ సారథి వివరించారు. సీమ్, బౌన్స్‌లకు సహకరించే పిచ్‌లపై అతని టెక్నిక్‌లో మార్పులు చేసుకోవాల్సిన అవసరముంది. భారత్‌తో పాటు ఆస్ట్రేలియాలో తన టెక్నిక్‌పై ఎలాంటి ప్రభావం ఉండదని ఎందుకంటే అక్కడ బంతి బౌన్స్ మాత్రమే అవుతుందని సీమ్ అంతగా ఉండదని అన్నారు. సీమ్, బౌన్స్ ఉన్న పిచ్‌లపై మాత్రమే అతడు ఇబ్బంది పడుతున్నాడని చెప్పాడు. ఈ పిచ్‌లను కూడా అతను అర్థం చేసుకుంటే.. రోహిత్‌ను ఆపడం ఏ బౌలర్ తరం కాదని అభిప్రాయపడ్డాడు.

జడేజా అజేయ సెంచరీ

జార్ఖండ్‌పై సౌరాష్ట్ర విజయం • విజయ్ హజారే వన్డే టోర్నీ



హైదరాబాద్: విజయ్ హజారే ట్రోఫీ వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో సౌరాష్ట్ర నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో ఆదివారం జరిగిన గ్రూప్-డి మ్యాచ్‌లో ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా వీరోచిత ఇన్నింగ్స్ ఆడాడు. భారీ పరుగుల లక్ష్య ఛేదనలో జడేజా (113 నాటౌట్) సెంచరీతో తమ జట్టుకు గొప్ప విజయాన్ని అందించాడు. జార్ఖండ్ నిర్దేశించిన 330 పరుగుల భారీ లక్ష్యాన్ని సౌరాష్ట్ర మరో 10 బంతులు మిగిలుండగానే 6 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. రవీంద్ర జడేజా 116 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్స్‌లతో 113 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. చివర్లో చిరాగ్ జాని 46 బంతులు, 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 59 పరుగులు, అర్పిత్ వాసవడ 24 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్‌తో 36 పరుగులు వేగంగా ఆడి విజయంలో తమవంతు సహకారం అందించారు. కెప్టెన్ చేతేశ్వర్ పూజారా (44), రాబిన్ ఉతప్ప (32) కూడా పర్వలేదనిపించారు. దీంతో సౌరాష్ట్ర (48.2 ఓవర్లలో) 333/6 పరుగులు చేసి గెలుపొందింది. అంతకుముందు బ్యాటింగ్ చేసిన జార్ఖండ్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 329 పరుగుల భారీ స్కోరు సాధించింది. జార్ఖండ్‌లో ఇషాన్ కిషన్ అద్భుత బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. చెలరేగి ఆడిన ఇతను 96 బంతుల్లో 5 ఫోర్లు, 7 భారీ సిక్సర్లతో 93 పరుగులు చేశాడు. మరోవైపు సుమిత్ కమార్ (57 బంతులు, 7 ఫోర్లు, 1 సిక్స్)తో 64 పరుగులు, విరాట్ సింగ్ (44), వికాస్ (22 నాటౌట్) కూడా రాణించారు. సౌరాష్ట్ర బౌలర్లలో జయదేవ్ ఉనద్కట్, శౌర్య సనదియ, చిరాగ్ జానిలు తలో రెండు వికెట్లు తీశారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at M/s JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press D.no.5-625, Atamkur village, Mangalagiri Mandal, Guntur District, Andhra Pradesh, And Published at H.No. 23-3-46, 1st Floor, Katamaraju vari veedhi, Amaravathi road, Naidu pet, Guntur (District)ANDHRAPRADESH - 522002. Editor : VUPPARI RAMESH KUMAR, RNI Reg No. APTEL/2016/73939, Phone No. 040-46519999, e-mail id: editor@manamnews.com, Web Edition www.manamnews.com